ప్రతిపక్షం

www.prathipaksham.in

బుధవారం 10.12.2025 | Published From Hyderabad | సంపుటి: 18 సంచిక: 260 పేజీలు:12 | ₹5

ఆదరగొట్టిన పాండ్యా, అర్ష్‌దీప్, టీమిండియా విజయం 12

@prathipaksham

prathipaksham tv telugu

పెట్టుబడుల వరద

రెండు రోజులు: రూ. 5,39,495 కోట్లు

దేశ, విదేశీ దిగ్గజ కంపెనీలతో ఒప్పందాలు

- సీఎం రేవంత్ తో ప్రముఖ పారిశ్రామికవేత్తల భేటీ
- లక్షలాది మంది యువతకు ఉపాధి అవకాశాలు
- ఆర్‌సీటీ ఎనర్జీ రూ. 2,500 కోట్లకు ఎంఓయూ
- రూ. 2 వేల కోట్ల పెట్టుబడికి -ఫెర్టిస్ ఇండియా రెడీ
- రిలయన్స్ కన్స్యూమర్స్ రూ.1,500 కోట్లకు సిద్ధం
- భారీ పెట్టుబడులు పెడతామన్న భారత్ బయోటెక్
- అంచనాలకు మించి ప్రపంచ కంపెనీల ఆసక్తి
- సమావేశాలతో తీరిక లేకుండా గడిపిన సీఎం
- ఆనందం వ్యక్తం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వ వర్గాలు

"రాష్ట్రంలో రూ.1000 కోట్లు పెట్టుబడి పెట్టేందుకు భారత్ బయోటెక్ ఇంటర్నేషనల్ సంస్థ ముందుకు వచ్చింది. కాంట్రాక్ట్‌రీసెర్చ్, డెవలప్‌మెంట్‌అండ్ మ్యానుఫ్యాక్చరింగ్ ఆర్గనైజేషన్(సీఆర్‌డీఎంఓ) నిర్మాణానికి రూ.1000 కోట్లు పెట్టుబడి పెట్టనుంది. వచ్చే నాలుగేళ్లలో దీని ద్వారా 200 మందికిపైగా ఉద్యోగాలు కల్పించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంది. తెలంగాణలో డెయిరీ విస్తరణ కోసం గోద్రెజ్ ఇండస్ట్రీస్ గ్రూప్ ఒప్పందం కుదుర్చుకుంది. ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్‌డీ సెంటర్ కోసం ఫెర్టిస్ ఇండియాతో ఒక ఒప్పందం జరిగింది.

ప్రతిపక్షం ప్రధాన ప్రతినిధి

ఫ్యూచర్ సిటీ (హైదరాబాద్), డిసెంబర్ 9 : తెలంగాణ ప్రభుత్వం ఫ్యూచర్ సిటీలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమిట్ 2047' పెట్టుబడులు వరదగా పారాయి. దేశ, విదేశాలకు చెందిన దిగ్గజ కంపెనీలు ఆయా రంగాలలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా తీసుకున్న 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్' లో ఆయన అంచనాలకు మించి పెట్టుబడుల మీద అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నారు. దీంతో ప్రభుత్వ వర్గాలలో ఆనందం వ్యక్తమైంది. మంగళవారం వివిధ కంపెనీల ప్రతినిధులతో సీఎం రేవంత్ రెడ్డి వరుస సమావేశాలు నిర్వహిస్తూ బిజీ బిజీగా గడిపారు. రెండు రోజుల సమ్మిట్ లో రాష్ట్రంలో రూ.5,39,495 పెట్టుబడులు పెట్టేందుకు దిగ్గజ కంపెనీలు ప్రభుత్వంతో సీఎం సమక్షంలో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నాయి. గోద్రెజ్ జెర్సీ ఎగ్జిక్యూటివ్ వైస్‌చైర్మన్ ఫిరోజ్ షా గోద్రెజ్, గ్రూప్ ప్రెసిడెంట్ రాకేశ్ స్వామి సీఎంతోసమావేశమయ్యారు. హైదరాబాద్‌లో తమ సంస్థ విస్తరణపై చర్చించారు. పాలు, ఎఫ్‌ఎంసీజీ, రియల్‌ఎస్టేట్, ఆయిల్‌పామ్ విభాగాలలో

...:: మిగతా 2లో

జనంబాటలో కవిత గర్జన

తెలంగాణ రాజకీయాలలో తుఫాను

అధికార, విపక్ష నేతలపై మాటల దాడి

- తండ్రి, మాజీ సీఎం కేసీఆర్ పైనా విమర్శలు
- సీఎం రేవంత్ ను కూడా అడుగడుగునా నిలదీత
- హరీశ్ రావు, సంతోష్ రావు జంటపై మండిపాటు
- బీఆర్ఎస్ మాజీ మంత్రులనూ వదలని వైనం
- క్షేత్రస్థాయిలో సమస్యల సునిశిత పరిశీలన
- సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందడుగు
- తానున్నానంటూ బాధిత ప్రజలకు భరోసా
- కలకలం సృష్టిస్తున్న తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు

చిటుకుల మైసారెడ్డి

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్ 9: తెలంగాణ రాజకీయాలలో గత కొన్ని నెలలుగా నిశ్శబ్దంగా కదిలిన అల ఇప్పుడు ఒకేసారి ప్రళయ తరంగంగా మారింది. ఆ అల పేరే కల్వకుంట్ల కవిత. ఇప్పటి వరకు పార్టీ బంధాలు, కుటుంబ బంధాలు, అనుబంధాలు అన్నిటినీ పక్కన పెట్టి, ప్రజల సమస్యలను ముందుకు ఉంచుతూ కవిత చేసే వ్యాఖ్యలు రాష్ట్ర రాజకీయాలలో హాట్ టాక్ అయ్యాయి. 'ఎవరైనా తప్పు చేస్తే వదలను, డోంట్ కేర్' అని తేలికగా చెప్పేస్తున్న కవిత, ఇప్పుడు ప్రత్యక్షంగా మాజీ ముఖ్యమంత్రి, తన తండ్రి కేసీఆర్‌ను కూడా విమర్శల జాడీలో పెడుతున్నారు. బీఆర్ఎస్ పార్టీ నుంచి సస్పెన్షన్‌కు గురైన రోజునే కవితలో ఏదో మార్పు కనిపించింది. అప్పటివరకు అంతర్గత గొడవలంటూ నెట్టేసిన ఆరోపణలు, ఒక్కసారిగా తీవ్ర రూపం దాల్చాయి. హరీశ్ రావు - సంతోష్ రావు జంట పార్టీని భ్రష్టు పట్టించదని, అధినేత కేసీఆర్ కండ్లుగప్పి అనేక అక్రమాలు జరిగాయని, కేటీఆర్‌ను అజ్ఞాతంలో ఉంచి రాజకీయ గేములు ఆడారని ఆమె చేసిన వ్యాఖ్యలు బీఆర్ఎస్‌లో పెద్ద చీలిక సృష్టించాయి. పార్టీ తప్పించడంతో ఎమ్మెల్సీ పదవి కూడా వదిలేసి ఏ రాజకీయ లెక్కలు లేకుండా కవిత నేరుగా ప్రజలలోకి అడుగు పెట్టారు.

విమర్శలలో పదును పెరిగింది

తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత విమర్శలలో పదును పెరిగింది. అంశాలవారీగా ఆరోపణలకు ప్రాధాన్యమిస్తున్న కవిత ఆ సందర్భాన్ని బట్టి మాజీ సీఎం, తండ్రి కేసీఆర్ ను కూడా మినహాయించడం లేదు. పదునైన విమర్శనాస్త్రాలతో రాష్ట్ర రాజకీయాలను ఓ కుదుపు కుదుపుతున్నారు. జాగృతి జనంబాటతో రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాలలో పర్యటిస్తున్న కవిత సమస్యలను లేవనెత్తుతూనే వాటికి బాధ్యులైన

...:: మిగతా 2లో

ఓట్ చోరీపై నిలదీసిన రాహుల్

కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ లోక్‌సభ లో తీవ్ర వ్యాఖ్యలు చేశారు. దేశంలోని ప్రజాస్వామ్యాన్ని నాశనం చేసేందుకే బీజేపీ సర్కారు ఎన్నికల కమిషన్‌ను వాడుకుంటోందని విమర్శించారు.

11

ఇండోనేషియాలో అగ్నిప్రమాదం

ఇండోనేషియాలో విషాదం చోటు చేసుకుంది. ఆ దేశ రాజధాని జకార్తాలో ఓ ఏడు అంతస్తుల భవనంలో అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో సుమారు 20 మంది సజీవ దహనమయ్యారు. అగ్నిమాపక సిబ్బంది సహాయక చర్యలు చేపట్టింది.

11

సోనియాకు ఢిల్లీ కోర్టు నోటీసులు

- పౌరసత్వంపై వివరణ ఇవ్వాలని ఆదేశం
- ఫోర్జరీ ద్వారా ఓటు హక్కు పొందారన్న పిటిషనర్
- క్రిమినల్ కేసు నమోదు చేయాలని వినతి
- విచారణ జరిపిన రౌస్ అవెన్యూ కోర్టు

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో

హైదరాబాద్, డిసెంబర్ 9 : కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియాగాంధీకి ఢిల్లీ కోర్టు నోటీసులు ఇచ్చింది. 1983లో భారత పౌరసత్వం పొందడానికి మూడేండ్ల ముందే అంటే 1980లో సోనియా గాంధీ ఓటు హక్కు పొందారని, మోసం, ఫోర్జరీ ద్వారా ఓటు హక్కు పొందిన ఆమెపై క్రిమినల్ కేసు నమోదు చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌కు సమాధానం చెప్పాలని కోర్టు నోటీసులలో పేర్కొంది. సోనియా గాంధీతోపాటూ ఢిల్లీ పోలీసులకు కూడా నోటీసులు జారీ చేసింది. సోనియాగాంధీ 1983 ఏప్రిల్ 30న భారత పౌరసత్వం పొందిన విషయం తెలిసిందే. అయితే, అంతకు ముందే అంటే 1980లోనే

...:: మిగతా 2లో

ప్రతి కుటుంబానికి సొంతిల్లు ప్రభుత్వ సంకల్పం

- గృహ నిర్మాణంపై సమగ్ర విధానం రూపకల్పన
- అందుబాటులో గృహ నిర్మాణ విధానం 2047
- ఔటర్, రీజినల్ రింగ్ రోడ్ల మధ్యలో అఫోర్డబుల్ హౌసింగ్
- రాష్ట్రంలో ప్రాంతాల వారీగా వ్యూహాలు
- రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరబాద్, డిసెంబర్9: రాష్ట్రంలోని ప్రతి కుటుంబం ఉన్నతమైన ప్రమాణాలతో నివసించేందుకు అనువైన సొంత ఇంటి వసతిని కల్పించాలన్నది ప్రభుత్వ సంకల్పమని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ , సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు. ముఖ్యంగా అన్ని వర్గాల ప్రజలకు అనువుగా ఉండే ధరల్లో ఉండేట్లుగా ఒక సమగ్ర విధాన రూపకల్పనకు తెలంగాణా రైజింగ్ 2047 - గ్లోబల్ సమ్మిట్ చక్కటి వేదిక అని ఆయన పేర్కొన్నారు. భారత్ ఫ్యూచర్ సిటీలో జరుగుతున్న గ్లోబల్ సమ్మిట్ లో భాగంగా మంగళవారం 'అఫోర్డబుల్ హౌసింగ్ పాలసీ ఫర్ అర్బన్ ఫ్యూచర్ - తెలంగాణా మోడల్ 2047' అనే అంశంపై జరిగిన సదస్సులో మంత్రి కీలక ఉపన్యాసం చేశారు. పెరుగుతున్న పట్టణీకరణతో పాటు, విస్తృతమవుతున్న గృహ అవసరాలను దృష్టిలో ఉంచుకుని దేశానికి ఆదర్శంగా ఉండేలా ఆర్థికంగా సాధ్యమైన, పర్యావరణ పరిరక్షణకు అనుగుణమైన, సాంకేతికత ఆధారిత అంశాలు ఉండేలా

...:: మిగతా 2లో

సాధారణ స్థితికి విమాన సేవలు

సంక్షోభంపై ఇండిగో సంస్థ మంగళవారం కీలక ప్రకటన చేసింది. విమాన సేవలు సాధారణ స్థితికి చేరుకుంటున్నాయని ఇండిగో ఎయిర్‌లైన్స్ ప్రకటించింది. విమానాలన్నీ క్రమం తప్పకుండా నడుస్తాయని కంపెనీ తెలిపింది.

11

సీఎం రేవంత్‌కు త్రుటిలో తప్పిన ప్రమాదం

- పేలిన జామర్ వాహనం టైర్
- హైదరాబాద్ ఓఆర్ఆర్‌పై ఘటన
- గతంలోనూ రేవంత్ కాన్వాయ్‌లో ఇలాంటి ఘటనే

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో

హైదరబాద్, డిసెంబర్9: సీఎం రేవంత్ రెడ్డి కాన్వాయ్‌కి త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు ఓఆర్ఆర్, ఎగ్జిట్ 17 వద్ద వేగంగా ప్రయాణిస్తున్న

...:: మిగతా 2లో

మార్చి14 నుంచి పదో తరగతి పరీక్షలు

- షెడ్యూల్ విడుదల చేసిన రాష్ట్ర విద్యాశాఖ
- ఈసారి పరీక్ష తేదీలలో అనూహ్య మార్పులు
- ప్రతి పరీక్షకు 4 లేదా 5 రోజుల విరామం

...:: 2లో

ముగిసిన 'పంచాయతీ' ప్రచారం

- రేపే మొదటి విడత పోలింగ్
- 4,235 పంచాయతీలలో ఓటింగ్
- 56 లక్షల 19 వేల 430 మంది ఓటర్లు
- అదే రోజు కౌంటింగ్, ఫలితాలు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో

హైదరాబాద్, డిసెంబర్ 9: తెలంగాణలో మొదటి విడత పంచాయతీ ఎన్నికల ప్రచారం ముగిసింది. గురువారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్ జరగనుంది. మొదటి విడతలో 189 మండలాలు, 4,235 పంచాయతీలలో 56 లక్షల 19 వేల 430 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారు. అందులో 27 లక్షల 41 వేల 70 పురుష ఓటర్లు, 28 లక్షల 78 వేల 159 మంది మహిళా ఓటర్లు.. 201 ఇతర ఓటర్లు వున్నారు. మొదటి విడతలో 37వేల 562 పోలింగ్ కేంద్రాలు వున్నాయి. అదే రోజు మధ్యాహ్నం కౌంటింగ్, అనంతరం ఫలితాలు ప్రకటిస్తారు. మంగళవారం సాయంత్రం 6 గంటల నుంచి ఎల్లుండి సాయింత్రం 6 గంటల వరకు మద్యం దుకాణాలు, బెల్ట్ షాపులు బందయ్యాయి. మొదటి విడతలో 395 గ్రామ పంచాయతీలు ఏకగ్రీవం అయ్యాయి.

భారత్‌తో బలమైన బంధం

అమెరికా కాంగ్రెస్ నాయకులు భారత్‌తో బలమైన బంధాలను కోరుకుంటున్నారు. తాజాగా అమెరికా కాంగ్రెస్ నాయకులు 'నేషనల్ డిఫెన్స్ ఆథరైజేషన్ యాక్ట్' పేరుతో వార్షిక రక్షణ బిల్లును విడుదల చేశారు.

11

రాష్ట్రీయం

సీఎంఓ, లోక్‌భవన్‌కు బాంబు బెదిరింపు

- 'వాసుకీ ఖాన్' అనే పేరుతో ఈ మెయిల్

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్ 9 : తెలంగాణ రాష్ట్రంలో మరోసారి బాంబు బెదిరింపు కలకలం సృష్టించింది. ఈసారి ఏకంగా ముఖ్యమంత్రి కార్యాలయం (సీఎంఓ), లోక్ భవన్ (రాజ్ భవన్) ను పేల్చడానికి కుట్ర జరుగుతోందంటూ ఓ అగంతకుడు గవర్నర్ కార్యాలయానికి ఈమెయిల్ పంపాడు. 'వాసుకీ ఖాన్' అనే పేరుతో వచ్చిన ఈ బెదిరింపు మెయిల్‌లో, వెంటనే వీఐపీలను, ప్రముఖులను ఆ భవనాల నుంచి ఖాళీ చేయించాలని బెదిరించినట్లు సమాచారం. ఈ మెయిల్ అందిన వెంటనే గవర్నర్ కార్యాలయం అప్రమత్తమైంది. సీఎస్ఓ శ్రీనివాస్ పంజాగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆ మెయిల్ ఎక్కడ నుంచి వచ్చింది, దాన్ని ఎవరు పంపారు అనే దానిపై క్షుణ్ణంగా దర్యాప్తు చేస్తున్నారు. మరోవైపు 'జాస్పర్ పకార్ట్' అనే వ్యక్తి (అమెరికా, న్యూయార్క్) నుంచి మరో మెయిల్ పంపినట్టు అధికారులు గుర్తించారు. శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ నుంచి అమెరికా వెళ్లే విమానాలలో బాంబు అమర్చామని, ఆ విమానాలు టేకాఫ్ అయిన పది నిమిషాలలో బాంబు పేలుతుందని అగంతకుడు బెదిరించాడు. ఈ పేలుడు జరగకూడదంటే ఒక మిలియన్ డాలర్లు (సుమారు రూ. 8.3 కోట్లు) ఇవ్వాలని డిమాండ్ చేశాడు. మెయిల్ అందిన వెంటనే ఎయిర్‌పోర్ట్ అధికారులు అప్రమత్తమయ్యారు. ఎయిర్‌పోర్ట్‌లోని అన్ని ప్రాంతాల్లో, ముఖ్యంగా అమెరికాకు వెళ్లాల్సిన విమానాల్లో భద్రతా తనిఖీలను ముమ్మరం చేశారు.

తెలుగు రాష్ట్రాలకు 9 మంది ఐఏఎస్ అధికారులు

- 8 మంది ఆంధ్రప్రదేశ్ కు, ఒక్కరు తెలంగాణకు

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, డిసెంబర్ 9 : కేంద్ర ప్రభుత్వం 2024 బ్యాచ్ కు ఎంపికైన 179 మంది ఐఏఎస్ అధికారులలో 10 మందిని తెలుగు రాష్ట్రాలకు కేటాయించింది. ఇందులో ఎనిమిది మంది ఏపీకి, ఇద్దరు తెలంగాణకు అలాట్ అయ్యారు. ఈ మేరకు ఏపీ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులకు కేంద్ర సిబ్బంది, శిక్షణ వ్యవహారాల శాఖ లేఖ రాసింది. ఏపీ కేడర్ కు కేటాయించినవారిలో బన్నా వెంకటేష్, ఏఆర్ పవన్ తేజ (ఆంధ్రప్రదేశ్), కె.ఆదిత్యశర్మ, చింతకింది శ్రవణ్ కుమార్ రెడ్డి (తెలంగాణ), హరిఓం పాండియా (రాజస్థాన్), నమ్రతా అగర్వాల్ (హర్యానా), ప్రియ (ఢిల్లీ), సుయష్ కుమార్ (ఉత్తరప్రదేశ్) ఉన్నారు. ఏపీ స్వరాష్ట్రంగా ఉన్న చెన్నంరెడ్డి శివగణేశ్ రెడ్డిని, ఏజీఎం యూటీ (అరుణాచల్ ప్రదేశ్, గోవా, మిజోరం, కేంద్ర పాలిత ప్రాంతాలు) కేడర్ కు పి.సురేశ్ ను తెలంగాణ కేడర్ కు కేటాయించారు

ఘనంగా సోనియా గాంధీ జన్మదిన వేడుకలు

కాంగ్రెస్‌అగ్ర నేత సోనియా గాంధీ జన్మదిన వేడుకలను గాంధీ భవన్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో స్కూల్ పిల్లలకు పుస్తకాలు, నోటు బుక్కులు పంపిణీ చేశారు. పీసీసీ అధ్యక్షులు మహేష్ గౌడ్, హనుమంత్ రావు, ఫిషరీస్‌చైర్మన్ మెట్టు సాయికుమార్ స్కూలు పిల్లలకు పుస్తకాలు అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

- ప్రతిపక్షం, హైదరాబా

బీజేపీ సోషల్ మీడియా ఇన్చార్జి అరెస్ట్

- కిషన్ రెడ్డి, రాంచంద్రారెడ్డి ఆగ్రహం

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్ 9 : తెలంగాణలో ప్రతిపక్షాలపై అణచివేత మరింత తీవ్రతరమవుతోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆరోపించారు. అప్పుడు బీఆర్ఎస్, ఇప్పుడు కాంగ్రెస్ అదే మార్గంలో ప్రయాణిస్తున్నాయని విమర్శించారు. అర్ధరాత్రి ఇంటి తలుపులు బద్దలు కొట్టి బీజేపీ సోషల్ మీడియా కన్వీనర్‌ను అరెస్టు చేయడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ ఒక పోస్టర్ పెట్టి ప్రశ్నిస్తే ఇంత దారుణంగా ప్రవర్తిస్తారా అంటూ మండిపడ్డారు.గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్ లో పెట్టుబడిదారులకు ఒకవైపు ఆహ్వానం పలుకుతూ, మరోవైపు రాష్ట్రంలో భావ వ్యక్తీకరణ స్వేచ్ఛను హరిస్తున్నారని అన్నారు. పెట్టుబడిదారులు నమ్మకంతో రాష్ట్రానికి రావాలంటే ఇది సరైన తీరు కాదన్నారు. ప్రతిపక్ష నేతలను అర్ధరాత్రులలో అరెస్టు చేయడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు.రాష్ట్రాన్ని పెట్టుబడులకు సురక్షిత గమ్యంగా చూపిస్తూనే, మరోవైపు రాజకీయ ప్రత్యర్థులను అరెస్టు చేస్తే దాని సందేశం ప్రపంచం ముందు ఎలా ఉంటుందో ప్రభుత్వం ఆలోచించాలన్నారు. అరెస్టులు, బెదిరింపులతో.. ఇలా వ్యవహరిస్తే పెట్టుబడిదారులు తెలంగాణకు రావాలనుకుంటారా? అని కిషన్ రెడ్డి ప్రశ్నించారు.

13న మెస్సీతో సీఎం ఫుట్ బాల్ మ్యాచ్

- ఉప్పల్ స్టేడియంలో ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి వాకిటి

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్ 9 : ఉప్పల్ స్టేడియంలో ఈ నెల 13న మెస్సీతో ఫ్రెండ్లీ ఎగ్జిబిషన్ ఫుట్ బాల్ మ్యాచ్ జరుగనుంది. ఈ నేపథ్యంలో స్టేడియంలో ఏర్పాట్లను క్రీడాశాఖ మంత్రి వాకిటి శ్రీహరి, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనా రెడ్డి, అడిషనల్ డీజీ చారుసిన్హా, జాయింట్ కమిషనర్ జోయేల్ డేవిస్ తో కలిసి మంగళవారం నాడు పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేసారు. ఈ సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ ప్రపంచ ఫుట్బాల్ దిగ్గజ ఆటగాడు మెస్సీ హైదరాబాద్ రావడం తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణమని అన్నారు. మెస్సీ వచ్చిపోయిన తర్వాత రాష్ట్రంలోని క్రీడాకారుల ఆలోచన విధానం మారుతుందని అన్నారు. మెస్సీ రాకను ప్రతిపక్షాలు వ్యతిరేకించడం విడ్డూరంగా ఉందన్నారు. వారు అధికారంలో ఉన్నప్పుడు చేయని పనిని సీఎం రేవంత్ రెడ్డి చేస్తున్నందుకు తట్టుకోలేక ఈ విధంగా మాట్లాడుతున్నారన్నారు.

“



2025--26 ఏడాదికి ప్రభుత్వం ఇచ్చిన జీఎస్డీపీ అంచనాలు వాస్తవానికి విరుద్ధంగా ఉన్నాయి. ప్రజలను మోసం చేసేందుకే ఈ గణాంకాలను చంద్రబాబు మార్గదర్శకత్వంలో తయారు చేశారు. కాగ్ నివేదికలు నిజమైన ఆదాయాలు, ఖర్చులను ప్రతిబింబిస్తున్నాయి. వాటి ప్రకారం ఆదాయాల పెరుగుదల తగ్గి, అప్పులు పెరిగాయి. అభివృద్ధి కోసం పెట్టే ఖర్చు, పెట్టుబడులు తగ్గాయి. రెవెన్యూ లోటు ఆందోళనకరంగా ఉంది.

- ట్విటర్లో
ఏపీ మాజీ సీఎం జగన్

పెట్టుబడుల వరద

మొదటిపేజీ తరువాయి

పెట్టుబడులు పెట్టేందుకు ఆ సంస్థ ఆసక్తి చూపించింది. సుమధుర గ్రూప్, టీసీసీఐ తైవాన్ గ్రూప్ తెలంగాణ ప్రభుత్వంతో ఎంవోయూలు కుదుర్చుకున్నాయి.

భారత్ బయోటెక్ రూ.1000 కోట్లు

రాష్ట్రంలో రూ.1000 కోట్లు పెట్టుబడి పెట్టేందుకు భారత్ బయోటెక్ ఇంటర్నేషనల్ సంస్థ ముందుకు వచ్చింది. కాంట్రాక్ట్‌రీసెర్చ్, డెవలప్‌మెంట్ అండ్ మ్యానుఫ్యాక్చరింగ్ ఆర్గనైజేషన్ (సీఆర్‌డీఎంఓ) నిర్మాణానికి రూ.1000 కోట్లు పెట్టుబడి పెట్టనుంది. వచ్చే నాలుగేళ్లలో దీని ద్వారా 200 మందికిపైగా ఉద్యోగాలు కల్పించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంది. తెలంగాణలో డెయిరీ విస్తరణ కోసం గోద్రెజ్ ఇండస్ట్రీస్ గ్రూప్ ఒప్పందం కుదుర్చుకుంది. ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్‌డీ సెంటర్ కోసం ఫెర్టిస్ ఇండియాతో ఒక ఒప్పందం జరిగింది. రెండు దశలలో రూ. రెండు వేల కోట్ల పెట్టుబడులను ఫెర్టిస్ ఇండియా పెట్టనుంది. ఫుడ్ అండ్ బేవరేజెస్ యూనిట్ -2 విస్తరణకు కేజేఎస్ ఇండియా ఒప్పందం కుదుర్చుకుంది. ఫ్రీజ్‌డ్రైడ్ కాఫీ ప్లాంట్ నిర్మాణానికి వింటేజ్ కాఫీ అండ్ బేవరేజెస్ ఒప్పందం చేసుకుంది. సీఎం రేవంత్‌రెడ్డిని అరబిందో, భారత్ బయోటెక్ ప్రతినిధులు కలిశారు. హెటెరో, ఎంఎస్ఎన్ ఫార్మా ప్రతినిధులు కలిశారు. ఈ కంపెనీలు రాష్ట్రంలో పెట్టుబడులపై ప్రభుత్వంతో ఎంఓయూ చేసుకున్నాయి .

ఒప్పందాల వివరాలు ఇవే :

ఫెర్టిస్ ఇండియా రూ. 2 వేల కోట్లు
కేఏజేఎస్ ఇండియా రూ. 650 కోట్లు
రూ. 1,100 కోట్లతో వింటేజ్ కాఫీ ప్లాంట్
రిలయన్స్ కన్స్యూమర్స్ రూ. 1,500 కోట్లు
కేయిన్స్ టెక్నాలజీస్ రూ. 1,000 కోట్లు
రూ. 9 వేల కోట్లతో జేకేసీ డేటా సెంటర్
ఆర్సీసీటీ ఎనర్జీ రూ. 2,500 కోట్లు
రూ. 6,750 కోట్లతో హైపర్ స్కేల్ డీసీ క్యాంపస్
రూ. 70 వేల కోట్లతో ఇన్‌ఫ్రాకీ ఏఐ రెడీ డేటా పార్క్
రూ. 1,800 కోట్లతో హెటిరో ఫార్మా యూనిట్
రూ. 1,000 కోట్లతో భారత్ బయోటెక్ డీఆర్‌డీఎంఓ
అరబిందో ఫార్మా రూ. 2,000 కోట్ల పెట్టుబడులు
గ్రాన్యూల్స్ ఇండియా రూ. 1,200 కోట్ల పెట్టుబడులు
రూ. 4 వేల కోట్లతో బయోలాజికల్ వ్యాక్సిన్ ప్రాజెక్ట్

జనంబాటలో కవిత గర్జన

మొదటిపేజీ తరువాయి

నాయకులను ఘాటుగా విమర్శిస్తున్నారు. మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా పర్యటనలో ధరణి వెబ్ సైట్ సమస్యలను ప్రస్తావిస్తూ రైతుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన అప్పటి సీఎం సీఎం కేసీఆర్ సహా ఇప్పటి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కూడా తప్పు పట్టారు. ఇకముందు కేసీఆర్ ను కూడా తన విమర్శలతో ఉక్కిరిబిక్కిరి చేసే తంత్రం అమలుచేయనున్నారన్న అభిప్రాయం వ్యక్తమవుతున్నది. కాళేశ్వరం ప్రాజెక్టులో అవినీతిపై మాజీమంత్రి తన్నీరు హరీశ్ రావును తీవ్ర విమర్శలతో అక్రమాలను బయటపెట్టిన కవితను బీఆర్ఎస్ పార్టీ సస్పెండ్ చేసింది. అక్రమార్కుల కారణంగానే తనను పార్టీ నుంచి బయటకు పంపారని కవిత స్పష్టం చేశారు. తమ ఆటలు సాగనివ్వడం లేదన్న అక్కసుతోనే తనను ఇబ్బంది పెడుతున్నారని చెప్పారు.

రాజకీయ భవితవ్యాన్ని నిర్ణయించుకోవడానికి

ఈ క్రమంలోనే తన రాజకీయ భవితవ్యాన్ని నిర్ణయించుకోవడానికి కవిత సన్నిహితులతో విస్తృతంగా సమావేశాలు నిర్వహించారు. పలువురి సలహాలతో జాగృతి తరపున జనంబాట చేపట్టారు. రాష్ట్రవ్యాప్త పర్యటనలతో క్షేత్రస్థాయిలో సమస్యలు గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని నిర్ణయించారు. అక్టోబర్ 25న నిజామాబాద్ లో ప్రారంభమైన జాగృతి జనంబాట 13 జిల్లాలు పూర్తి చేసుకుంది. మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్ రావు, ప్రశాంత్ రెడ్డి, నిరంజన్ రెడ్డి, జగదీశ్వర్ రెడ్డి సహా బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు, ముఖ్య నాయకులపై ఆరోపణలు గుప్పించారు. కేంద్రమంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ సహా బీజేపీ ఎంపీలు, ఎమ్మెల్యేల వైఫల్యాలను ఎండగట్టారు. అధికార పార్టీని కూడా ఎక్కడా వదల్లేదు. తెలంగాణ ప్రజలకు ఇచ్చిన హామీలను విస్మరించిన సీఎం రేవంత్ సహా మంత్రులు, కాంగ్రెస్ ఎమ్మెల్యేల అక్రమాలను బయటపెడుతున్నారు. కవిత ప్రస్తావిస్తున్న పలు సమస్యలపై ప్రభుత్వం వెంటనే స్పందిస్తున్న సందర్భాలు కూడా ఉన్నాయి. మహబూబ్ నగర్ జిల్లాలో భూ నిర్వాసితుల పరిహారం పెంపు, కృష్ణాష్టమి సందర్భంగా విద్యుత్ షాక్ బాధితులకు పరిహారం చెల్లింపు తదితర సమస్యలపై ప్రభుత్వం కదిలింది. బాధితులకు న్యాయం జరిగింది.

విపక్షాలు కవితను తప్పపడతున్నాయని

పార్టీలకతీతంగా అందర్నీ విమర్శిస్తున్నా తన తండ్రి కేసీఆర్ ను పల్లెత్తు మాట అనడం లేదంటూ విపక్షాలు కవితను తప్పుపట్టాయి. ఎప్పటికైనా తండ్రి నీడకు చేరనున్నారా! అంటూ అనుమానాలూ వ్యక్తం చేశారు. ఇది తండ్రీ కూతుళ్లు కలిసి ఆడుతున్న నాటకంగా కూడా ప్రచారం చేశారు. వీటన్నింటినీ పటాపంచలు చేస్తూ మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా లక్ష్మాపూర్ పర్యటనలో కవిత మాజీ సీఎం కేసీఆర్ లక్ష్యంగా పలు విమర్శలు చేశారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న సమయంలో ఆ పార్టీ నేతల అవినీతి తారస్థాయికి చేరినా కేసీఆర్ పట్టించుకోకపోవడంలో ఈ అర్థమేంటని ఆరోపణలు గుప్పించారు. ఇదంతా కేసీఆర్ కు తెలిసే జరిగిందా అన్న అనుమానాలూ వ్యక్తం చేశారు. రాష్ట్రంలో సమస్యల పరిష్కారమే లక్ష్యంగా తన జనంబాట సాగుతున్నదని ప్రకటిస్తున్న కవిత ఆ విషయంలో ఎదురుగా ఎవరున్నా డోంట్ కేర్ అంటున్నారు. కేసుల భయానికి కొందరు, కాసుల ఆశకు మరికొందరు నోళ్లు మూసుకున్నారని, ప్రజల పక్షాన ప్రశ్నించే వారే లేకపోవడం దారుణమని ఆమె ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అందుకే ప్రజాగొంతుకై తాను జనంబాట పట్టానని చెబుతున్నారు. అవినీతి, అక్రమాలు, వైఫల్యాలకు బాధ్యులైన వారు ఎవరైనా తన విమర్శలు ఎదుర్కోవలసిందేనన్న ధోరణి ఆమెలో కనిపిస్తున్నది. తన తండ్రి కేసీఆర్ పై ఇక ముందు కూడా ఘాటైన విమర్శలు తప్పవేమోనని కవిత వైఖరిని బట్టి అర్థమవుతున్నది.

సోనియాకు ఢిల్లీ కోర్టు నోటీసులు

మొదటిపేజీ తరువాయి

ఆమె పేరు ఓటర్ల జాబితాలో చేర్చారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన ఆమెపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని ఢిల్లీకి చెందిన న్యాయవాది వికాస్ త్రిపాఠి రౌస్ అవెన్యూ మేజిస్ట్రేట్ కోర్టులో సెప్టెంబర్‌లో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన కోర్టు సరైన ఆధారాలు లేవని డిస్మిస్ చేసింది. దీంతో కోర్టు తీర్పును సవాల్ చేస్తూ న్యాయవాది వికాస్ త్రిపాఠి రౌస్ రివిజన్ పిటిషన్ దాఖలు చేశారు. దీని మీద రౌస్ అవెన్యూ కోర్టు మంగళవారం విచారణ చేపట్టింది. వివరణ ఇవ్వాలని సోనియాకు నోటీసులు జారీ చేసింది. అనంతరం కేసు తదుపరి విచారణను జనవరి ఆరుకు వాయిదా వేసింది. ఇటలీలో జన్మించిన సోనియా గాంధీ 1968లో రాజీవ్ గాంధీని వివాహం చేసుకున్నారు. ఆ తర్వాత 1983 ఏప్రిల్ 30న ఆమె భారత పౌరసత్వాన్ని అధికారికంగా స్వీకరించారు.

ప్రతి కుటుంబానికి సొంతిల్లు ప్రభుత్వ సంకల్పం

మొదటిపేజీ తరువాయి

సమగ్రమైన పాలసీని రూపొందిస్తున్నామని వివరించారు. రాష్ట్రంలో ఇప్పటివరకు అమలైన గృహ కార్యక్రమాల ద్వారా సాధించిన పురోగతిని వివరిస్తూ.. గతంలో ఇందిరమ్మ పథకం ద్వారా సుమారు 42 లక్షల ఇండ్లను నిర్మించగా, ఇప్పుడు ఇందిరమ్మ ఇండ్ల కార్యక్రమంలో సుమారు 3.5 లక్షల ఇళ్ల నిర్మాణాలు వివిధ నిర్మాణ దశల్లో ఉన్నాయని మంత్రి తెలిపారు. అంతే కాకుండా మధ్య తరగతి కుటుంబాల కోసం హౌసింగ్ బోర్డ్, రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ తదితర సంస్థల ద్వారా సుమారు ఒక లక్ష ఇళ్లు నిర్మించినట్లు వివరించారు. అయినా కూడా రాష్ట్రంలో గృహాల డిమాండ్, సరఫరా మధ్య భారీ అంతరం ఉందని, ఈ అంతరాన్ని పూడ్చడానికి, వ్యక్తిగత పథకాలకు పరిమితం కాకుండా, ప్రభుత్వ లక్ష్యానికి మూలస్తంభం లాంటి తెలంగాణ 2047ను ఆదాయంతో సంబంధం లేకుండా ఒక సమగ్ర గృహ నిర్మాణ విధానాన్ని రూపొందిస్తున్నామని ప్రకటించారు. పట్టణ ప్రాంతాల అవసరాలపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి, సమతుల్యతతో కూడిన "గృహ నిర్మాణ తెలంగాణ నమూనా 2047" వైపు చారిత్రక అడుగు వేస్తున్నామని అన్నారు. ప్రభుత్వ ప్రయివేటు భాగ్యస్వామ్యంతో ఔటర్ రింగ్ రోడ్, రీజినల్ రింగ్ రోడ్డు మధ్యలో పేద మధ్యతరగతి ప్రజల కోసం కూకట్పల్లి హౌసింగ్ బోర్డ్ తరహాలో ఇళ్లను నిర్మించాలన్న ఆలోచన చేస్తున్నామని, తెలంగాణను మూడు ప్రధాన ప్రాంతాలుగా విభజించి వ్యూహాలను రూపొందించామని తెలిపారు. ఈ సెమినార్లో ప్రపంచ బ్యాంకు ప్రతినిధి అభిజిత్ శంకర్ రే, రాంకీ సీఎండీ నంద కిషోర్, హడ్కో ఎండీ వి. సురేష్, క్రెడాయ్ ప్రెసిడెంట్ జి. రామ్ రెడ్డి, ఏఎస్బీఎల్‌సీఈఓ అజితేష్, కేర్ ప్రతినిధి ప్రీతం మెహెరా తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌కు త్రుటిలో తప్పిన ప్రమాదం

మొదటిపేజీ తరువాయి

సమయంలో కాన్వాయ్‌లోని జామర్ వాహనం టైర్ అకస్మాత్తుగా పేలిపోయింది. డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించి, చాకచక్యంగా వాహనాన్ని నియంత్రించడంతో ప్రమాదం తప్పింది. ఈ ఘటనతో కాన్వాయ్‌లోని భద్రతా సిబ్బంది, అధికారులు ఒక్కసారిగా అప్రమత్తమయ్యారు. వెంటనే స్పందించిన ట్రాఫిక్ పోలీసులు, జామర్ వాహనానికి స్టెప్నీ టైర్‌ను అమర్చి అవసరమైన మరమ్మతులు పూర్తి చేశారు. అనంతరం వాహనం తిరిగి సీఎం కాన్వాయ్‌లో చేరింది. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి హాని జరగక పోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

గతంలో కూడా సీఎం రేవంత్ రెడ్డి కాన్వాయ్‌లో ఇలాంటి ఘటనే చోటు చేసుకోవడం గమనార్హం. ఈ ఏడాది ఏప్రిల్ 8న ఆయన హైదరాబాద్ నుంచి కొడంగల్ వెళ్తుండగా, వికారాబాద్ జిల్లా మన్నెగూడ వద్ద కాన్వాయ్‌లోని ల్యాండ్ క్రూజర్ కారు టైర్ పంక్చర్ అయి పేలిపోయింది. తాజాగా మరోసారి ఇలాంటి ఘటన జరగడంతో కాన్వాయ్‌లోని వాహనాల భద్రతపై అధికారులు దృష్టిసారించారు.

కేసీఆర్ త్యాగాల వల్లనే తెలంగాణ సాధ్యమైంది

- కేసీఆర్ అంటే పోరాటం, త్యాగం
- రేవంత్ రెడ్డి అంటే వెన్నుపోటు, ద్రోహం
- మాజీ మంత్రి హరీష్ రావు

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్ 9: కేసీఆర్ త్యాగాల వలనే తెలంగాణ సాధ్యమైందని మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ అన్నారు. తెలంగాణ భవన్‌లో విజయ్ దివస్ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మాజీ మంత్రి హరీష్ రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమం ప్రారంభం ముందు తెలంగాణ తల్లి విగ్రహం, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చిత్రపటం, ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో మాట్లాడుతూ హరీష్ రావు, తెలంగాణ రాష్ట్ర నిర్మాణ పోరాటంలో జరిగిన సంఘటనలను గుర్తు చేసుకున్నారు. “డిసెంబర్ 9 తెలంగాణ చరిత్రలో సువర్ణ అక్షరాలతో లిఖించబడిన రోజు. నవంబర్ 29న కేసీఆర్ చేపట్టిన ఆమరణ దీక్ష ఫలితమే ఈ ప్రకటన సాధ్యపడింది” అని పేర్కొన్నారు. కేసీఆర్ చేసిన త్యాగాలను వివరించిన హరీష్‌రావు, “నిమ్స్‌లో దీక్ష సమయంలో కేసీఆర్ ప్రాణాపాయం ఏర్పడింది. అయినా తెలంగాణ కోసం వెనక్కి తగ్గలేదు. ‘జైత్రయాత్ర లేకపోతే శవయాత్ర’ అన్న నాయకుడు కేసీఆర్” అని తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం పై తీవ్రమైన విమర్శలు చేస్తూ, “కేసీఆర్ అంటే పోరాటం, త్యాగం... రేవంత్ రెడ్డి అంటే వెన్నుపోటు, ద్రోహం” అని ఆరోపించారు. తెలంగాణ తల్లి విగ్రహ మార్పుపై మాట్లాడుతూ, “ఉద్యమ భావోద్వేగంతో పుట్టిన రూపాన్ని మార్చే హక్కు ఎవరికి లేదని” ఆయన పేర్కొన్నారు. “కాళోజీ, దాశరథి, గద్దర్ వంటి మహనీయులను కూడా చిన్నచూపు చూస్తున్నారు” అని తెలిపారు. యాదిరెడ్డి ఆత్మహత్యను గుర్తుచేస్తూ, “సోనియా గాంధీ నిర్ణయంతోనే నాడు ఉద్యమకారులు ప్రాణాలు తీసుకున్నారు” అని అన్నారు. “ప్రజల పక్షాన కేసీఆర్ మళ్లీ పోరాటం చేస్తారు. ఆయన మళ్లీ ముఖ్యమంత్రి అవుతారు” అని హరీష్‌రావు నమ్మకం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి మహమూద్ అలీ, శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాష్, నాయకులు వినోద్ కుమార్, దేవి ప్రసాద్ , సుమిత్రా నంద్, సుశీలా రెడ్డి, మాగంటి సునీత తదితరులు పాల్గొన్నారు.

మార్చి14 నుంచి పదో తరగతి పరీక్షలు

- షెడ్యూల్ విడుదల చేసిన రాష్ట్ర విద్యాశాఖ
- ఈసారి పరీక్ష తేదీలలో అనూహ్య మార్పులు
- ప్రతి పరీక్షకు 4 లేదా 5 రోజుల విరామం

ప్రతిపక్షం స్టేట్ బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్ 9 : తెలంగాణ పదో తరగతి పరీక్షల షెడ్యూల్ విడుదలైంది. మార్చి 14 నుంచి ఏప్రిల్ 16 వరకు టెన్త్ పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ మేరకు రాష్ట్ర విద్యాశాఖ అధికారిక ప్రకటన విడుదల చేసింది. అన్ని సాధారణ అకడమిక్ పరీక్షలు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహించనున్నట్లు ప్రకటనలో పేర్కొంది. ఆబ్జెక్టివ్ టైప్ (పార్ట్ బి) ప్రశ్నలకు చివరి 30 నిమిషాలలోనే సమాధానాలు రాయాలని స్పష్టం చేసింది. ఇక ఫిజిక్స్, బయాలజీ పరీక్షలు మాత్రం ఉదయం 9.30 గంటల నుంచి 11 గంటల వరకు మాత్రమే జరుగుతాయని తెలిపింది. చివరి 15 నిమిషాలలోనే పార్ట్ బి ప్రశ్నలకు సమాధానాలు రాయాల్సి ఉంటుందని పేర్కొంది. మార్చి 14న ఫస్ట్ లాంగ్వేజ్ (తెలుగు), 18న సెకండ్ లాంగ్వేజ్ (హిందీ), 23న థర్డ్ లాంగ్వేజ్ (ఇంగ్లిష్), 28న గణితం, ఏప్రిల్ 2న భౌతిక శాస్త్రం, 7న జీవశాస్త్రం, 13న సోషల్ స్టడీస్, 15న ఓఎస్ఎస్సీ మెయిన్ లాంగ్వేజ్ పేపర్ I, 16న మెయిన్ లాంగ్వేజ్ పేపర్ II ఉంటాయి. ఈసారి పరీక్ష తేదీల షెడ్యూలులో అధికారులు స్వల్ప మార్పులు చేశారు. ఒక్కో పరీక్షకు నాలుగు రోజుల గ్యాప్ ఉంటుంది. విద్యార్థులపై ఒత్తిడి తగ్గించేందుకు నిర్ణయం తీసుకున్నారు. సీబీఎస్ఈ పరీక్షలలోనూ ఇదే తరహా వ్యవధి ఇస్తున్నారు. దీంతో మన దగ్గర సైతం ఇదే పద్ధతి అనుసరించాలని నిర్ణయించారు. కొన్ని పరీక్షలకు ఒక రోజు మరికొన్ని పరీక్షలకు రెండు రోజుల గ్యాప్ రానున్నది. అయితే పరీక్షల మధ్యలో రంజాన్, ఉగాది, మహావీర్ జయంతి, శ్రీరామనవమి వంటి పండుగలు రానున్నాయి. దీంతో కొన్ని పరీక్షలకు నాలుగు నుంచి ఐదు రోజులు గ్యాప్ ఉండనున్నది.

రాజకీయం

త్రీ ట్రిలియన్ ఎకానమీ సాధించడంలో టూరిజం పాత్ర కీలకం

- పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

ప్రతిపక్షం ప్రతినిధి, హైదరబాద్, డిసెంబర్9: ఈ సమ్మిట్లో పాల్గొనడం తనకు ఎంతో సంతోషంగా ఉందని, 3 ట్రిలియన్ ఎకానమీ సాధించడంలో టూరిజం పాత్ర కీలకమని పర్యాటక శాఖ మంత్రి మంత్రి జూపల్లి కృష్ణా రావు అన్నారు. అన్ని వర్గాలను సంతృప్తి పరచడానికి ఎకానమీ పెంపు అనేది అత్యవసరమని, అందుకోసం ఈ కార్యక్రమాన్ని తీసుకున్నామన్నారు. ఇది అంత సులవైందేమీ కాదని, కానీ అనుకుంటే సాధించలేనిది ఏదీలేదని మంత్రి జూపల్లి చెప్పారు. దేశంలో టూరిజం నిర్లక్ష్యానికి గురవుతోందని, కానీ మన రాష్ట్రంలో మంచి రోజులు వస్తున్నాయని తెలిపారు. చాలా మందికి మన చారిత్రక వారసత్వ సంపద గురించి తెలియదని, అందరూ చారిత్రక ప్రదేశాల్ని సందర్శించి చారిత్రక అంశాల్ని తెలుసుకోవాలని కోరారు. మనం ఖర్చు చేసే ప్రతీ రూపాయి మరొకరికి ఉపాధి కల్పిస్తుందని , ఇటీవల ప్రభుత్వం తీసుకువచ్చిన టూరిజం పాలసీ మంచి ఇన్సెంటివ్స్ ఇస్తోందన్నారు. దేశంలోనే తెలంగాణ చరిత్ర, సంస్కృతి, చారిత్రక వారసత్వం వైవిధ్య భరితమైనవని, తెలంగాణ మనుషులు దయగల వారు, ముక్కుసూటితనం గలవారు, మంచివారు, విలువలు కలిగిన వారన్నారు. గతానికి, భవిష్యత్‌కి చాలా తేడా ఉంటుందని మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు.

క్రీడాభివృద్ధిలో మైదానాల పాత్ర చాలా కీలకం: మంత్రి అజారుద్దీన్

తెలంగాణ నుంచి అనేకమంది క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయికి వెళ్లారని మంత్రి అజారుద్దీన్ అన్నారు. గోపీచంద్ అకాడమీ నుంచి అనేక మంది వచ్చారని క్రీడాభివృద్ధిలో మైదానాల పాత్ర చాలా కీలకం అన్నారు. ఫుట్ బాల్ ను కూడా రాష్ట్ర రెండో రోజు కార్యక్రమాల్లో భాగంగా 'ఒలింపిక్ గోల్డ్ క్వెస్ట్' అంశంపై చర్చ నిర్వహించారు. దీనిలో మంత్రి అజారుద్దీన్‌తో పాటు క్రీడా ప్రముఖులు అనిల్ కుంబ్లే, పుల్లెల గోపీచంద్, పీవీ సింధు, అంబటి రాయుడు, గుత్తా జ్వాల పాల్గొన్నారు. ఈ చర్చలో మాట్లాడిన అజారుద్దీన్.. పీవీ సింధు, సైనా నెహ్వాల్, గుత్తా జ్వాల మంచి పేరు తెచ్చుకున్నారని క్రీడాకారులకు ఆర్థిక సమస్యలు లేకుండా చూడాల్సిన అవసరం ఉందన్నారు. క్రీడాపాలసీతో అనేక ఉపయోగాలు ఉన్నాయని క్రీడాకారులకు ప్రభుత్వం నుంచి అండదండలుంటాయని అజరుద్దీన్ తెలిపారు.

'ఒలంపిక్స్' లక్ష్యం గా ముందుకు: మంత్రి వాకిటి శ్రీహరి

తెలంగాణ రైసింగ్ గ్లోబల్ సమ్మిట్ 2047 లో భాగంగా తెలంగాణ ఒలింపిక్ గోల్డ్ క్వెస్ట్ సదస్సు లో రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీహరి మాట్లాడుతూ... రాష్ట్రం లో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాక ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో క్రీడా విధానంలో సంస్కరణలు తీసుకొస్తూ క్రీడా పాలసీని ప్రకటించడం జరిగిందని తెలిపారు. 2036 ఒలంపిక్స్ లో, అంతర్జాతీయ స్థాయి పోటీలో తెలంగాణ క్రీడాకారుల ప్రాతినిధ్యం పెంచే లక్ష్యంగా పాలసీని అమలు చేస్తున్నామని తెలిపారు. క్రీడాకారులు, పారిశ్రామికవేత్తలు ప్రభుత్వ పెద్దలతో కమిటీ సభ్యులుగా తెలంగాణ స్పోర్ట్స్ హబ్ ఏర్పాటు చేశామన్నారు. తెలంగాణ క్రీడా వ్యవస్థను మరింత బలోపేతం చేసే దిశగా నిధుల సమీకరణ కోసం స్పోర్ట్స్ డెవలప్మెంట్ ఫండ్ ను ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్ స్పోర్ట్స్ యూనివర్సిటీ, యంగ్ ఇండియా స్పోర్ట్స్ అథారిటీని నూతనంగా ఏర్పాటు చేశామని మంత్రి తెలియజేశారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ద్వారా పాఠశాల స్థాయి నుండే క్రీడా వ్యవస్థ బలోపేతానికి కృషి చేస్తున్నామన్నారు.

ఫ్యూచర్‌సిటీలో ఫిల్మ్ స్టూడియోలు ఏర్పాటు చేయండి

- అన్ని రకాల సహాయం అందిస్తాం: సిని ప్రముఖులతో సీఎం రేవంత్ రెడ్డి

ప్రతిపక్షం ప్రతినిధి, హైదరబాద్, డిసెంబర్9 : ఫ్యూచర్ సిటీలో ఫిల్మ్‌స్టూడియోలను ఏర్పాటు చేసి స్థానికులకు శిక్షణ ఇచ్చే అంశాన్ని పరిశీలించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తనను కలిసిన సినీ ప్రముఖులకు సూచించారు. ఇందుకోసం ప్రభుత్వం తరపున సహాయ, సహకారాలు అందజేస్తానంటూ వారికి హామీ ఇచ్చారు. తెలంగాణ రైజింగ్ సమ్మిట్ 2047లో బిజీగా ఉన్న సీఎం రేవంత్ రెడ్డితో సినీ ప్రముఖులతో సమావేశం అయ్యారు. ఈ సమావేశానికి ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి, అల్లు అరవింద్, సురేష్ బాబు, దిల్ రాజు, నటులు జెనీలియా, అక్కినేని అమల, పలువురు టాలీవుడ్, బాలీవుడ్ ప్రముఖులు హాజరయ్యారు. రాష్ట్రంలో సినీ ఇండస్ట్రీ అభివృద్ధికి కావాల్సిన అన్నిరకాల సౌకర్యాలను కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని సీఎం వారికి స్పష్టం చేశారు. ఫ్యూచర్ సిటీలో స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు చేశామని వివరించిన ముఖ్యమంత్రి , 24 క్రాఫ్ట్స్ లో సినిమా ఇండస్ట్రీ అవసరాలకు అనుగుణంగా స్థానికులను ట్రైన్ చేసే అంశాన్ని పరిశీలించాలని సూచించారు. ఫ్యూచర్ సిటీలో స్టూడియోలను ఏర్పాటు చేసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం తరపున అన్ని రకాల సహాయ సహకారాలు ఉంటాయని హామీ ఇచ్చారు. స్క్రిప్ట్ తో వస్తే సినిమా పూర్తి చేసుకుని వెళ్ళేలా రాష్ట్ర ప్రభుత్వం సినీ ఇండస్ట్రీని ప్రోత్సహించేందుకు సిద్ధంగా ఉందని సీఎం వారికి హామీ ఇచ్చారు.

ఘనంగా సోనియా గాంధీ జన్మదిన వేడుకలు

ప్రతిపక్షం, స్టేట్ బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్9: కాంగ్రెస్ పార్టీ అగ్రనేత్రి, తెలంగాణ ఇచ్చిన సోనియా గాంధీ జన్మదిన వేడుకలను మినిస్టర్ క్వాటర్స్ లో మంత్రులు కేక్‌కట్ చేసిన సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యే వినోద్ కుమార్ ,ఇతర ముఖ్య నేతలు పాల్గొన్నారు. అనంతరం మినిస్టర్స్ క్వాటర్స్ లో పని చేస్తున్న వర్కర్స్ కి చీరలు, బెడ్‌షీట్లను మంత్రులు పంపిణీ చేశారు.

రాష్ట్రం అభివృద్ధి దిశలో పయనిస్తోంది

- హైదరాబాద్ అద్భుతమైన ఆణిముత్యం
- ఉపాధి రంగాల వైపు దృష్టి సారించాలి
- విజన్ డాక్యుమెంట్ అమలు పరచడంలో నా వంతు కృషి చేస్తా
- రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బరావు

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్9: భారత్ ఫ్యూచర్ సిటీలో జరుగుతున్న ఈ తెలంగాణ రైజింగ్ ఉత్సవాల్లో భాగస్వామిని అయినందుకు నాకు చాలా ఆనందంగా ఉందని, రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బరావు అన్నారు. రెండవ రోజు గ్లోబల్ సమ్మిట్ సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణను రాబోయే ఇరవై ఏళ్లలో దేశంలోనే అభివృద్ధి చెందిన రాష్ట్రంగా లక్ష్యాలను ఏర్పరచుకొని కృషి చేయాలను ఆశయం మహా ఉన్నతమైనదని అన్నారు. 'నేను తెలంగాణలో పనిచేశాను. అవిభాజ్య ఆంధ్రప్రదేశ్లో ఉన్నత ఆర్థిక కార్యదర్శిగా పని చేశాను. ఖమ్మం కలెక్టర్ గా పనిచేశాను. అప్పుడు బహూశా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్కూల్లో ఉండొచ్చు. కానీ నేను ఇప్పుడు హైదరాబాద్ వాణ్ని నాది తెలంగాణ రాష్ట్రం అని చెబుతాను.' అని అన్నారు. ఒకప్పుడు తెలంగాణ అభివృద్ధి లేకుండా పేదరికం, వెనుకబాటుతనం తనం, అమాయకత్వంతో ఉండేదని. ఇప్పుడు తెలంగాణ రాష్ట్రంలో గణనీయమైన మార్పులు వచ్చాయని,. ప్రస్తుతం అభివృద్ధి దిశలో పయనిస్తుందని, అభివృద్ధి చెందుతున్న రాష్ట్రంగా ఎదుగుతుందని అన్నారు. 'హైదరాబాద్ నగరం ఒ అద్భుతమైన ఆణిముత్యం. జాతీయ అంతర్జాతీయ నగరాలు తిరిగాం కానీ హైదరాబాద్ నగర ప్రత్యేకతే వేరు. ఈ నగరం భిన్న జాతులను ప్రజలను అక్కున చేర్చుకున్న నగరం. దేశంలో భిన్నత్వంలో ఏకత్వం సంస్కృతి ఉన్న గొప్ప నగరం. ఉత్తమ సంప్రదాయం, ఉన్నత విలువలు కలిగి ఉన్నది.' అని అన్నారు. తెలంగాణ రైజింగ్ డాక్యుమెంట్ ను ఐఎస్ బీ, నీతి అయోగ్ ఇతర మేధావులచేత రూపొందించడం అభినందనీయమని, విజన్‌డాక్యుమెంట్ ను అమలు పరచడంలో నా వంతు కృషిచేస్తానని అన్నారు. తనను సలహామండలి సభ్యుడిగా నియమించినందుకు ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు ఆయన తెలిపారు.

ఉపాధి రంగాల వైపు దృష్టి సారించాలి

హైదరాబాద్ ఇప్పటికే ఐటీ, ఫార్మా లైఫ్ సైన్సెస్, జీసీసీల్లో అప్రతిహత అభివృద్ధిని సాధిస్తూ ఎంతో ప్రఖ్యాతి చెందిందని, అయితే తెలంగాణ తయారీ రంగం, వ్యవసాయ రంగం ఇతర ఉపాధి రంగాల వైపు దృష్టి సారించి ఉద్యోగాలు కల్పించాలని దువ్వూరి సుబ్బరావు అన్నారు. మౌళిక సదుపాయాల కల్పన, డిజిటల్ ఇన్ ఫ్రాస్ట్రక్షర్, సోషల్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ అభివృద్ధిపై దృష్టి పెట్టాలన్నారు. ఏఐ రంగంలో తెలంగాణను దేశంలోనే గొప్ప ఇన్నోవేషన్ సెంటర్ చేయాలన్న తపన తమ ప్రభుత్వానికి ఉన్నదని ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు చెప్పారని, అది చాలా అవసరమని, అదే సమయంలో ఈజ్ ఆఫ్ డూయింగ్, ప్రభుత్వం ప్రాథమిక విద్య, ఆరోగ్యంపైన దృష్టి పెట్టాలన్నారు.

ఫోన్ ట్యాపింగ్ కేసులో సుప్రీం విచారణ

- రేపటికి వాయిదా

ప్రతిపక్షం, నేషనల్‌బ్యూరో, న్యూఢిల్లీ, డిసెంబర్ 9: ఫోన్ ట్యాపింగ్ కేసులో ఇంటెలిజెన్స్ మాజీ చీఫ్ ప్రభాకర్ రావు బెయిల్ రద్దు చేయాలంటూ తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు ధర్మాసనం బుధవారానికి వాయిదా వేసింది. ఈ పిటిషన్‌ను సుప్రీంకోర్టు ధర్మాసనం మంగళవారం విచారించి.. ఈ నిర్ణయం తీసుకుంది. ఈ పిటిషన్‌పై నవంబర్ 18వ తేదీనే వాదనలు జరగాల్సి ఉంది. కానీ ప్రభాకర్ రావు తరపు న్యాయవాది అందుబాటులో లేకపోవడంతో.. ఈ పిటిషన్‌పై విచారణ నేటికి వాయిదా పడింది. ఇక ఈ కేసులో కీలక ఆధారాలను ప్రభాకర్ రావు ధ్వంసం చేశారంటూ సుప్రీంకోర్టును ప్రభుత్వం ఆశ్రయించింది. డిజిటల్ ఎక్విప్‌మెంట్, పాస్ వర్డ్ ఇవ్వకుండా విసిగించడంతోపాటు విచారణకు ఆయన ఏ మాత్రం సహకరించడం లేదని ప్రభుత్వం తరఫు న్యాయవాదులు సుప్రీంకోర్టుకు తమ వాదనలను వినిపించారు. దీంతో ఫోరెన్సిక్ నిపుణుల ముందు ఐ క్లౌడ్, పాస్ వర్డ్ రీసెట్ చేయాలని గత విచారణలో ప్రభాకర్ రావును సుప్రీం కోర్టు ఆదేశించిన సంగతి తెలిసిందే.

'మహాలక్ష్మి'కి రెండేళ్లు

- 251కోట్ల మహిళలు ఉచిత ప్రయాణం
- ఆర్టీసీ సిబ్బంది, అక్కా చెల్లేళ్లకు శుభాకాంక్షలు తెలిపిన మంత్రి పొన్నం

ప్రతిపక్షం, స్టేట్ బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్9: మహా లక్ష్మీ పథకం ద్వారా ఆర్టీసీ లో మహిళలకు ఉచిత ప్రయాణం ప్రారంభమై రెండు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా మహిళలకు ఆర్టీసీ ఉద్యోగులకు , సిబ్బందికి మంత్రి పొన్నం ప్రభాకర్ శుభాకాంక్షలు తెలిపారు. నేడిక్కడ మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ డిసెంబర్ 9,2023 నాడు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ ప్రజా పాలన ప్రభుత్వం తెలంగాణ అక్కా చెల్లెలకు మహా లక్ష్మీ పథకం ద్వారా ఆర్టీసీ లో ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభించిందన్నారు. నేటికి రెండు సంవత్సరాలు పూర్తి చేసుకొని ఇప్పటి వరకు 251 కోట్ల మంది మహిళలు రూ. 8459 కోట్ల విలువైన ప్రయాణం చేశారన్నారు. దీని ద్వారా కుటుంబాల బంధుత్వాలు పెరగడం, దేవాలయాల సందర్శన , హాస్పిటల్ చికిత్సలు ,విద్య వ్యవస్థ మెరుగు పరచడం ,ఉపాధి అవకాశాలు మెరుగుపర్చుకుని ఇంకా అనేక రకాలుగా మహిళలు ఆర్టీసీ ఉచిత ప్రయాణం ఉపయోగించుకుంటున్నారని తెలిపారు .సోనియా గాంధీ జన్మదినం సందర్భంగా ప్రారంభించుకున్న ఈ పథకం రెండు సంవత్సరాలు గా విజయవంతంగా మహిళా సాధికారత కి ఉపయోగపడుతుందన్నారు. బస్సుల్లో ప్రయాణం చేయడమే కాదు.. మహిళలను బస్సులకు యజమానులుగా చేసిన ప్రభుత్వంగా తెలంగాణ ప్రభుత్వం నిలుస్తుందని మంత్రి తెలిపారు. తెలంగాణ అక్కా చెల్లెలకు,ఆర్టీసీ ఉద్యోగులకు సిబ్బందికి రవాణా శాఖ మంత్రి గా శుభాకాంక్షలు తెలుపుతున్నానని పొన్నం తెలిపారు.

గ్లోబల్ సమ్మిట్-2025లో భారీ డ్రోన్ షో.. గిన్నిస్ రికార్డు

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరబాద్, డిసెంబర్9: 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2025'లో భారీ డ్రోన్ షో గిన్నిస్ రికార్డును సొంతం చేసుకుంది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన ఈ సదస్సు ముగింపు వేడుకలో ఏర్పాటు చేసిన డ్రోన్ షో చూపరులందరినీ విశేషంగా ఆకట్టుకుంది. తెలంగాణ రైజింగ్ 2047 లక్ష్యాలను వివరిస్తూ ప్రత్యేక థీమ్‌లతో ఈ డ్రోన్ షోను రూపొందించారు. గిన్నిస్ బుక్ రికార్డును నమోదు చేసేలా మొత్తం 3 వేల డ్రోన్‌లతో ప్రత్యేక ప్రదర్శన నిర్వహించారు. గతంలో అబుదాబిలో 2,131 డ్రోన్‌లతో నిర్వహించిన ప్రదర్శన గిన్నిస్ బుక్ రికార్డును సాధించింది. ఇప్పుడు తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సదస్సులో ఆ రికార్డును అధిగమించేలా 3 వేల డ్రోన్లతో ఈ ప్రదర్శనను ఏర్పాటు చేయడం విశేషం. ఈ కార్యక్రమానికి హాజరైన గిన్నిస్ వరల్డ్ రికార్డు ప్రతినిధులు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రికార్డు సర్టిఫికెట్ ను అందజేశారు. ముగింపు వేడుకల సందర్భంగా బాణాసంచా వెలుగులతో గ్లోబల్ సమ్మిట్ ప్రాంగణం శోభాయమానంగా వెలిగిపోయింది.

సీఎం ప్రజావాణిపై హరీష్ నిరాధార ఆరోపణలు

- సీఎం ప్రజావాణి ఇన్చార్జి, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ చిన్నారెడ్డి

ప్రతిపక్షం, స్టేట్ బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్9: సీఎం ప్రజావాణి ప్రజా సమస్యల పరిష్కారంలో దాదాపు 70% సక్సెస్ రేటు ఉందని, కానీ మాజీ మంత్రి, బీఆర్ఎస్ నాయకులు హరీష్ రావు సీఎం ప్రజావాణిపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని సీఎం ప్రజావాణి ఇన్చార్జి, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జీ. చిన్నారెడ్డి అన్నారు. వాస్తవాలు తెలుసుకోకుండా హరీష్ రావు మాట్లాడడం సరికాదని చిన్నారెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. సీఎం ప్రజావాణి ప్రజా సమస్యల పరిష్కార వేదిక అని ప్రజాభవంలో అధికారిక కార్యక్రమాలు మాత్రమే జరుగుతాయన్నారు. కరీంనగర్ కు చెందిన గౌడుగు నాగరాజు ఇచ్చిన ఫిర్యాదు పరిష్కారం కాలేదని హరీష్ రావు విమర్శించారని, అసలు ఆ వ్యక్తి ఎవరో తమ రికార్డుల్లో లేదన్నారు. హరీష్ రావు తన గౌరవాన్ని కాపాడుకోవాలని చిన్నారెడ్డి సూచించారు. కనీసం కన్నెత్తి చూసే పరిస్థితి కూడా లేని ప్రగతి భవన్ ఇనుప కంచెలను బద్దలు కొట్టి ప్రజా భవన్ గా మార్చి, సీఎం ప్రజావాణి ద్వారా ప్రజలు నేరుగా సమస్యలు చెప్పుకునే అవకాశాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కల్పించారని చిన్నారెడ్డి పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తరపున తాను, సెర్ప్ సీఈవో దివ్య దేవరాజన్ రెగ్యులర్ గా ప్రజావాణి నిర్వహిస్తూ ప్రజల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నామని చిన్నారెడ్డి వివరించారు.

విజన్ డాక్యుమెంట్-2047 ఓ దిక్సూచి

- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు
- ముసిగిన తెలంగాణ రైజింగ్ 2047 సమ్మిట్

ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్ 9: తెలంగాణ రాష్ట్రాభివృద్ధికి విజన్ డాక్యుమెంట్ 2047 ఓ దిక్సూచి అని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అభివర్ణించారు. విస్తృత సంప్రదింపులు, నిపుణుల అభిప్రాయ సేకరణ తర్వాతే..ఈ తెలంగాణ విజన్ డాక్యుమెంట్ 2047ను రూపొందించామని తెలిపారు. మంగళవారం తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2025లో సెషన్లు ముగిశాయి. అనంతరం తెలంగాణ విజన్2047 డాక్యుమెంట్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. ఈ విజన్ డాక్యుమెంట్ మనందరిది అని స్పష్టం చేశారు. సమ్మిళిత వృద్ధి తెలంగాణ లక్ష్యమని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు. మంగళవారం ముగియనున్న ఈ సమ్మిట్‌కు దేశ విదేశాల నుంచి వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు హాజరయ్యారు.

అభివృద్ధిలో ప్రత్యేక మార్గం ఎంచుకుంటున్న తెలంగాణ: ఆనంద్ మహీంద్రా

తెలంగాణ విజన్ చాలా మార్గదర్శకంగా ఉందని మహీంద్రా గ్రూప్ చైర్మన్ ఆనంద్ మహీంద్రా తెలిపారు. అభివృద్ధిలో తెలంగాణ ప్రత్యేక మార్గం ఎంచుకుంటోందని ఆయన పేర్కొన్నారు. యంగ్ ఇండియా స్కిల్ వర్సిటీ చైర్మన్‌గా ఉండటం తన అదృష్టమని ఆయన చెప్పారు. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ఈ దేశ భవిష్యత్ అని ఆనంద్ మహీంద్రా అభివర్ణించారు.

పెట్టుబడులకు ఆవిష్కరణలు తోడైతేనే..

పెట్టుబడులకు ఆవిష్కరణలు తోడైతేనే త్రి ట్రిలియన్ డాలర్ ఎకానమీ లక్ష్యసాధన సాధ్యమవుతుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. మంగళవారం గ్లోబల్ సమ్మిట్ లో భాగంగా ఏర్పాటుచేసిన క్యాపిటల్ & ప్రొడక్టివిటీ ఫర్ త్రీ ట్రిలియన్ డాలర్ ఎకానమీ చర్చా గోష్టిలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. రాబోయే 22 ఏళ్లలో నిర్దేశించుకున్న లక్ష్యాన్ని చేరుకోవాలంటే ప్రస్తుతం ఉన్న అంచనాల ప్రకారం లెక్కిస్తే 16 రెట్లు ఆర్థిక వృద్ధిని సాధించాల్సి ఉందని డిప్యూటీ సీఎం తెలిపారు. మేము 'తెలంగాణ రైజింగ్ 2047'ను ఆవిష్కరించాము. ఇది కేవలం ఒక పత్రం కాదు.. ఇది మన భవిష్యత్తుకి ఇచ్చిన ప్రతిజ్ఞ అన్నారు. 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా నిలపడం అనే మహత్తర లక్ష్యాన్ని నిర్ణయించుకున్నాం అని తెలిపారు. ఈ చర్చా గోష్టిలో సెంటర్ ఫర్ ఎనలైటికల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రసన్న తంత్రి, యువ పారిశ్రామికవేత్త పరశురాం, ట్రాన్స్ కో సీఎండీ కృష్ణ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలో స్కూళ్లకు ఆరు రోజులు సెలవు

- స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా సెలవులు ప్రకటన



ప్రతిపక్షం స్టేట్‌బ్యూరో, హైదరాబాద్, డిసెంబర్9: పంచాయతీ ఎన్నికల కారణంగా పాఠశాలలకు వరుస సెలవులు లభించనున్నాయి. స్థానిక సంస్థల ఎన్నికల పోలింగ్ కేంద్రాలను పాఠశాలల్లో ఏర్పాటు చేయనున్నారు. ఈ నేపథ్యంలో పోలింగ్ కేంద్రాలుగా ఉన్న పాఠశాలలకు ఆరు రోజులపాటు సెలవులు రాబోతున్నాయి. తొలి విడత పోలింగ్ సందర్భంగా డిసెంబర్ 10, 11 తేదీల్లో పాఠశాలలకు హాలిడేస్ ఇస్తున్నట్లు ఇప్పటికే ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు ఆయా జిల్లాల కలెక్టర్లు ఆదేశాలు కూడా జారీ చేశారు.ఇక రెండో విడత ఎన్నికల పోలింగ్ డిసెంబర్ 13, 14 తేదీల్లో జరగనున్నాయి. ఆ రెండు రోజులు రెండో శనివారం, ఆదివారం కావడంతో రెండు రోజులు కలిసి వచ్చాయి. మూడో విడత పోలింగ్ సందర్భంగా డిసెంబర్ 16, 17 తేదీల్లో పాఠశాలలకు హాలిడేస్ ప్రకటించారు. ఎందుకంటే పోలింగ్ సామగ్రిని సిద్ధం చేయడం, ఎన్నికల ప్రక్రియ సజావుగా నిర్వహించడం కోసం ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. పోలింగ్ జరిగే ప్రాంతాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ ,కార్మికులకు నెలవారి వేతనంతో కూడిన హాలిడే 11వ తేదీన ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు ఉత్తర్వు జారీ చేసింది. ఇదిలా ఉంటే.. డిసెంబర్ 25న క్రిస్మస్ పండగ, 26న బాక్సింగ్ డే, 28 ఆదివారం స్కూల్స్ కి వరుస సెలవులు రానున్నాయి.

డీఎంకే ఆధ్వర్యంలోని ఇండీ కూటమి ఎంపీలు మద్రాస్ హైకోర్టు జడ్జిపై అభిశంసన నోటీసు ఇవ్వడాన్ని ఖండిస్తున్నా. ఇది న్యాయవ్యవస్థ మొత్తాన్నిభయపెట్టే యత్నం కాదా? ఇలాంటప్పుడు భక్తులు తమ ఆలయాలను, మత వ్యవహారాలను స్వతంత్రంగా నిర్వహించేందుకు, రాజకీయ ద్వేషంతో ప్రేరితమైన న్యాయ దుర్వినియోగాలకు గురవకుండా ఉండేందుకు 'సనాతన ధర్మ రక్షణ బోర్డు' ఏర్పాటు దేశానికి అత్యవసరం.

\- ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్

ఓపెన్ వాయిస్

బ్యాంకులు: మొండి బకాయిలు

ఈ మధ్య కాలంలో బ్యాంకులు తరచుగా వార్తలకెక్కుతున్నాయి. దానికి ముఖ్యమైన కారణం. మొండి బకాయిలు. బ్యాంకింగ్ భాషలో (ఎన్‌పీఏ) నాన్ పెర్ఫార్మింగ్ అసెట్స్ అంటారు. బ్యాంకులు అనేక విధాలుగా లోన్లు ఇస్తూ ఉంటాయి. పెద్ద మొత్తంలో లోన్లు తీసుకుని అవి ఎగ్గొట్టి కొందరు, బకాయిలు తీర్చే స్థోమత లేక కొందరు, చాలామంది బ్యాంకులకు మోత మోగిస్తున్నారు. వీటినే మొండి బకాయిలు అంటారు. అయితే, రిజర్వు బ్యాంకు చెబుతున్న దాని ప్రకారం బ్యాంకులకు తామిచ్చిన రుణాలకు వాయిదాలు తిరిగి రాకపోతే వాటిని ఎన్‌పీఏ అంటారు.2008 సెప్టెంబర్‌లో భారతదేశంలో మొండి బకాయిల విలువ రూ. 53,917 కోట్లు ఉండగా పది సంవత్సరాలకు, అంటే 2018 నాటికి రూ. 8,40,958 కోట్లకు అమాంతం పెరిగిపోయింది. ఏకంగా ఎనిమిది లక్షల కోట్ల రూపాయలు. దేశంలోని 21 ప్రభుత్వ రంగ బ్యాంకులలో ఇదీ పరిస్థితి. ఇంత డబ్బు ఉంటే దేశంలో ఉన్న రైతులకు చాలా వరకు రుణ మాఫీ చేసేయొచ్చు. తాగునీటికి కటకటా అంటున్న ప్రజలకు ప్రతి రోజూ మంచి నీరు సరఫరా చేయొచ్చు.సామాన్యుల ఊహకు కూడా అందనంత అప్పులు తీసుకుని వాటిని ఎగ్గొట్టేసి ఏ విదేశాలకో వెళ్లి సెటిల్ అయిపోతే బ్యాంకులు మాత్రం ఏం చేస్తాయి లెండి! ఎవరైనా ఏ లక్ష రూపాయలో లోన్ తీసుకుని నిజంగానే డబ్బు లేక వాయిదాలు కట్టలేకపోతే వాళ్ల మీద మాత్రం బ్యాంకులు తమ ప్రతాపం చూపిస్తాయి. బ్యాంకుల మొండి బకాయిలకు ముఖ్య కారణం పరిశ్రమలు. ఇంతకు ముందు నేను చెప్పినట్టు కొంతమంది బడా పారిశ్రామికవేత్తలు బ్యాంకుల నుంచి లోన్లు తీసుకుని తుర్రుమన్నారు. స్టీల్ కంపెనీలు నష్టాలలో ఉండడంతో వారి నుంచి కూడా తిరిగి ఆ డబ్బు రావడం లేదు. వ్యవసాయ రంగం, సేవల రంగం కూడా బ్యాంకులను మూడు చెరువుల నీళ్లు తాగిస్తున్నాయి. దేశంలోని ప్రభుత్వ రంగ బ్యాంకులు కీలక నిర్ణయం తీసుకున్నాయి. గత అయిదున్నరేళ్లలో ఏకంగా రూ. 6.15 లక్షల కోట్ల మేర రుణాల్ని రైటాఫ్ చేశాయి. సాంకేతికంగా రద్దు చేశాయని చెప్పొచ్చు. ఈ మేరకు పార్లమెంటులో కేంద్ర మంత్రి పంకజ్ చౌదరి వెల్లడించారు. అయితే ఇది రుణమాఫీ కాదని, బకాయిల వసూలు ప్రక్రియ కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఐదు ఆర్థిక సంవత్సరాలు సహా ఈ ఆర్థిక సంవత్సరం సెప్టెంబర్ వరకు అంటే మొత్తంగా అయిదున్నరేండ్లలో ప్రభుత్వ రంగ బ్యాంకులు లక్షల కోట్ల మేర రుణాలను సాంకేతికంగా రద్దు చేశాయి. అంటే లోన్ రైటాఫ్ చేశాయన్నమాట. ఈ పంకజ్ చౌదరి ఈ విషయాలలో పార్లమెంటులో వెల్లడించారు. ఏకంగా రూ. 6,15,647 కోట్లు లేదా రూ. 6.15 లక్షల కోట్ల రుణాల్ని రైటాఫ్ చేసినట్లు తెలిపారు. రుణాల రైటాఫ్ రుణ మాఫీ కిందికి రాదని ఇది ఆర్థిక పరమైన ప్రక్రియ మాత్రమేనని మంత్రి పేర్కొన్నారు.సాధారణంగా రైటాఫ్ అంటే, ఆర్బీఐ మార్గదర్శకాలు, బ్యాంక్ బోర్డులు ఆమోదించిన విధానాల ప్రకారం నిరర్థక ఆస్తులుగా మారిన నాలుగేళ్లకు పూర్తి కేటాయింపులు చేసిన రుణాలను బ్యాంకులు తమ బ్యాలెన్స్ షీట్ నుంచి తొలగిస్తాయి. సులభంగా చెప్పాలంటే.. బ్యాంక్ లేదా ఆర్థిక సంస్థ ఏదైనా బకాయి ఉన్న లోన్‌ను తిరిగి వసూలు చేయడం దాదాపు అసాధ్యం అని నిర్ధరించినప్పుడు ఆ లోన్ మొత్తాన్ని తమ అకౌంటింగ్ పుస్తకాల నుంచి అధికారికంగా తొలగిస్తుంది. రైటాఫ్ అంటే సదరు రుణ గ్రహీతకు మాఫీ ఇచ్చినట్లు కాదు. ఇప్పటికీ సదరు రుణ గ్రహీత తిరిగి చెల్లించాల్సిన బాధ్యత ఉంటుంది. బ్యాంకులు తమ బ్యాలెన్స్ షీట్‌ను క్లియర్‌గా ఉంచుకునేందుకు, మొండి బకాయిల భారం తగ్గించుకునేందుకు ఈ చర్య చేపడతాయని చెప్పొచ్చు. రైటాఫ్ చేసినప్పటికీ రుణ గ్రహీత క్రెడిట్ స్కోరుపై తీవ్ర ప్రతికూల ప్రభావం చూపుతుంది. ఇది భవిష్యత్తులో వారికి లోన్లు అందకుండా అడ్డుకుంటుంది.

ప్రతిపక్షం

హైదరాబాద్,

బుధవారం
10.12.2025

మానవహక్కులే మనిషికి శ్వాస

హక్కులు మాత్రమే ఉంటే మనకు అహంకారం పెరుగుతుంది. బాధ్యతలు మాత్రమే ఉంటే అణచివేత పెరుగుతుంది. హక్కులు, బాధ్యతలు కలిసినప్పుడు సమాజం దార్శనికతతో ముందుకు సాగుతుంది. మనం హక్కులను కాపాడటం అంటే మనుష్యత్వాన్ని కాపాడటం. హక్కులను గౌరవించడం అంటే ప్రపంచాన్ని శాంతి వైపు నడపటం. మానవ హక్కులు అనేవి కేవలం చట్టపరమైన చట్రం మాత్రమే కాదు. మనిషి శ్వాస, మనుగడ, గౌరవం, నాగరికతకు శాశ్వత హామీ.

కనపర్తి సుధాకర్
94413 13780

మనిషి మనిషిగా పుట్టిన క్షణం నుండి సహజంగానే లభించాల్సిన ప్రత్యేక జీవనాధికారాలు మానవ హక్కులు. ఇవి చట్టాలు ప్రసాదించే బహుమతులు కావు, ప్రభుత్వాలు ఇచ్చే సౌకర్యాలు కావు. కేవలం మనిషిగా పుట్టడమే కారణం. ఈ హక్కులు మనిషి గౌరవం, భద్రత, స్వేచ్ఛ, సమానత్వం, సుఖసంతోషాల కోసం పునాది వంటివి. మనం ఒకనాటి ప్రపంచాన్ని పరిశీలిస్తే బానిసత్వం, వలస పాలన, వర్ణ విభజన, జాతీయమత వివక్ష, మహిళలపై అణచివేత వంటి అనేక క్రూర వ్యవస్థలు శతాబ్దాల పాటు మన సమాజాన్ని గాయపరిచాయి. మనుష్యత్వం కన్నా అధికారం, బలమే ముఖ్యమని భావించిన దుర్మార్గ పాలన విధానాలు అసంఖ్యాక ప్రజల జీవితాలను చీకటిలోకి నెట్టాయి. రెండో ప్రపంచ యుద్ధం (1939-1945) కాలంలో జరిగిన అమానుష ఘటనలు ప్రపంచాన్ని పునరాలోచనకు గురిచేశాయి. నాజీ సిద్ధాంతం, యుద్ధం, వంశనాశనం, శిబిర హింస వల్ల ఒక కోటి పైగా ప్రాణాలు నశించాయి. ఈ సంఘటనలు మానవ విలువలు, హక్కుల అవసరాన్ని ఘోరంగా గుర్తు చేశాయి. అలాంటి సమయంలో ప్రపంచ దేశాల నాయకులు ఒక నిర్ణయానికి వచ్చారు. మనిషి ఎక్కడ పుట్టినా, ఏ మతం లేదా జాతికి చెందినవాడైనా, ఎలాంటి పరిస్థితులలో పెరిగినా అతనికి సమాన హక్కులు ఉండాలి. ఫలితంగానే 1948 డిసెంబర్ 10న ఐక్యరాజ్యసమితి 'సార్వత్రిక మానవ హక్కుల ప్రకటన' విడుదల చేసింది. అప్పటి నుంచి యేటా డిసెంబర్ 10ను 'మానవ హక్కుల దినోత్సవం'గా ప్రతి యేటా ప్రపంచవ్యాప్తంగా జరుపుకుంటున్నారు.

హక్కులు ఎందుకు అవసరం?

హక్కులు కేవలం సౌకర్యాలు కాదు, జీవన గౌరవానికి వేదిక. ప్రతి మనిషికి హక్కులు ఉంటే, ఆత్మగౌరవం పెరుగుతుంది. భయంలేని స్వేచ్ఛగా మాటాడగలడు. విద్య, వైద్యం, ఉపాధి, ఆహారం, నివాసం వంటి ప్రాథమిక అవసరాలు చేరువవుతాయి. వ్యక్తిత్వ వికాసం జరుగుతుంది. సమాజం న్యాయపర దిశగా మారుతుంది. హక్కులు లేని ప్రపంచం అంటే బానిసత్వంతో నిండిన చీకటి యుగం. హక్కులతో కూడిన ప్రపంచం అంటే సమానత్వం, న్యాయం, ప్రేమతో కూడిన మానవతా యుగం. వ్యక్తిగత ఎదుగుదలకు మానవ హక్కుల పాత్ర. మనిషి భద్రతగా ఉన్నప్పుడే అభివృద్ధి వైపు చలిస్తాడు. హక్కులు వ్యక్తికి, స్వతంత్ర ఆలోచనలను అందిస్తాయి. స్వేచ్ఛగా మాట్లాడే హక్కు కల్పిస్తాయి. అలాగే ఉద్యోగం, వ్యాపారం, విద్యలో సమాన అవకాశాలు. వివక్ష రహిత జీవనం న్యాయం పొందే అవకాశాన్ని ఇస్తాయి. హక్కులను బాధ్యతాయుతంగా వినియోగిస్తే వ్యక్తి జీవితమే కాక సమాజం కూడా అభివృద్ధి చెందుతుంది. హక్కులు దుర్వినియోగం సమాజానికి నష్టం కలిగిస్తుంది. సమాజం అంటేనే వ్యక్తుల సమ్మేళనం. వ్యక్తి పురోగతి అనగా కుటుంబ పురోగతి, సమాజ పురోగతి, దేశ పురోగతి. సమాజంలో



మానవ హక్కులు అమలైతే వివక్ష తగ్గుతుంది. మానవ విలువలపై గౌరవం పెరుగుతుంది. శాంతి, సోదరభావం నెలకొంటాయి. నేరాలు, హింస, అణచివేత తగ్గుతాయి. ఈ సమాజం ప్రగతిశీలంగా మారడానికి హక్కులు, న్యాయం, ప్రజాస్వామ్యం, మానవత అనే నాలుగు స్తంభాలు బలంగా నిలబడాలి.

ముఖ్య ఘటనలు

1865-అమెరికాలో బానిసత్వ రద్దు. ఇది ప్రపంచ మానవ హక్కుల ఉద్యమానికి బలమైన పునాది. రెండో ప్రపంచ యుద్ధం(1939-1945) నాటి అమానుష సంఘటనలు ప్రపంచాన్ని మానవ హక్కుల పునర్నిర్మాణ దిశగా నడిపాయి.1948లో సార్వత్రిక మానవ హక్కుల ప్రకటన ప్రతి మనిషికి జీవన గౌరవం హామీ ఇచ్చిన చరిత్రాత్మక నిర్ణయం. ఫిన్లాండ్ నాన్ డిస్క్రిమినేషన్ యాక్ట్ 2015. విద్య, ఉపాధి, వ్యాపార రంగాలలో వివక్షత తొలగించడానికి ఒక శక్తివంతమైన చట్టం గా చెప్పుకోవచ్చు. భారత రాజ్యాంగంలో పొందుపరిచిన సమానత్వ హక్కు, స్వేచ్ఛ హక్కు, దోపిడీ నిరోధ హక్కు, మతస్వేచ్ఛ హక్కు, సాంస్కృతిక, విద్యాపర హక్కులు, రాజ్యాంగ పరిహారపు హక్కులు, ప్రతి పౌరుడికి వర్తించే కొన్ని ముఖ్య హక్కులు. హక్కులు, బాధ్యతలు రెండూ కలిసి నడవాలి. హక్కులు రక్షణ కోసం, దాడి కోసం కాదు. అందువల్ల ప్రతి వ్యక్తికి కొన్ని బాధ్యతలు తప్పనిసరి. ఇతరుల హక్కులను గౌరవించడం, వివక్ష, హింస, అన్యాయం నిరోధించడం, చట్టాన్ని పాటించడం, సమాజానికి తోడ్పడటం. హక్కులు మాత్రమే ఉంటే మనకు అహంకారం పెరుగుతుంది. బాధ్యతలు మాత్రమే ఉంటే అణచివేత పెరుగుతుంది. హక్కులు, బాధ్యతలు కలిసినప్పుడు సమాజం దార్శనికతతో ముందుకు సాగుతుంది. మనం హక్కులను కాపాడటం అంటే మనుష్యత్వాన్ని కాపాడటం. హక్కులను గౌరవించడం అంటే ప్రపంచాన్ని శాంతి వైపు నడపటం. మానవ హక్కులు అనేవి కేవలం చట్టపరమైన చట్రం మాత్రమే కాదు. మనిషి శ్వాస, మనుగడ, గౌరవం, నాగరికతకు శాశ్వత హామీ.

(నేడు మానవ హక్కుల దినోత్సవం)

(వ్యాస రచయిత అసిస్టెంట్ ప్రొఫెసర్, ఎస్ఆర్ఆర్ డిగ్రీ కళాశాల, కరీంనగర్)

హక్కుల కోసం ప్రపంచం పిలుపు

వేల్పుల మహేందర్,
9912775834

డిసెంబర్ 10. ఈ రోజు ప్రపంచవ్యాప్తంగా మానవ హక్కుల దినోత్సవాన్ని జరుపుకుంటారు. 1948లో పారిస్‌లో ఐక్యరాజ్యసమితి ఆమోదించిన సార్వత్రిక మానవ హక్కుల ప్రకటనకు ఇది స్మారకదినం. రెండో ప్రపంచ యుద్ధం తెచ్చిన దారుణాలు, మానవ నష్టాలు ప్రపంచాన్ని చలించాయి. మనిషి, మానవత్వం, స్వేచ్ఛ, గౌరవం అనే విలువలకు కొత్త నిర్వచనం ఇచ్చే అవసరం అప్పటి ప్రపంచానికి అత్యంత కీలకం. ఈ నేపథ్యంలోనే 'యూడీహెచ్ఆర్' (యూనివర్సల్ డిక్లరేషన్ ఆఫ్ హ్యూమన్ రైట్స్) రూపొందించారు. జీవన హక్కు, సమానత్వం, అభివ్యక్తి స్వేచ్ఛ, వివక్షరహిత జీవనం వంటి 30 ప్రధాన హక్కులను ఈ ప్రకటనలో ప్రపంచానికి పరిచయం చేశారు. మానవుని మౌలిక గౌరవాన్ని కాపాడడమే ఈ ప్రకటన ఉద్దేశ్యం. 1950లో ఐరాస తీర్మానం 423(వి) ద్వారా డిసెంబర్ 10 అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవంగా జరుపుకోవాలని అన్ని దేశాలను ఆహ్వానించింది. 1993లో మానవ హక్కుల హై కమిషనర్ వ్యవస్థ స్థాపనతో ఈ కార్యక్రమానికి మరింత బలం చేకూరింది. అప్పటి నుంచి యేటా ఒక ప్రత్యేక అంశంతో ఈ దినోత్సవాన్ని ఐరాస నిర్వహిస్తూ ప్రపంచవ్యాప్తంగా అవగాహన పెంచుతోంది. 2024-25 కాలానికి 'అందరికీ గౌరవం, స్వేచ్ఛ, న్యాయం' అనే నినాదాన్ని ఎంచుకుంది.

భారతదేశంలో మానవ హక్కుల రక్షణ

భారతదేశం కూడా మానవ హక్కుల రక్షణలో కీలక అడుగులు వేసింది. రాజ్యాంగంలోని 21వ అధికరణం జీవన హక్కుకు అడ్డుకట్ట వేయలేనని స్పష్టం చేస్తుంది .1993లో జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్ హెచ్ ఆర్ సీ) ఏర్పాటైంది. దళితుల మీద దాడులు, జాతివివక్ష, బాల కార్మిక వ్యవస్థ, మహిళల మీద హింస వంటి సమస్యలు ఇంకా ఉన్నప్పటికీ, న్యాయం కోసం ప్రజల అవగాహన పెరిగిందని చెప్పాలి. మీడియా, స్వచ్ఛంద సంస్థలు, న్యాయవ్యవస్థ కలిసి పనిచేయడం వలన బాధితులకు న్యాయం అందుకునే మార్గాలు విస్తరించాయి. ప్రపంచవ్యాప్తంగా యుద్ధాలు, తీవ్రవాదం, మానవ అక్రమ రవాణా, శరణార్థుల సమస్యలు ఇంకా మానవ హక్కుల ఉల్లంఘనలకు కారణమవుతూనే ఉన్నాయి. మధ్యప్రాచ్యం, ఆఫ్రికా, ఆసియా ప్రాంతాలలో రాజకీయ అస్థిరత ప్రజల జీవన హక్కును సైతం ప్రశ్నార్థకంగా మారుస్తుంది. డిజిటల్ యుగంలోను గోప్యతా హక్కు, సైబర్ దాడులు, డేటా దుర్వినియోగం వంటి కొత్త సమస్యలు కూడా మానవ హక్కుల రంగంలో చేరాయి.

తెలంగాణ రాష్ట్రంలోనూ

తెలంగాణలో మానవ హక్కుల కమిషన్ ఇటీవల చురుకైన నిర్ణయాలు తీసుకుంటూ సుమోటో కేసులు నమోదు చేయడం, బాధితుల సమస్యలను త్వరితగతిన పరిశీలించడం వంటి సానుకూల మార్పులు చూపుతోంది. అయితే, శిక్ష విధించే అధికారం లేకపోవడం, ప్రభుత్వ శాఖల స్పందనపై ఆధారపడే వ్యవస్థ, గ్రామీణ ప్రాంతాలలో అవగాహన లోపం వంటి పరిమితులు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. ప్రజల హక్కులపై అవగాహన పెరిగితేనే ఈ వ్యవస్థ ప్రభావవంతంగా పనిచేస్తుంది. ప్రభుత్వం, కమిషన్, పౌరులు కలిసి పనిచేసే సామూహిక ధోరణి తప్పనిసరి. గతంతో పోలిస్తే ప్రపంచం హక్కుల పరిరక్షణలో ముందుకు వచ్చింది. కానీ, వివక్ష, పేదరికం, హింస, యుద్ధం, అన్యాయం ఇంకా చాలామందిని తమ హక్కుల నుంచి దూరం చేస్తూనే ఉన్నాయి. 'నాకు ఉన్న హక్కులు ఇతరులకు కూడా ఉన్నాయి' అనే భావన పెరిగినప్పుడే ప్రపంచం నిజ శాంతిని అందుకోగలదు. హక్కులు ప్రభుత్వ బాధ్యతే కాదు, సమాజంలోని ప్రతి వ్యక్తి, ప్రతి పౌరుని బాధ్యత. ఇదే అంతర్జాతీయ మానవ హక్కుల దినోత్సవం ఇచ్చే ప్రధాన సందేశం.

(వ్యాస రచయిత కింగ్ స్టన్ కాలేజీ అఫ్ ఎడ్యుకేషన్ అధ్యాపకుడు)

కార్మికులకు మేలు చేయని వేతనాల కోడ్

ఆళవందార్ వేణుమాధవ్
86860 51752

కేంద్ర ప్రభుత్వం వేతన కోడ్ (2019), పారిశ్రామిక సంబంధాల కోడ్ (2020), సామాజిక భద్రత కోడ్ (2020), వృత్తి భద్రత, ఆరోగ్యం, పని పరిస్థితుల కోడ్ (2020) అనే నాలుగు కార్మిక కోడులను కార్మిక సంఘాలు వ్యతిరేకించినను నోటిఫై చేయడం వలన అవి 21 నవంబర్ 2025 నుండి అమలులోకి వచ్చాయి. ఈ కోడ్ ఇటు ఫిక్సెడ్ టర్మ్ ఎంప్లాయిమెంట్ ను ప్రోత్సహిస్తుంది. రెగ్యులర్ ఉద్యోగుల మాదిరిగానే వారికి కూడా ప్రయోజనాలు లభిస్తాయని ఇది పేర్కొంటున్నప్పటికీ, కార్మికులకు ఉద్యోగ భద్రత లేదనే సత్యాన్ని ఇది దాచిపెడుతుంది. 1946 స్టాండింగ్ ఆర్డర్స్ చట్టం 100 కంటే ఎక్కువ మంది కార్మికులను నియమించే ఏదైనా సంస్థ పని గంటలు, సెలవులు, జీత దినం, వేతన రేట్లు, ఉపాధిని రద్దు చేయడం, ఫిర్యాదుల పరిష్కారం గురించి కార్మికులకు తెలియజేయడంలో పాటించాల్సిన నియమాలను నిర్దేశిస్తుంది. ఈ నాలుగు కార్మిక చట్టాలు కూడా కార్మికుల హక్కులను హరించడమే కాకుండా, కార్మికులు సమ్మె చేయడం చాలా కష్టతరం చేయడం ద్వారా వారి హక్కుల కోసం పోరాడే మార్గాలనూ హరించడం లక్ష్యంగా పెట్టుకున్నాయి.

14 రోజుల నోటీసు ఇవ్వాలి

పారిశ్రామిక సంబంధాల నియమావళి ప్రకారం కార్మికులు సమ్మె కోసం 14 రోజుల నోటీసు ఇవ్వాలి. నోటీసు ఇచ్చిన వెంటనే, రాజీ చర్యలు ప్రారంభమవుతాయి. ఈ కాలంలో సమ్మెలు నిషేధం. రాజీ చర్యలు విఫలమైన తర్వాత యాజమాన్యం ట్రిబ్యునల్‌కు దరఖాస్తు చేసుకుంటే, సమ్మెను మరింత వాయిదా వేయాలి. 60 రోజుల తర్వాత మొదటి సమ్మె నోటీసు చెల్లదు. కొత్త నోటీసు ఇవ్వవలసి ఉంటుంది. ఈ నియమాలు ఇప్పటివరకు 'అవసరమైన సేవల' విషయంలో మాత్రమే వర్తిస్తాయి. ఇప్పుడు అన్ని పరిశ్రమలు, సేవలకు వర్తిస్తాయి. పారిశ్రామిక సంబంధాల కోడ్ ఈ పరిమితిని 100 నుండి 300కి పెంచింది, ఫలితంగా చాలా మంది కార్మికులు ఈ స్టాండింగ్ ఆర్డర్ల కవరేజ్ నుండి బయటకు వచ్చారు. కోట్లాది మందిని కార్మికులుగా గుర్తించకపోవడం, వారి వేతనాన్ని వేతనాలుగా పరిగణించకపోవడంతో వారికి కనీస వేతనాలు అందడం లేదు. అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలను స్వచ్ఛంద సేవకులుగా పిలుస్తారు. వారికి 'గౌరవ వేతనం' చెల్లిస్తారు. గిగ్ కార్మికులను వ్యాపార భాగస్వాములు అని పిలుస్తారు, వారు చాలా తక్కువ,అనిశ్చిత ఆదాయాలను పొందుతారు.

రాతపూర్వక ఉద్యోగ ఒప్పందం లేనందున

గృహ కార్మికులు, అనేక మంది ఇతరులకు రాతపూర్వక ఉద్యోగ ఒప్పందం లేనందున వారు చట్టబద్ధంగా కనీస వేతనాలు పొందలేకపోతున్నారు. ఈ మినహాయింపులను వేతనాల కోడ్ పరిష్కరించదు. పారిశ్రామిక సంబంధాల నియమావళి కనీస కటాఫ్‌ను 100 నుండి 300 మంది ఉద్యోగులకు పెంచుతుంది, ఓ సంస్థను మూసేయడానికి లేదా కార్మికులను వారి ఉద్యోగాల నుండి తొలగించడానికి ప్రభుత్వ అనుమతి అవసరం. ఇది కేంద్ర ,రాష్ట్రప్రభుత్వాలకు నోటిఫికేషన్ ద్వారా ఎప్పుడైనా ఈ కటాఫ్‌ను పెంచడానికి కూడా అనుమతిస్తుంది.వృత్తిపరమైన భద్రత, ఆరోగ్యంపై నియమావళి వ్యవసాయ కార్మికులు, చిన్న నిర్మాణాలలో పనిచేసే కార్మికులు, ఇంటి ఆధారిత కార్మికులు, చేపల కార్మికులు మరియు గృహ కార్మికులను కవర్ చేయదు, వీరంతా కలిసి శ్రామిక వర్గంలో చాలా ఎక్కువ భాగాన్ని కలిగి ఉన్నారు.

(వ్యాస రచయిత సింగరేణి విశ్రాంత ఉద్యోగి, హైదరాబాద్)

రచయితలకు మనవి

ప్రతిపక్షం ఎడిట్ పేజీ 'ఓపెన్ వాయిస్'కు, సాహిత్య పేజీ 'బహుళ'కు తమ రచనలు పంపగోరువారు ఈ కింది చిరునామాకు పంపించగలరు. వీలును బట్టి ప్రచురించగలము. పుస్తక సమీక్షకులు మా చిరునామాకు పోస్టు ద్వారా గానీ, కొరియర్ ద్వారా గానీ రెండు పుస్తకములు తప్పక పంపించగలరు.

రచనలు పంపాల్సిన చిరునామా

ppbahula
@gmail.com
9010223917

ADRESS
Editor,
Prathipaksham,
Telugu Daily
8-1-284/
OU/521/7/9,
OU Colony,
Shaikpet,
Hyderabad,
Telangana
500008

ప్రాంతీయం

చెరువుల రూపురేఖలు మారుస్తాం

- సైదాబాద్లో ఎర్రకుంటను అభివృద్ధి చేస్తాం
- రామంతాపూర్ చిన్నచెరువును ఆహ్లాదంగా మారుస్తాం
- ప్రభుత్వానికి నివేదించి పనులు ప్రారంభిస్తామన్న హైడ్రా కమిషనర్ రంగనాథ్

ప్రతిపక్షం, సిటి బ్యూరో , డిసెంబర్ 9: నగరంలో చెరువుల పరిరక్షణతో పాటు.., అభివృద్ధికి ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత ఇస్తోందని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ తెలిపారు. చెరువులకు పట్టిన మురుగును వదిలించడం తో పాటు.. ఆ పరిసరాలు ఆహ్లాదకరంగా మార్చాలనేది ప్రభుత్వ సంకల్పమని.. ఆ దిశగా హైడ్రా పూర్తి స్థాయిలో పనిచేస్తోందన్నారు. నగరంలో చెరువుల కబ్జాలపై వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో సైదాబాద్లోని ఎర్రకుంట చెరువుతో పాటు.. రామంతాపూర్లోని చిన్న చెరువును హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ మంగళవారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. నగరంలో చెరువులు కబ్జా కాకుండా ఫెన్సింగ్ వేయడంతో పాటు.. వాటి రూపు రేఖలను మార్చుతామన్నారు. హైడ్రా తొలివిడతా చేపట్టిన 6 చెరువుల పునరుద్ధరణలో ఇప్పటికే బతుకమ్మకుంటను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేశామని చెప్పారు. మరో 5 చెరువులు త్వరలోనే ప్రారంభానికి సిద్ధమౌతున్నాయని అన్నారు. అదే మాదిరి సైదాబాద్లోని ఎర్రకుంట చెరువును కూడా పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తామని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ చెప్పారు. 6 ఎకరాలకు పైగా ఉన్న చెరువుకు హైడ్రాలిక్ ఫ్యూచర్స్ అన్నీ ఉన్నాయని అన్నారు. కొంతమంది ఈ చెరువు తమదిగా చెబుతున్నారని.. సర్వే ఆఫ్ ఇండియా, ఎన్ ఆర్ ఎస్ సీ(నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్) మ్యాప్లు, శాటిలైట్ చిత్రాలు, గ్రామ రికార్డులను పరిశీలించి నిర్ణయం తీసుకుంటామన్నారు. ఎక్కడా ఎలాంటి వివాదానికి ఆస్కారం లేకుండా.. పారదర్శకంగా చెరువుల అభివృధిని చేపడుతున్నామన్నారు. ఎర్రకుంట అభివృద్ధితో పరిసరాలన్నీ ఎంతో ఆహ్లాదంగా మారుతాయని చెప్పారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. స్థానిక కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్ రెడ్డితో పాటు.. పలువురు ఈ సందర్భంగా కమిషనర్ను కలిసి చెరువును అభివృద్ధి చేయాలని వినతిపత్రాలు అందజేశారు.

రామంతాపూర్ చెరువు రూపు మారుస్తాం..

రామంతాపూర్ చిన్న చెరువు రూపురేఖలు మార్చేందుకు ప్రభుత్వానికి నివేదికలు పంపి.. వెంటనే పనులు ప్రారంభిస్తామని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ అక్కడి స్థానికులకు హామీ ఇచ్చారు. స్థానిక ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డితో పాటు.. రామంతాపూర్ కార్పొరేటర్ బండారు శ్రీవాణి హైడ్రా కమిషనర్ను కలిసి చెరువును అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా హైడ్రా కమిషనర్ రంగనాథ్ మాట్లాడుతూ నగరంలో ఉన్న ఈ చెరువులు వరద కట్టడికి ఎంతో దోహదపడతాయని.. మరీ ముఖ్యంగా మూసీ నదికి ఆనుకుని ఉన్న చెరువులను రక్షించుకుంటే వరదలను చాలా వరకు నియంత్రించవచ్చునన్నారు. నగరంలో దక్షిణ, తూర్పు భాగంలో వరదలు ఎక్కువగా వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో ఇక్కడ చెరువుల అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తామన్నారు. రామంతాపూర్ చిన్న చెరువు చుట్టూ అనేక నివాస ప్రాంతాలున్నాయని.. భూగర్భజలాలు కూడా కలుషితంగా మారాయని.. ఈ నేపథ్యంలో ఈ చెరువు అభివృద్ధిని వెంటనే చేపడతామన్నారు. చెరువులో పూడికను పూర్తి స్థాయిలో తొలగించి మంచి నీరు చేరేలా ఏర్పాట్లు చేస్తామన్నారు. వాకింగ్ ట్రాక్లు, పిల్లల ప్లే ఏరియాలు, ఓపెన్ జిమ్లు ఇలా ఆరోగ్యకరమైన వాతావరణం ఉండేలా చెరువులను అభివృద్ధి చేస్తామన్నారు.

కేసీఆర్ దీక్ష ఫలితమే డిసెంబర్ 9 విజయ్ దివస్

- కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

ప్రతిపక్షం, సిటి బ్యూరో, డిసెంబర్ 9 : డిసెంబర్ 9 తెలంగాణ విజయ్ దివస్ అని ఎమ్మెల్యే కృష్ణారావు అన్నారు. ఈ సందర్భంగా కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ నవీన్ కుమార్ , కూకట్పల్లి వై జంక్షన్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ నవీన్ కుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం. కెపిహెచ్బి డివిజన్ రోడ్ నెంబర్ 3 వద్ద తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్ష ఫలితంగా తెలంగాణ రాష్ట్ర ప్రకటన విడుదలైన రోజును తెలంగాణ విజయ దివాస్ గా జరుపుకుంటున్నామని తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన మహోన్నత వ్యక్తి బిఆర్ఎస్ పార్టీ అధినేత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ గత పది ఏళ్ల కాలంలో తెలంగాణ రాష్ట్రాన్ని ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దారని భవిష్యత్తులో మళ్లీ కెసిఆర్ ముఖ్యమంత్రి అయ్యి తెలంగాణ రాష్ట్రాన్ని మరింత అభివృద్ధి పథంలో పయనింప చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు,జూపల్లి సత్యనారాయణ, పగడాల శిరీష బాబురావు,మాజీ కార్పొరేటర్ పగడాలు బాబురావు,డివిజన్ అధ్యక్షులు సంతోష్, ప్రభాకర్ గౌడ్. కృష్ణారెడ్డి బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు..

గ్రామాన్ని అభివృద్ధి చేసుకుందాం

- రెడ్డిపల్లి గ్రామ సర్పంచ్ అభ్యర్థి మోహన్ రెడ్డి

ప్రతిపక్షం, మొయినాబాద్, డిసెంబర్ 9 : గ్రామ ప్రజలకు కష్టమొస్తే ముందుంటా గ్రామాభివృద్ధికి తోడుంటానని, ప్రజల ఆశీర్వాదంతో రెడ్డిపల్లి సర్పంచ్ అభ్యర్థిగా బరిలో ఉన్నానని సర్పంచ్ అభ్యర్థి మోహన్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయన ఇంటింటికి తిరుగుతూ ఓటర్లను ఉంగరం గుర్తుకు ఓటువేసి గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రతీ కుటుంబం అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తానని తెలిపారు. తాగునీరు, నాణ్యమైన వీధిలైట్లు, సిమెంట్ రోడ్లు, స్వచ్ఛ గ్రామ పథకం అమలు, కాలువల మరమ్మత్తులు, చెత్త సేకరణ నిరంతర సేవలు, వృద్ధులు వికలాంగులకు సులభమైన ఫించన్ సేవలు, మహిళా సంఘాల బలోపేతం వంటివి తన ప్రాధాన్యతల జాబితాలో ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వ నిధులను పారదర్శకంగా వినియోగించి ప్రతి కుటుంబం అభివృద్ధి చెందేలా పనిచేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, నాయకులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఆదరించండి..రుణం తీర్చుకుంటా

- అమ్డాపూర్ గ్రామ సర్పంచ్ అభ్యర్థి మద్యపాగ కృష్ణ.

ప్రతిపక్షం,మొయినాబాద్,డిసెంబర్ 9 : ప్రజల రుణం తీర్చుకునే అవకాశం వచ్చిందని, నన్ను ఆశీర్వదించి ఆదరించి అఖండ మెజార్టీతో అమ్డాపూర్ సర్పంచ్ గా గెలిపించాలని అమ్డాపూర్ గ్రామ సర్పంచ్ అభ్యర్థి మద్యపాగ కృష్ణ అన్నారు. మంగళవారం అమ్డాపూర్ గ్రామంలో ఇంటింటికి, వాడవాడకు తిరుగుతూ ఒక్కసారి అవకావం ఇవ్వండి నన్ను గెలిపించి ఆశీర్వదిస్తే మీ రుణం తీర్చుకుంటానని ఓటర్లను విజ్ఞప్తి చేశారు. గ్రామాభివృద్దే నా లక్ష్యంగా పెట్టుకొని మీ ముందుకు వచ్చానని. గ్రామంలో ఎలాంటి సమస్య అయినా మీకు ఎల్లవేళలా తోడుంటానని ఓటర్లకు హామీ ఇచ్చారు. అదేవిధంగా గ్రామంలో ప్రతి పేదవానికి అండగా ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. ఈ ప్రచారంలో గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

ఆదరించండి...అభివృద్ధి చేసి చూపిస్తా

- కేతిరెడ్డిపల్లి గ్రామ సర్పంచ్ అభ్యర్థి గొడుగు యాదయ్య

ప్రతిపక్షం, మొయినాబాద్, డిసెంబర్ 9: అవకాశం ఇచ్చి ఆదరించండి... అన్ని విధాల అభివృద్ధి చేసి చూపిస్తానని కేతిరెడ్డిపల్లి గ్రామ సర్పంచ్ అభ్యర్థి గొడుగు యాదయ్య ఓటర్లను వేడుకున్నారు. మంగళవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ ప్రచారం నిర్వహించి ఉంగురం గుర్తుకు ఓటువేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఈ నెల 14న జరిగే సర్పంచ్ ఎన్నికలలో ఉంగురం గుర్తుకు మీ అమూల్యమైన ఓటువేసి గెలిపించాలని కోరారు. కేతిరెడ్డిపల్లి గ్రామాభివృద్ధి, ప్రజల సంక్షేమం, పారదర్శక పాలనను అందించి ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతానని తెలిపారు. అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందిస్తానని వెల్లడించారు.అదేవిధంగా గ్రామ ప్రజలకు మంచినీటి సరఫరా, గ్రామంలో విద్యుత్ లైన్ క్రమ బద్దీకరణ, గ్రామంలోని ప్రతి కాలనీలో చెత్తను తీయించి ప్రతనిత్యం పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుతానని తెలిపారు. గ్రామంలో పెండింగ్ లో డ్రైనేజీ,సీసీ రోడ్లను, పంట పొలాలకు పోయే పార్మేషన్ రోడ్లను మెటల్, బీటీ రోడ్లుగా మారుస్తానని తెలిపారు. అదేవిధంగా కూరగాయల అరుగు సైతం నిర్మించడం జరుగుతుందన్నారు. నాణ్యమైన విద్య, వైద్యం ప్రతి ఆరు నెలలకొకసారి గ్రామంలో వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు.ఆయన వెంట గ్రామ పెద్దలు, మహిళలు, యువకులున్నారు.

తెలంగాణ ఆత్మగౌరవం గెలిచిన రోజు విజయ్ దివస్

- ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

ప్రతిపక్షం, సిటి బ్యూరో, డిసెంబర్ 9: తెలంగాణ ఆత్మగౌరవం గెలిచిన రోజు విజయ్ దివాస్ అని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు.ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని చిలుక నగర్ లోతెలంగాణ ఉద్యమకారుడు బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు పిట్టల నరేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో దీక్ష విజయ్ దివాస్,ప్రత్యేక తెలంగాణ ప్రకటన ప్రక్రియ అనంతరం కేసీఆర్ దీక్ష విరమించిన రోజు సందర్భంగా చిల్కానగర్ చౌరస్తాలో పెద్దఎత్తున బాణాసంచాలు పేల్చడం సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్షారెడ్డి వచ్చి చౌరస్తాలో ఏర్పాటు చేసిన మాజీ ముఖ్యమంత్రి తెలంగాణ జాతిపిత కేసీఆర్ చిత్రపటానికి స్థానిక నాయకులతో కలసి పాలాభిషేకం చేసారు పార్టీ నాయకులు కార్యకర్తలు ఉద్యమకారులు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి కి మిఠాయిలు తినిపించి సంబరాలు నిర్వహించారు. అనంతరం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమ రథసారథి కేసీఆర్ గారు 11 రోజుల పాటు ఆమరణ దీక్ష చేసి,ఢిల్లీ మెడలు వంచి తెలంగాణ ప్రకటన వెలువడేలా చేసిన చారిత్రత్మక రోజు అని ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి గారు వారిని కొనియాడారు ఈ కార్యక్రమంలో చిల్కానగర్ డివిజన్ బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు అంబటి జగదీష్ ముదిరాజ్ నెర్ధం భాస్కర్ గౌడ్ జల్లి మోహన్ గుడి మధుసూదన్ రెడ్డి పల్లె నర్సింగ్ రావు ఈరెల్లి రవీందర్ రెడ్డి కొంపెల్లి రవీందర్ ముదిరాజ్ ఆకిటి బల్ రెడ్డి గిరెడ్డి జనార్ధన్ రెడ్డి మాటేటి కైలాసం సకినాల ప్రసాద్ నేత శనిగరం తిరుమలేష్ రుద్రారపు శంకర్ సదానంద్ చారీ కొంపల్లి రాజ్ కుమార్ మంగలి రమేష్ యువజన నాయకులు పాల్మాకుల సురేష్ కల్వల సంతోష్ సీత రాజు యాదవ్ కొలని సంతోష్ రెడ్డి పొట్టోలు రాజు బొబ్బాల నవీన్ రెడ్డి దాచేపల్లి సాయి కుమార్ దాచేపల్లి శివ పాలమాకుల నాగరాజు పత్తిపాక శంకర్ చారి రఫీక్ ఆటో యూనియన్ నాయకులు తదిరులు పాల్గొన్నారు.

గ్రామానికి సేవచేసే అవకాశం ఇవ్వండి

- బాకారం గ్రామ సర్పంచ్ అభ్యర్థి శ్రీనివాస్ యాదవ్

ప్రతిపక్షం, మొయినాబాద్, డిసెంబర్ 9: ఈ నెల 14న జరిగే సర్పంచ్ ఎన్నికల్లో గ్రామానికి సేవ చేసే అవకాశం ఒక్కసారి ఇచ్చి కత్తెర గుర్తుకు ఓటువేసి భారీ మెజార్టీతో గెలిపించాలని బాకారం గ్రామ సర్పంచ్ అభ్యర్థి శ్రీనివాస్ యాదవ్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గ్రామంలో కత్తెర గుర్తుకు ఓటువేసి గెలిపించాలని ప్రచారాన్ని జోరుగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బాకారం గ్రామాభివృద్ధి ధ్యేయంగా పనిచేస్తానన్నారు. గ్రామంలో ఏ సమస్య వచ్చి ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేస్తానన్నారు. గ్రామంలో సమస్యలన్నీ తెలుసునని ఒక్కసారి అవకాశం ఇచ్చి గెలిపించినట్లయితే గ్రామాన్ని మోడల్ గా అభివృద్ధి చేసి చూపిస్తానన్నారు. గ్రామాభివృద్దే ధ్యేయంగా పనిచేస్తానని పేర్కొన్నారు. గ్రామ సేవకుడిగా ఒక్కసారి తనకు అవకాశం ఇచ్చి గ్రామ ప్రజలు ఆశీర్వదించాలని విన్నవించారు.

విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నతంగా రాణించాలి

- జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య

ప్రతిపక్షం, సంగారెడ్డి ప్రతినిధి, డిసెంబర్ 9 : విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నతంగా రాణించాలని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య సూచించారు. మంగళవారం జోగిపేట ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలను కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల తరగతి గదులను, శుభ్రతను, విద్యార్థుల హాజరును, ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్ను పరిశీలించారు. కలెక్టర్ తరగతుల్లో చదువుతున్న విద్యార్థులతో ప్రత్యక్షంగా ముచ్చటిస్తూ సిలబస్ పూర్తయిందా, బోధన విధానం ఎలా ఉంది, పాఠాలు అర్థమవుతున్నాయా, ఏమైనా సమస్యలు ఉన్నాయా అని ఆరాతీశారు. విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టి చదువులో ముందుండాలని, ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలను ప్రతిరోజూ పునశ్చరణ చేయాలని సూచించారు. ప్రధానోపాధ్యాయురాలిని మొత్తం విద్యార్థుల సంఖ్య, రోజువారీ హాజరు, బోధన , తరగతుల నిర్వహణకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజూ విద్యార్థుల పూర్తి హాజరు ఉండేలా చర్యలు తీసుకోవాలనీ,సిలబస్ను నిర్ణీత సమయానికి పూర్తిచేసి, రివిజన్ క్లాసులను నిర్వహించాలన్నారు. విద్యార్థులను పరీక్షలకు అన్ని విధాల సిద్ధం చేయాలని సూచించారు. కలెక్టర్ వెంట రెవెన్యూ డివిజనల్ అధికారి పాండు, తహసిల్దార్ మధుకర్ రెడ్డి,ఇంచార్జీ ప్రధానోపాధ్యాయురాలు సుధ ,తదితరులు పాల్గొన్నారు.

హైడ్రా సేవలపై గ్లోబల్ సమ్మిట్ ప్రతినిధుల ఆరా

- హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్తో మాటామంతీ
- చెరువుల అభివృద్ధిని అభినందించిన పర్యావరణవేత్తలు

ప్రతిపక్షం,సిటి బ్యూరో , డిసెంబర్ 9: ఫ్యూచర్ సిటీలో జరుగుతున్న గ్లోబల్ సమ్మిట్ కు దేశ, విదేశాల నుంచి వచ్చిన ప్రతినిధులు హైడ్రా కార్యకలాపాల పై ఆసక్తి చూపించారు. చెరువుల పునరుద్ధరణ గురించి ఆరా తీశారు. వర్షాకాలం వరదల నివారణకు తీసుకున్న చర్యల గురించి అడిగి తెలుసుకున్నారు. పలువురు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ను కలిసి హైడ్రా కార్యకలాపాల పట్ల అభినందనలు తెలిపారు. పలువురు పర్యావరణ వేత్తలు హైడ్రా కమిషనర్ను కలిసి జీవ వైవిధ్యాన్ని పెంపొందించడంలో హైడ్రా చర్యలు ఎంతో దోహదం చేస్తాయన్నారు. నగరీకరణలో చెరువులు మురికి కూపాలుగా మారిపోతున్నాయని.. వాటిని పునరుద్ధరించి అక్కడ ఆహ్లాదకర వాతావరణం నెలకొనేలా అభివృద్ధి చేయడం చాలా శుభ పరిణామమని కొనియాడారు. చెరువులతో పాటు.. వాటిని అనుసంధానం చేసే కాలువలను పరిరక్షించుకుంటే.. వరద ముప్పు చాలా వరకు తప్పించుకోవచ్చునని.. ఆ దిశలో హైడ్రా పని అద్భుతమన్నారు. చెరువులను సందర్శించడానికి పలువురు ఆసక్తి కనబర్చారు. వాటర్మ్యాన్గా పేరుగాంచిన ప్రముఖ పర్యావరణ వేత్త రాజేంద్ర సింగ్ పాతబస్తీలోని బమ్రుక్నుద్దౌలా, అంబర్పేటలోని బతుకమ్మకుంట చెరువులను సందర్శించానని.. ఎంతో బాగా అభివృద్ధి చేశారని తెలిపారు. ఆ చెరువు చరిత్ర.. తర్వాత ఆక్రమణలు జరిగిన తీరు.. ఆక్రమణలను తొలగించి చెరువును అభివృద్ధిని చేసిన తీరు ఎంతో అభినందనీయంగా ఉందన్నారు. పూర్తిగా ఆక్రమణలు జరిగి కబ్జాలో ఉన్న బతుకమ్మకుంటను కూడా గొప్పగా అభివృద్ధి చేశారన్నారు. నాలుగు నెలల్లో ఈ చెరువును అభివృద్ధి చేసి ఆ పరిసరాల రూపురేఖలను మార్చేశారని రాజేంద్ర సింగ్ కొనియాడారు. ఇలా అనేకమంది హైడ్రా కమిషనర్ను కలిసి చర్చించారు. అలాగే హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ కూడా పలు స్టాళ్లను పరిశీలించి.. హైడ్రాకు అవసరమైన సాంకేతికతపై దృష్టి పెట్టారు.

పెళ్లి చేసుకుంటానని మోసం
నిందితుడికి 10 ఏళ్ల కఠిన కారాగార శిక్ష

ప్రతిపక్షం గుండాల, డిసెంబర్ 9: పెళ్లి చేసుకునే పేరుతో ఓ మహిళను మోసం చేసిన కేసులో గుండాల మండలానికి చెందిన జువ్వాజి జోషి కిరణ్కు కోర్టు 10 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష విధించింది. అలాగే రూ.7,000 జరిమానా కూడా విధించబడింది .2023లో గుండాల గ్రామానికి చెందిన ఒక మహిళ, తనను ప్రేమించి పెళ్లి చేస్తానని చెప్పి మోసం చేసినందుకు జువ్వాజి జోషి కిరణ్పై గుండాల పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు స్వీకరించిన గుండాల సీఐ ఎల్ రవీందర్ కేసు విచారణ జరిపి,సాక్ష్యాధారాలను సేకరించి కోర్టులో చార్జ్షీట్ దాఖలు చేశారు.కేసులో సాక్షులను పరిశీలించిన కొత్తగూడెం ప్రిన్సిపల్ సెషన్స్ కోర్టు, నిందితుడు చేసిన నేరం నిరూపితమవడంతో మంగళవారం శిక్షను ప్రకటించింది. ప్రిన్సిపల్ సెషన్స్ జడ్జి పి. వసంత్ గారు తీర్పు వెలువరించారు.శిక్ష విధించిన అనంతరం నిందితుడు జువ్వాజి జోషి కిరణ్ను ఖమ్మం జిల్లా సబ్ జైలుకు తరలించారు.ఇట్టి కేసులో నిందితుడికి శిక్ష పడేవిధంగా కృషి చేసిన పబ్లిక్ ప్రాసిక్యూటర్ పివిడి లక్ష్మి,నోడల్ అధికారి ఎస్సై రాఘవయ్య,కోర్ట్ లైజన్ అధికారి వీరబాబు,కోర్ట్ డ్యూటీ అధికారి మహమూద్ పాషా లను జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ప్రత్యేకంగా అభినందించారు.

“

పూర్వోదయ స్కీమ్లో భాగంగా ₹40 వేల కోట్లతో వివిధ ప్రాజెక్టులు చేపట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలి. రూ20 వేల కోట్ల చొప్పన నిధులతో సాగునీటి ప్రాజెక్టులు, మౌలిక వసతులు కల్పించాలి. ప్రకాశం, రాయలసీమలో 20 లక్షల ఎకరాల్లో ఉద్యాన పంటల్ని విస్తరించాలి. రూ 58,700 కోట్లతో చేపట్టే పోలవరం-, నల్లమల సాగర్ ప్రాజెక్టుతో 200 టీఎంసీల గోదావరి నీటిని వినియోగించే అవకాశం ఉంటుందన్నారు.

- అధికారులతో ఏపీ సీఎం చంద్రబాబు

ప్రాంతీయం

క్షయ, మధుమేహంపై ఏదిరా పీహెచ్‌సీ ప్రత్యేక దృష్టి

ప్రతిపక్షం వెంకటాపురం, డిసెంబర్ 9: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ గోపాల రావు, జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ చంద్రకాంత్ ఆదేశాల మేరకు ఏదిరా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) పరిధిలోని గ్రామాల్లో మంగళవారం నాడు క్షయ (టీబీ) అనుమానితులకు, మధుమేహం ఉన్నవారికి ప్రత్యేక వైద్య శిబిరాన్ని నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సూర్య తేజ ఆధ్వర్యంలో వెంకటాపురంలో ఈ శిబిరం జరిగింది. సబ్ సెంటర్ల పరిధి నుంచి గుర్తించిన 58 మందికి క్షయ నిర్ధారణ పరీక్షలు నిర్వహించగా, మధుమేహం ఉన్నవారికి టీ హబ్‌కు రక్తపూత సేకరణ తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ ఈఓ కోటిరెడ్డి, సూపర్‌వైజర్ వెంకటేశ్వర్లు, ల్యాబ్ టెక్నీషియన్లు గురుదేవ్, రవి, హెల్త్ అసిస్టెంట్లు రాజేష్, భూపతి, ఆరోగ్య కేంద్రం ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వెంకటాపురం మండలంలో ఎన్నిక హోరాహోరీ

ప్రతిపక్షం వెంకటాపురం, డిసెంబర్ 9: మూడో విడుత స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో వెంకటాపురం మండలం రాజకీయ వేడి రెచ్చిపోతోంది. ఉపసంహరణల గడువు మంగళవారం తో ముగియడంతో తుది జాబితా ఖరారైంది. మొత్తం 18 సర్పంచ్ స్థానాలకు 62 మంది, 166 వార్డు సభ్య స్థానాలకు 365 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. 16 వార్డు స్థానాలు ఏకగ్రీవంగా ఖరారైనట్టు అధికార వర్గాలు వెల్లడించాయి. వెంకటాపురం మండలంలో మొత్తం 25,336 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 13,485 మంది మహిళలు, 11,870 మంది పురుషులు. మహిళా ఓటర్లు పురుషుల కంటే 1,615 మంది ఎక్కువ కావడంతో ఈసారి ఫలితాలపై మహిళా ఓట్లు కీలకంగా మారనున్నాయి. మండలంలోనే అతిపెద్ద ఓటర్ల సంఖ్య (4,926) కలిగిన వెంకటాపురం మేజర్ పంచాయతీపై జిల్లా నాయకుల దృష్టి కేంద్రీకృతమైంది. ఈ పంచాయతీ ఫలితం మొత్తం మండల రాజకీయాలపై ప్రభావం చూపనుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. డిసెంబర్ 17వ తేదీన ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ జరుగనుంది. అదే రోజు సాయంత్రం ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను ప్రకటిస్తారు. ఎన్నికల బరిలో బహుళ అభ్యర్థులు నిలవడంతో పంచాయతీ పరిధిలో రాజకీయంగా ఉత్సాహం నెలకొంది. ముఖ్యంగా సర్పంచ్ స్థాయిలో అభ్యర్థుల సంఖ్య అధికంగా ఉండటం ఓటర్లను, నాయకత్వాన్ని అలెర్ట్‌లోకి నెట్టింది. ఎవరి ప్రభావం ఎంత మేర ఉందన్న దానిపై ప్రతి గ్రామంలో చర్చలు సాగుతున్నాయి. అభ్యర్థుల ప్రచారం ఊపందుకోవడంతో గ్రామాల్లో వాతావరణం హోరాహోరీగా మారింది. గ్రామాభివృద్ధి హామీలు, సమస్యల పరిష్కారంపై భరోసాలు చెబుతూ అభ్యర్థులు ఇంటింటికీ బిజీ అవుతున్నారు. చివరికి సర్పంచ్ కిరీటం ఎవరి తలపైన వాలుతుందో చూడాలి అనే ఆసక్తి ఓటర్లలో కనిపిస్తోంది.



కాంగ్రెస్ తోనే గ్రామాల అభివృద్ధి

- మాజీ డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి

ప్రతిపక్షం, బాన్సువాడ, డిసెంబర్ 9: అధికారం లో ఉన్న కాంగ్రెస్ పార్టీతోనే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని, పంచాయతీ ఎన్నికలలో భారీ మెజారిటీ తో గెలిపించాలని మాజీ డిసిసిబి చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి, తెలంగాణ ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాలరాజు పేర్కొన్నారు. నియోజక వర్గంలోని వర్ని,రుద్రూర్, కోటగిరి, పోతంగల్ మండలాల గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులకు మద్దతుగా రాష్ట్ర ఆగ్రోస్ చైర్మన్ కాసుల బాలరాజు, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు, మాజీ డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్ రెడ్డి, కాసుల రోహిత్ మంగళవారం ప్రచారం నిర్వహించారు. కోటగిరి మండలం జల్లపల్లి అబాది లో జరిగిన అభివృద్ధి పనులను, రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తు కాంగ్రెస్ పార్టీ అధిష్టానం నిర్ణయించిన సర్పంచ్ అభ్యర్థి వివేక్ మాత్రమేనని అత్యధిక మెజారిటీతో సర్పంచ్ గా గెలిపించాలని కోరారు.కోటగిరి మండల కేంద్రంలో జరిగిన అభివృద్ధి పనులను,రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ కాంగ్రెస్ పార్టీ అధిష్టానం నిర్ణయించిన సర్పంచ్ అభ్యర్థి బర్ల మధుకర్ కు ఓటు వేసి బర్ల మధుకర్ బారీ మెజారిటీ తో గెలిపించాలని కోరారు. రుద్రూర్ మండలం రాయకూర్ క్యాంపు అభివృద్ధి పనులను ,రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ కాంగ్రెస్ పార్టీ అధిష్టానం నిర్ణయించిన రాయకూర్ క్యాంపు గ్రామ సర్పంచ్ అభ్యర్థి రమేష్ ను గెలిపించాలని కోరారు. వర్ని మండలం శ్రీనగర్ గ్రామంలో జరిగిన అభివృద్ధి పనులను, రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తూ కాంగ్రెస్ పార్టీ అధిష్టానం నిర్ణయించిన సర్పంచ్ అభ్యర్థి శివపార్వతి నాగేశ్వర్ రావుకు ఓటు వేసి బారీ మెజారిటీ తో గెలిపించాలని కోరారు. పోతంగల్ మండలం హంగర్గ ఫారం లో కాంగ్రెస్ పార్టీ అధిష్టానం నిర్ణయించిన సర్పంచ్ అభ్యర్థి అక్తర్ బికి ఓటు వేసి బారీ మెజారిటీ తో గెలిపించాలని కోరారు.పోతంగల్ మండలం బాకర్ ఫారం లో సర్పంచ్ అభ్యర్థి శ్రీనివాస్ రావుకు ఓటు వేసి బారీ మెజారిటీ తో గెలిపించాలని కోరారు. ఈ ఎన్నికల ప్రచారంలో వర్ని,పోతంగల్ , రుద్రూర్, కోటగిరి మండల, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, నాయకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సోనియా చిత్ర పటానికి పాలాభిషేకం

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, డిసెంబర్ 9: తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పరిపాలన రెండు సంవత్సరాలు పూర్తి, సోనియా గాంధీ జన్మదిన సందర్భంగా ఆమె చిత్ర పటానికి రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి పాలాభిషేకం చేశారు. మంగళవారం నిజామాబాదు నియోజకవర్గం లోని మోపాల్ మండలం కులస్పూర్ గ్రామంలో తెలంగాణ ప్రదాత సోనియా గాంధీ జన్మదిన సందర్భంగా కేక్ కట్ చేసి గ్రామంలో కాంగ్రెస్ నాయకులులకు తినిపించారు. అనంతరం కులస్పూర్ లో కాంగ్రెస్ పార్టీ నుండి బలపర్చిన సర్పంచ్ అభ్యర్థి లక్ష్మారెడ్డి ను కత్తెర గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర ములో సీఎం రేవంత్ రెడ్డి చేస్తున్న అభివృద్ధి పథకాలలో మహిళలకే పెద్దపిటా వేసిందని గ్రామ సర్పంచ్ లను గెలిపిస్తే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని అన్నారు. ఈ కార్యక్రమం లో డీసీసీ అధ్యక్షుడు నగేష్ రెడ్డి, ఏ ఎం సీ చైర్మన్ ముప్పా గంగారెడ్డి, మండల అధ్యక్షుడు సాయిరెడ్డి, పీసీసీ డెలిగేటు శేఖర్ గౌడ్, కాంగ్రెస్ నాయకులు సాయన్న, దిల్వార్ హుస్సిన్, గ్రామ ప్రజలు, వీడీసీ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

అవినీతి నిర్మూలనలో ప్రజల పాత్ర అవసరం

- జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

ప్రతిపక్షం, భూపాలపల్లి ప్రతినిధి, డిసెంబర్ 9: ప్రభుత్వ సేవల్లో పారదర్శకత, నైతికతను పెంపొందించడం ద్వారా అవినీతి నిర్మూలనలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచే దిశగా అవినీతి నిరోధక శాఖ పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. సోమవారం ఐడిఓసి కార్యాలయంలో అవినీతి నిరోధక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అవినీతి నిర్మూలన వాల్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిసెంబరు 3వ తేదీ నుంచి 9వ తేదీ వరకు అవినీతి నిర్మూలన వారోత్సవాన్ని పురస్కరించుకుని వివిధ విభాగాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు.ప్రభుత్వ కార్యాలయాల్లో సేవలు పొందే ప్రతి పౌరుడు అవినీతి విషయమై జాగ్రత్తగా ఉండాలని, ఏదైనా అవినీతి ఘటనలు గమనించినప్పుడు వెంటనే అవినీతి నిరోధక శాఖకు తెలియచేయాలని సూచించారు. పారదర్శక పరిపాలనకు ప్రజల భాగస్వామ్యం అత్యంత ముఖ్యమని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగి తాను చేయాల్సిన ప్రభుత్వ సేవలకు లంచం అడిగితే ఎసిబి టోల్ ఫ్రీ నంబర్ 1064కు కాల్ చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎసిబి డిఎస్పీ సాంబయ్య, సిఐ రాజు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మంత్రాల నెపంతో వ్యక్తి హత్య నలుగురి అరెస్టు

ప్రతిపక్షం, భూపాలపల్లి ప్రతినిధి, డిసెంబర్9: పంకెన గ్రామంలో మంత్రాలు చేస్తున్నాడనే నెపంతో వ్యక్తిని హత్య చేసిన కేసులో పోలీసులు నలుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు మహాదేవపూర్ సిఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఆయన వెంట పలివెల ఎస్సై జి రమేష్ కూడా ఉన్నారు. తమ తల్లికి మంత్రాలు చేస్తూ ఆమె అనారోగ్యం పాలు కావడానికి కరణమౌతున్నాడని పంకెన గ్రామానికి చెందిన సోదరి బక్కయ్య (45)అనే వ్యకిని అదే గ్రామానికి చెందిన చిలుముల రాజయ్య (34), చిలుముల సంతోష్ (31), తమ బంధువులైన పాగే శ్రీనివాస్ (38), మరియు పాగే రామయ్య (40) అందరూ కలిసి ఈనెల 25న రాత్రి నడుచుకుంటూ తన ఇంటి వైపు వెళ్తున్న సోదరి బక్కయ్య పై నలుగురు వ్యక్తులు విచక్షణ రహితంగా దాడిచేయడంతో చికిత్స పొందుతూ ఈనెల 7న ఎంజీఎం ఆసుపత్రిలో బక్కయ్య మృతిచెందాడు. కేసునమోదు చేసిన పోలీసులు దర్యాప్తులో భాగంగా నిందితులందరినీ అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా హత్య చేసినట్టు అంగీకరించారని పోలీసులు వెల్లడించారు. నిందితులను భూపాలపల్లి కోర్టులో హాజరు పరచి కరీంనగర్ జైలుకు తరలించారు.

తెలంగాణ తల్లి విగ్రహం ఆవిష్కరణ

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, డిసెంబర్ 9: సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (కలెక్టరేట్)లో మంగళవారం తెలంగాణ తల్లి అవతరణ ఉత్సవాలు నిర్వహించారు. వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు పాల్గొని జయజయహే తెలంగాణ గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్ లలో నూతనంగా నెలకొల్పిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని రోడ్లు, భవనాల శాఖ కార్యనిర్వాహక అభియంత (ఎస్.ఈ) కె.సర్దార్ సింగ్ ఆవిష్కరించారు. రాష్ట్ర సచివాలయంలో ఏర్పాటు చేసిన నమూనాను అనుసరిస్తూ జిల్లాలలో కూడా తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే విధంగా ఆకట్టుకునే రీతిలో, స్ఫూర్తిదాయకంగా ఉన్న తెలంగాణ తల్లి విగ్రహం అందరినీ ఆకర్షించింది. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏ.ఓ ప్రశాంత్, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

పోలింగ్ విధులను పారదర్శకంగా నిర్వహించాలి

- కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, డిసెంబర్ 9: పోలింగ్ విధులను పారదర్శకంగా, సమర్ధవంతంగా నిర్వహించాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి సూచించారు. రెండవ విడతగా గ్రామ పంచాయతీ ఎన్నికల విధులలో పాల్గొనే ప్రిసైడింగ్ ఆఫీసర్లకు శనివారం నిజామాబాద్ మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో శిక్షణ తరగతులు నిర్వహించారు. శిక్షణ తరగతులను సందర్శించిన సందర్భంగా కలెక్టర్ పోలింగ్ విధులను నిర్వహించే క్రమంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి స్పష్టమైన అవగాహన ఏర్పర్చుకోవాలని, ఎన్నికల నిర్వహణలో ఏ చిన్న తప్పిదానికి సైతం ఆస్కారం కల్పించకూడదని అన్నారు. ఓటరు జాబితాను పక్కాగా పరిశీలించుకోవాలని, ఆ జాబితాకు అనుగుణంగా ఓటింగ్ ప్రక్రియను నిర్వహించాలని సూచించారు. సమయ పాలనను పాటిస్తూ, సకాలంలో డిస్ట్రిబ్యూషన్ సెంటర్లకు చేరుకుని, పోలింగ్ మెటీరియల్ ను తీసుకోవాలని అన్నారు. చెక్ లిస్టుకు అనుగుణంగా బ్యాలెట్ పత్రాలు, ఇతర సామాగ్రి ఉందా లేదా అన్నది క్షుణ్ణంగా పరిశీలించుకోవాలని, అనంతరం డిస్ట్రిబ్యూషన్ కేంద్రం నుండి పోలింగ్ స్టేషన్ కు చేరుకొని ఓటింగ్ నిర్వహణ ఏర్పాట్లను చక్కబెట్టుకోవాలని కలెక్టర్ సూచించారు. సీటింగ్ అరేంజ్ మెంట్, సీక్రెట్ ఓటింగ్ కంపార్ట్మెంట్ వంటి వాటిని నిబంధనలకు అనుగుణంగా ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. ఓటింగ్ విషయంలో నూటికి నూరు శాతం గోప్యత అమలు జరిగేలా చూడాలన్నారు. ఓటరు ఐ.డీ, ఆధార్ కార్డులే కాకుండా ఎన్నికల సంఘం నిర్దేశించిన 18 రకాల గుర్తింపు కార్డులలో ఏదైనా ఒక దానిని చూపించి ఓటరు ఓటు వేయవచ్చని తెలిపారు. ఎన్నికల విధులలో అనవసర పొరపాట్లకు ఆస్కారం కల్పిస్తే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియలు సాఫీగా జరిగి గ్రామ పంచాయతీ ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా, సజావుగా పూర్తయ్యేలా సమర్ధవంతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. పోలింగ్ కేంద్రాలలో ఓటు వేసేందుకు వచ్చే ఓటర్లను ఎవరు కూడా ప్రలోభాలకు గురి చేయకుండా చూడాలన్నారు. ఇదిలాఉండగా, డిచ్పల్లి మండల కేంద్రంలో పీ.ఓలకు ఏర్పాటు చేసిన శిక్షణ తరగతుల్లో ఎన్నికల సాధారణ పరిశీలకులు జీ.వీ.శ్యాంప్రసాద్ లాల్ పాల్గొని సూచనలు చేశారు. శిక్షణ తరగతుల్లో స్థానిక అధికారులు, స్టేజ్ 2 రిటర్నింగ్ అధికారులు, మాస్టర్ ట్రైనర్లు పాల్గొన్నారు.

దొంగతనాలకు పాల్పడుతున్న గడ్డపార గ్యాంగ్ అరెస్ట్

- దొంగిలించిన బంగారం, వెండి నగలు భారీగా స్వాధీనం.
- వాహన తనిఖీల్లో గ్యాంగ్‌పై కామారెడ్డి పోలీసుల పట్టు – చాకచక్యమైన ఆపరేషన్
- సీసీ టీవీ ఆధారాలతో విచారణ
- జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర

ప్రతిపక్షం ప్రతినిధి, కామారెడ్డి, డిసెంబర్ 9: జిల్లాలో గత కొన్ని రోజులుగా గడ్డపారలతో దొంగతనాలకు పాల్పడుతున్న ముఠా ను పోలీసులు అరెస్ట్ చేసి రిమండ్ కు పంపారు. ఈ మేరకు జిల్లా ఎస్పీ రాజేష్‌చంద్ర మంగళవారం తన కార్యాలయం లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఈ నెల 3 ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల మధ్య ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు గడ్డపార తో ఇంటి తాళాలు పగలకొట్టి ఇంటి లోని బీరవ నుండి బంగారం, వెండి నగలు దొంగిలించారని చిట్యాల గ్రామం, తాడ్వాయి మండలానికి చెందిన మసులా శ్రీనివాస్ పిర్యాదుమేరకు కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించారు. కామారెడ్డి జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర ఆదేశాల మేరకు డిఎస్పి యెల్లారెడ్డి శ్రీనివాసరావ్ పర్యవేక్షణలో సదాశివనగర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ సంతోష్, తాడ్వాయి,గాంధారి ఎస్సైలతో మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి సీసీటీవీ ఫూటేజ్, నేర స్థలంలో దొరికిన ఆదారాల ఆధారంగా విచారణ ప్రారంభించారు. నిందితులు వచ్చి వెళ్ళిన మార్గాలలో సీసీ కెమెరాలను పరిశీలించగా వారు వాడిన టూ వీలర్ రిజిస్ట్రేషన్ నంబర్ పాక్షికంగా లభించింది. దీనిని కొంత ఆధారముగా చేసుకొని విచారణ చేస్తూ నేరస్తులు మరలా నేరం చేయడానికి వచ్చే అవకాశం ఉందని తాడ్వాయి ఎస్సై తన సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు చేస్తుండగా గడ్డపార గ్యాంగ్ (5) ఐదుగురిని పట్టుకోవడం జరిగింది. ఈ గ్యాంగ్ గత నాలుగు నెలలుగా తాడ్వాయి, గంధారి, లింగంపేట్, రాజంపేట్, బాన్స్వాడ, పరిధిలో కలిపి మొత్తం తొమ్మిది ఇండ్ల తాళాలు పగులగొట్టి దొంగతనాలు చేసినట్లు విచారణలో తెలిసింది. ఈ గ్యాంగ్ ప్రధానంగా పగలు, రాత్రి సమయాల్లో లాక్ చేసిన ఇళ్లను గుర్తించి, గడ్డపార, ఇనుప రాడ్లతో తలుపుల లాక్స్, బెడ్‌రూమ్, అల్మారీ లాక్స్ పగలగొట్టి బంగారం, వెండి నగలు నగదు దొంగతనం చేసేవారు. నిందితులు దొంగిలించిన నగలను కొంతమంది అక్రమ గోల్డ్ కొనుగోలుదారులకు విక్రయించినట్లు కూడా ఒప్పుకున్నారు. ఈ గ్యాంగ్ లో బస్సి జోధ్‌రాజ్ (26)S/o విట్టల్, వయసు: 26 గుర్జల్ తండా గ్రామం, గంధారీ మండలం,అంకుష్ ప్రేమ్‌సింగ్ సాబలే(22) మైందానే గ్రామం, బోడ్‌గావ్, ధూలే, మహారాష్ట్ర రాష్ట్రం, ప్రస్తుత నివాసం: గుర్జల్ తండా గ్రామం, గంధారీ మండలం, బామన్ మహేందర్ (24)చెన్నాపూర్ తండా గ్రామం, గంధారీ మండలం, బి. హీరాలాల్ (36)కోల్పోల్ గ్రామం, ముగ్పల్ మండలం, నిజామాబాద్ జిల్లా,నూనవత్ గణేష్ (26)కోల్పోల్ గ్రామం,ముగ్పల్ మండలం,నిజామాబాద్ జిల్లా ఉన్నారు. నిందితుల నుండి 11 తులాలు బంగారం, 22 తులాలువెండి నగలు, ఒక బైక్, 5 మొబైల్ ఫోన్లు, రూ. 8500/ నగదు స్వాధినం చేసుకున్నామని తెలిపారు. చాకచక్యంగా, సమయస్ఫూర్తితో వ్యవహరించి నిందితులను పట్టుకున్న నగర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ సంతోష్, తాడ్వాయి యస్ఐ నరేష్, గాంధారి యస్ఐ ఆంజనేయులు, క్రైం స్టాఫ్ కానిస్టేబుల్ సాయిబాబా, రవి, సంజీవ్ మరియు, వసంత్, పేట్రోలింగ్ టీమ్స్ లను జిల్లా ఎస్పి అభినందించారు.

తన ఆలోచనలు, తెలంగాణ విజన్ డాక్యుమెంట్ లక్ష్యాలు పేదలు, రైతుల చుట్టే తిరుగుతాయి. నేను ఓ మారుమూల గ్రామం నుంచి వచ్చా. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలతో కలిసి పెరిగా. వారి సమస్యలు తెలుసు. ఎడ్యుకేషన్, ఇరిగేషన్‌తో పాటు కమ్యూనికేషన్‌కు ప్రాధాన్యత ఇవ్వనున్నాం. చైనా, జపాన్, కొరియా, సింగపూర్ మాకు రోల్ మోడల్స్. అభివృద్ధిలో వాటితో పోటీ పడతాం.

- గ్లోబల్‌సమ్మిట్లో సీఎం రేవంత్‌రెడ్డి

నాలుగు లేబర్ కోడ్‌లు కార్మిక వర్గానికి ఉరితాళ్లు

- పెట్టుబడుదారులకు లాభం కార్మికులకు నష్టం
- అసంఘటిత కార్మికుల పట్టించుకోలేని ప్రభుత్వాలు
- సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రమ

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, డిసెంబర్ 9: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక విధానాలకు వ్యతిరేకంగా అన్ని వర్గాలను కలుపుకొని కార్మిక వర్గం ఐక్య పోరాటాలు నిర్వహిస్తేనే విజయం సాధిస్తామని కేంద్ర ప్రభుత్వం చేస్తున్న నాలుగు లేబర్ కోడ్ బిల్లులను వ్యతిరేకించకపోతే కార్మికులకు ఉరితాళ్ళులు తప్పవని సిఐటియు జిల్లా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు రమ్య సీఐటీయూ కోశాధికారి రాములు తెలిపారు. సీఐటీయూ ఐదవ మహాసభ ముగింపు సందర్భంగా మంగళవారం సిఐటియు జిల్లా కార్యదర్శి మల్లేశం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో. రాష్ట్ర నాయకులు మాట్లాడుతూ. కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోర్సు అమలు చేసేది తెచ్చిన నోటిఫికేషన్ వెంటనే రద్దు చేయాలని తెలంగాణ రాష్ట్రంలోని లేబర్ కోర్టును అమలు చేయబోమని అసెంబ్లీలో తీర్మానం చేయాలని సిఐటియు డిమాండ్ చేస్తుందని వారు తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దుచేసి 2014 2029 సంవత్సరంలో నాలుగు లేబర్ కోర్టులను తీసుకువచ్చింది లేబర్ కోర్సును రద్దు చేయాలని 29 కార్మిక చట్టాలను పునర్దించాలని డిమాండ్ పై భారత కార్మిక వర్గం ఐదు సంవత్సరాలలో అనేక పోరాటాలు ఆందోళనలు చేసినప్పటికీ అన్ని రంగాల కార్మికులు ఉద్యోగులు 2023 ఫిబ్రవరి 16న చేసిన సెక్టరల్ సమ్మెలో 25 కోట్ల మంది పాల్గొని తమ వ్యతిరేకతను తెలియజేసిన. దేశవ్యాప్తంగా కార్మికులు సార్వత్రిక సమ్మె నిర్వహించినప్పటికీ కేంద్ర ప్రభుత్వం పెట్టుబడిదారులకు అనుకూలంగా నాలుగు లేబర్ కోడలను తీసుకురావడం జరుగుతుందన్నారు. తమ రాష్ట్రాలలో లేబర్ కోడ్ లను అమలు చేయమని దేశంలోని పశ్చిమబెంగాల్, తమిళనాడు, కేరళ రాష్ట్ర ప్రభుత్వాలు ఆయా రాష్ట్రాలలో అసెంబ్లీలో తీర్మానాలు చేశాయి. ఈ నేపథ్యంలో కార్మిక వర్గ మహుకులను భంగం కలిగించే ఈ నాలుగు లేబర్ కోడులను రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ తెలంగాణ రాష్ట్రంలో దీర్ఘకాలిక ఉద్యమాన్ని నిర్వహించాలని సీఐటీయూ ఐదో మహాసభ కార్మిక వర్గానికి పిలుపునిచ్చింది అని వారు తెలిపారు. ముఖ్యంగా ఈ లేబర్ కోడులో కార్మిక సంఘాల రిజర్వేషన్ను కఠిన తర్వాత చేస్తూ 8 గంటల పని విధానం 12 గంటలకు పెంచడం ద్వారా శ్రమ దోపిడీకి స్వేచ్ఛనిస్తుంది కార్మికుల సంక్షేమానికి. ఆరోగ్య సంరక్షణకు ప్రభుత్వాలకు బాధ్యత లేదంటూ అదునపు పనికి అదునపు వేతనం చెల్లించడానికి నిరాకరిస్తుంది కార్మికుల కార్మిక సంఘాల భాగస్వామ్యం లేకుండానే యజమాన్యం మరియు సంబంధిత ప్రభుత్వాలుగా పూర్తి అధికారుల గట్టి పెట్టి కార్మిక శాఖ అధికారులను బలహీనం చేస్తుందని వారు తెలిపారు. ఈ లేబర్ కోడ్ వల్ల పెట్టుబడిదారులకు బహుళ జాతి కంపెనీలకు లాభం కట్టు పెట్టేందుకు కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు ముఖ్యమని కార్మికుల హక్కులను కాలరాస్తున్న నేపథ్యంలో నాలుగు లేబర్ కోడులను వెంటనే ఉపసరించుకోవాలని కేంద్ర బిజెపి ప్రభుత్వాన్ని సీఐటీయూ ఐదవ మహాసభ డిమాండ్. రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలో నాలుగు లేబర్ కోడ్ లను అమలు చేయబోమని అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపాలని దీని కోసం రాష్ట్ర కార్మిక వర్గం ఐక్యంగా పోరాటం చేయాలని సిఐటియు గెలుపొందిస్తుందని వారు తెలిపారు. రాష్ట్రంలో కనీస వేతనాలను జీవోలను ఎరిగిన ధరల కనుగుణంగా సవరించాలని అన్ని రకాల కార్మికులకు కనీస వేతనం 26 వేల రూపాయలు నిర్ణయించాలని సిఐటియు పిలుపునిచ్చింది. రాష్ట్రంలో 1.20 కోట్ల మంది కార్మికులకు కనీస వేతనాలు చెల్లించడం లేదని పెరిగిన ధరలకు అనుగుణంగా కార్మికుల వేతనాలు పెంచకుండా రాష్ట్ర ప్రభుత్వం 73 వ షెడ్యూల్ పరిశ్రమలలో కనీస వేతనాల జీవోలను పెరిగిన ధరలకు అనుగుణంగా సవరించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ప్రభుత్వ రంగాలలో పనిచేస్తున్న కార్మికులు. అసంఘటిత కార్మికుల వేతనాలను పెంచాలని. పెరిగిన పె ధరలకు అనుకూలంగా వేతనాలు పెంచి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులను ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన శ్రమ శక్తినీతి 2025' కేంద్ర ప్రభుత్వ వెంటనే ఉపసరించుకోవాలని సీఐటీయూ ఐదవ రాష్ట్ర మహాసభ డిమాండ్ చేస్తున్నట్లు వారు తెలిపారు. ఐదవ రాష్ట్ర మహాసభలలో రాష్ట్ర ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు.

తెలంగాణ స్ఫూర్తి తరతరాల పాటు వికసించాలి

- కలెక్టరేట్ ప్రాంగణంలో తెలంగాణతల్లి విగ్రహావిష్కరణ

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, డిసెంబర్ 9: తెలంగాణ అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని మెదక్ జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయంలో తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ జిల్లా రెవెన్యూ అధికారి భుజంగారావు జిల్లా అదనపు ఎస్పీ మహేందర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజలలో ఐక్యత ఆత్మ గౌరవాన్ని పెంపొందించే ప్రతీకగా తెలంగాణ తల్లి నిలుస్తుందని పేర్కొన్నారు. అదనపు ఎస్పీ మహేందర్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా జిల్లా కలెక్టర్ కార్యాలయాల్లో తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించాలని తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించుకోవడం శుభ పరిణామం అన్నారు. కలెక్టరేట్ ఆవరణలో తెలంగాణ తల్లి విగ్రహం, ఏర్పాటు చేయడంతో వివిధ పనులపై కలెక్టర్ కార్యాలయానికి వచ్చే ప్రజలకు ఆకట్టుకుంటుందని ఆయన తెలిపారు. జయ జయహే తెలంగాణ గీతాన్ని జిల్లా అధికారులు సిబ్బంది ఆలపించారు. తెలంగాణ తల్లి అవతరణ ఉత్సవం, తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని రోడ్లు భవనాల శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ముందు 10 అడుగుల ఎత్తులో విగ్రహం, బేస్‌మెంట్ 4 అడుగులు, విగ్రహం కింద ఉండే 2 అడుగుల పీఠంతో కలిపి మొత్తం 16 అడుగుల ఎత్తు కలిగిన తెలంగాణ తల్లి విగ్రహం ఉన్నది. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బి ఈ వేణు, డి.ఈ టెక్నికల్ కరుణ, ఏ డబ్ల్యు. ఈ అరుణ్ రెడ్డి, డిఆర్డిఓ పిడి శ్రీనివాసరావు, పరిపాలన అధికారి యూనస్, వివిధ శాఖల అధికారులు, కలెక్టరేట్ అన్ని విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలి

- మహబూబ్ అలీ, సహాయ రిటర్నింగ్ అధికారి

ప్రతిపక్షం, నంగునూరు, డిసెంబర్ 9: పోలింగ్ అధికారులు బాధ్యతాయుతంగా, సమర్థవంతంగా ఎలాంటి పొరపాట్లకు తావు ఇవ్వకుండా ఎన్నికలను నిర్వహించాలని సహాయ రిటర్నింగ్ అధికారి, నంగునూరు ఎంపీడీవో మహబూబ్ సూచించారు. గ్రామపంచాయతీ ప్రిసైడింగ్ అధికారులకు మంగళవారం ఎన్నికల నిర్వహణపై శిక్షణ ఇచ్చారు. నంగునూరు ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఈ శిక్షణ కార్యక్రమంలో సహాయ రిటర్నింగ్ అధికారి అయిన ఎంపీడీవో మహబూబ్ అలీ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో అధికారులు ఎవరూ విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించ వద్దని చెప్పారు. ఎప్పటికప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు, మాస్టర్ ట్రైనర్స్ మధుసూదన్ రెడ్డి, బాలరాజ్, రాంభూపాల్ రెడ్డి లు ప్రిసైడింగ్ అధికారులకు ఎన్నికల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఓటింగ్ విధానం, కౌంటింగ్ తదితర అంశాలపై తగు సూచనలు చేశారు, ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి తగిరెడ్డి దేశిరెడ్డి, సిబ్బంది చంద్రం తదితరులు పాల్గొన్నారు.

మిరుదొడ్డిలో ఫ్లాగ్ మార్చ్

ప్రతిపక్షం, మిరుదొడ్డి, డిసెంబర్ 9: మండల కేంద్రమైన మిరుదొడ్డిలో మంగళవారం స్థానిక సంస్థల ఎన్నికల రెండో విడతలో భాగంగా పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మిరుదొడ్డి ఎస్సై సమత మాట్లాడుతూ ఎన్నికల్లో ఎవ్వరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే సహించేది లేదని తెలిపారు. స్నేహభావంతో ప్రజలు ఉంటూ ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కును వినియోగించు కోవాలన్నారు ఈ కార్యక్రమంలో దుబ్బాక ఎస్సై తో పాటు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కేసీఆర్ దీక్ష ఫలితమే డిసెంబర్ 9 తెలంగాణ రాష్ట్ర ప్రకటన

- సిద్దిపేటలో దీక్ష విజయ దినోత్సవం

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, డిసెంబర్ 9: తెలంగాణ రాష్ట్ర ప్రకటనా దినోత్సవం సందర్భంగా బి ఆర్ ఎస్ పార్టీయ రాష్ట్రపిలుపు మేరకు సిద్దిపేటలో దీక్ష విజయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్ రావు సూచనల మేరకు సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు కొండం సంపత్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ ఫారూక్ హుస్సేన్, రాష్ట్ర కార్యదర్శి రాధాకృష్ణ శర్మ, మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు, మచ్చ వేణుగోపాల్ రెడ్డి, పాల సాయిరాం పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాయకులు తెలంగాణ వచ్చుడో... కెసిఆర్ సచ్చుడో అనే నినాదంతో 11 రోజుల పాటు ఉద్యమ దీక్ష చేపట్టిన కెసిఆర్ త్యాగమే డిసెంబర్ 9, 2009 రాష్ట్ర ప్రకటనా దారితీసిందని అన్నారు. కెసిఆర్ దీక్ష లేకుంటే తెలంగాణ ప్రకటన వెలువడేదే కాదని, ఆయన ప్రాణత్యాగమే ఉద్యమానికి మలుపు తీసుకొచ్చిందని పేర్కొన్నారు. కెసిఆర్ నాయకత్వం తెలంగాణ ప్రజలను ఒక్క తాటిపైకి తీసుకు వచ్చిందని, రాజ్యాంగస్ఫూర్తిప్రదాత అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా తెలంగాణ సాధించబడిందని వక్తలు అన్నారు. పదేళ్ల పాలనలో నీళ్లు, నిధులు, నియమాకాల దిశగా రాష్ట్రం ప్రజా అభివృద్ధి దిశగా పయనించిందని, గోదావరి జలాలు సిద్దిపేట సహా ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసాయని గుర్తుచేసుకున్నారు. నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేస్తూ ప్రజా ఆకాంక్షలను కాలరాస్తూ అబద్ధాలపై నడుస్తున్న ప్రభుత్వం ఇదేనని, కెసిఆర్ పదేళ్ల పాలనలో ప్రారంభమైన ప్రజా విజయ ప్రయాణాన్ని తప్పుదారి పట్టించడానికి కాంగ్రెస్ ప్రయత్నిస్తున్నదని మండిపడ్డారు. కార్యక్రమంలో భాగంగా కోటీలింగాల ఆలయంలో తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలమాలలతో వందనం సమర్పించారు. తరువాత ప్రభుత్వ వైద్య కళాశాల ఆసుపత్రిలో పండ్ల పంపిణీ చేపట్టారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి ఘన నివాళులు అర్పించి, ఉద్యమ స్మృతులను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జంగిటి కనకరాజు, కాముని శ్రీనివాస్, ఎల్లారెడ్డి, బాలమల్లు, పాపయ్య, కనకరాజు, ఆంజనేయులు, మేర సత్యానారాయణ, కరాటే కృష్ణ, ఇర్షాద్ హుస్సేన్, మున్సిపల్ కౌన్సిలర్లు, బి ఆర్ ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిని స్వాగతించండి.. అవకాశం ఇవ్వండి

- గ్రామ అభివృద్ధి లక్ష్యంగా పని చేస్తాను
- నిజాంపేట్ గ్రామ సర్పంచ్ అభ్యర్థి చలిమేటి నరేందర్

ప్రతిపక్షం, మెదక్ టౌన్, డిసెంబర్ 9: అభివృద్ధిని స్వాగతించాలని నిజాంపేట్ గ్రామ సర్పంచ్ అభ్యర్థి చెలిమిటి నరేందర్ గ్రామస్తులను కోరారు. మంగళవారం మెదక్ జిల్లా నిజాంపేట్ గ్రామంలో ఇంటింటి ప్రచారంలో భాగంగా గ్రామంలోని అన్ని వార్డులు తిరుగుతూ జోరుగా ప్రచారం నిర్వహించారు. ఒక్కసారి అవకాశం ఇచ్చి మీ అమూల్యమైన ఓటును బ్యాట్ గుర్తుకు వేసి గ్రామ సర్పంచ్‌గా గెలిపించాలని గ్రామా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ. గ్రామ అభివృద్ధి కోసం తనకు ఒక అవకాశం ఇవ్వాలని, గ్రామ అభివృద్ధి నా లక్ష్యం అని పనిచేసి చూపించడానికి సిద్ధంగా ఉన్నానని అన్నారు. ఈనెల 14న జరిగే సర్పంచ్ ఎన్నికల్లో బ్యాట్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని గ్రామంలో ఇంటింటి ప్రచారంలో ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రజల సమస్యల పరిష్కారమే మొదటి కర్తవ్యం అన్నారు. మీరు వేసే ఓటు, గ్రామ అభివృద్ధికి నిజాంపేట్ భవిష్యత్తు కు అని పేర్కొన్నారు. ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటానన్నారు. సేవలో ఏలాంటి రాజీ ఉండదని చెప్పారు. యువత మహిళలు పెద్దలు సహా గ్రామ ప్రజలు ప్రచారానికి విస్తృతంగా రావడంతో ఆనందంగా ఉందని, ఈ మద్దతు పోలింగ్ దినం వరకు కొనసాగాలని గ్రామస్తులను కోరారు. ప్రజలకు అండగా ఉంటూ గ్రామ అభివృద్ధికి పాటుపడుతానన్నారు. సమస్య ఏదైనా ప్రజలకు అందుబాటులో ఉంటూ ఆపద సంపదలో గ్రామస్తులందరికీ చేదోడు వాదోడుగా ఉంటానన్నారు. గ్రామ ప్రజలు ఆలోచించి ఒక్కసారి చలిమిటి నరేందర్ బ్యాట్ గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీ గెలిపించి, మన గ్రామ అభివృద్ధిలో ప్రజలందరూ సహకరించాలని ఈ సందర్భంగా కోరారు. ఈ ప్రచారంలో బిజెపి నాయకులు, గ్రామ ప్రజలు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

సోనియా గాంధీ జన్మదిన వేడుకలు

ప్రతిపక్షం, నంగునూరు, డిసెంబర్ 9: అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అగ్ర నాయకురాలు సోనియా గాంధీ జన్మదిన వేడుకలు మంగళవారం నంగునూరు మండల కేంద్రంలో ఘనంగా జరిగాయి. కాంగ్రెస్ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు ఎం.డి.ఇమ్రాన్, యువజన కాంగ్రెస్ సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి సాదుల పవన్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో కేక్ కట్ చేశారు. కాంగ్రెస్ కార్యకర్తలు స్వీట్లు పంచుకున్నారు. ఈ సందర్భంగా సాదుల పవన్ కుమార్, ఇమ్రాన్ మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం తెలంగాణ ప్రత్యేక రాష్ట్రాన్ని ఇచ్చిన దేవత సోనియా గాంధీ అని కొనియాడారు. రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఇచ్చిన హామీలను అమలు చేస్తూ అభివృద్ధిలో దూసుకు పోతోందని అన్నారు. పేద ప్రజల అభివృద్ధి, సంక్షేమం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో బడే అశోక్, బోజు రాములు, బడుగు సదానందం, పల్లపు భాను, శ్రీధర్, నగేశ్, నవీన్, శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ ప్రజల ఆకాంక్షను నెరవేర్చిన దేవత సోనియాగాంధీ

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, డిసెంబర్9: ఇచ్చిన మాట ప్రకారం తెలంగాణ ప్రజల ఆకాంక్ష మేరకు తెలంగాణ ప్రత్యేక రాష్ట్రాన్ని ఇచ్చిన దేవత సోనియా గాంధీ అని సిద్ధిపేట కాంగ్రెస్ పార్టీ నియోజక వర్గం ఇన్చార్జ్ పూజల హరికృష్ణ పట్టణం అధ్యక్షుడు అత్తు ఇమామ్ అన్నారు. సిద్ధిపేటలో ముస్తాబాద్ ఎక్స్ రోడ్డు లో ఎఐసిసి నాయకురాలు సోనియా గాంధీ జన్మదినం సందర్భంగా పట్టణం కాంగ్రెస్ ఆధ్వర్యంలో కేకు కట్ చేసి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా సిద్ధిపేట కాంగ్రెస్ పార్టీ నియోజక వర్గం ఇన్చార్జ్ పూజల హరికృష్ణ పట్టణం అధ్యక్షుడు అత్తు ఇమామ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కావాలని ఎంతోమంది అమరులు తమ ప్రాణాలను లెక్కచేయకుండా ప్రాణ త్యాగాలు చేశారు అని అన్నారు. అమరుల త్యాగాలను గుర్తించిన సోనియాగాంధీ తెలంగాణ ట్రాష్ట్రను ఏర్పాటు చేశారు అని అమరుల త్యాగాల ఫలితంగా తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అయ్యింది అని అన్నారు. తెలంగాణ కాంగ్రెస్ మంత్రులు ఎమ్మెల్యేలు ఎంపీలు తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు చేయాలని పోరాటం చేశారు అని రాష్ట్రం ఏర్పాటుపై సోనియా గాంధీ కి వివరించారు అని అన్నారు. సోనియాగఫ్థా రాహుల్ గాంధీ సూచనల మేరకు రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఇచ్చిన హామీలను అమలు చేస్తూ అభివృద్ధిలో దూసుకు పోతున్నది అని అన్నారు. ఈ కార్యక్రమంలో సఖి ఆనంద్ మార్క సతీష్ గౌడ్ రియాజుద్దీన్ పూజల గోపికృష్ణ గ్యాదారి మధు గాయాజుద్దీన్ వహాబ్ అజ్మత్ రషద్ హర్షద్ మున్నా ఎర్ర మహేందర్ ఎల్లవ్వ భవాని సంతోషి బిజెన్సీ విజయ్ గుండు రవితేజ సీతాబాలు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో ఓటు హక్కును వినియోగించుకోవాలి

- మొదటి విడత ఎన్నికల పరిధిలో ప్రభుత్వ సెలవు
- జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కే.హైమావతి

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, డిసెంబర్ 9: జిల్లాలోని గజ్వేల్, మర్కుక్, వర్గల్, జగదేవపూర్, ములుగు, దౌలతాబాద్, రాయపోల్ మండలాల పరిధిలోని గ్రామాలలో ఈనెల 11వ తేదీన జరగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికల మొదటి విడత ఎన్నికలలో ఓటు హక్కు వినియోగించుకునేందుకు సంబంధిత ఏడు మండలాలలోని గ్రామాల పరిధిలోగల ప్రభుత్వ, ప్రైవేటు సంస్థలు, కార్యాలయాలు, విద్యాసంస్థలకు ప్రభుత్వ సెలవు ప్రకటించడం జరిగిందని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కే.హైమావతి ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికలలో ఓటర్లు ప్రశాంత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని కావున ఈ అవకాశాన్ని ఆయా మండలాల్లోని గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకొని 11వ తేదీన ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం 1:00 గంట వరకు నిర్వహించనున్న గ్రామపంచాయతీ ఎన్నికలలో పాల్గొని తమ ఓటు హక్కును తప్పకుండా వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ జిల్లా ఎన్నికల అధికారి ఆ ప్రకటనలో పిలుపునిచ్చారు.

“

అన్ని రంగాలను ఒకే వేదికపైకి తెచ్చి గ్లోబల్ సమ్మిట్ నిర్వహించడం సీఎం రేవంత్‌కే సాధ్యమైంది. ఇంత గొప్ప సభకు తననూ ఆహ్వానించినందుకు ధన్యవాదాలు. సల్మాన్ ఖాన్ వంటి బాలీవుడ్ దిగ్గజాలు కూడా ఇక్కడ పెట్టుబడులు పెట్టడం గొప్ప విషయం. హైదరాబాద్‌ను వరల్డ్ సినీ హబ్‌గా మార్చేందుకు ప్రయత్నిస్తాం.
- మెగాస్టార్ చిరంజీవి

ప్రాంతీయం

దుబ్బాకలో సోనియా గాంధీ జన్మదిన వేడుకలు

ప్రతిపక్షం, దుబ్బాక, డిసెంబర్ 9: అఖిల భారత కాంగ్రెస్ కమిటీ అగ్ర నాయకురాలు సోనియాగాంధీ జన్మదిన వేడుకలు కాంగ్రెస్ నాయకులు కేకు కట్ చేసి సోనియా గాంధీ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొంగరి రవి మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన దేవత సోనియా గాంధీ అని గుర్తుచేశారు. సి ఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం సంక్షేమం ,అభివృద్ధి లో దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్లు మట్ట కిషన్ రెడ్డి, ఆకుల భరత్,ఆత్మ కమిటి డైరెక్టర్ కర్ణంపల్లి రమేష్ గౌడ్, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ శ్రీరామ్ నరేందర్ , పోతారం గ్రామ తాజా మాజీ సర్పంచ్ గడిల జనార్ధన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కీసరి శ్రీనివాస్, బూరాణి శ్రీకాంత్, ఐరేని సాయి తేజ గౌడ్, తాటిపల్లి బాలారెడ్డి మాజీ ప్రజా ప్రతినిధులు , కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు..

ఊపందుకున్న ఎన్నికల ప్రచారం

ప్రతిపక్షం, సిద్దిపేట, డిసెంబర్ 9: మండల పరిధిలోని ఆయా గ్రామాలలో ఎన్నికల ప్రచారం ఊపు అందుకుంది. ఎన్నికలకు మరో మూడు నాలుగు రోజులు మాత్రమే మిగిలి ఉండడంతో అభ్యర్థులు ప్రచార రథాలతో ఆయా గ్రామాలలో తమ గుర్తుకే ఓటు వేయాలంటూ ప్రచారం నిర్వహించడంతోపాటు, ఇంటింటికి తిరుగుతూ తమకు ఓటు వేయాలని గ్రామస్తులను వేడుకుంటున్నారు. రావురూకుల గ్రామంలో సర్పంచ్ అభ్యర్థి బట్టు తిరుపతి గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించి, తనకు ఓటు వేయాలని కోరగా, తొర్నాల గ్రామంలో ఒగ్గు బాల లక్ష్మీ రాంబాబు, రాఘవపూర్ గ్రామంలో గ్యార పద్మ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వీరితోపాటు పెద్ద లింగారెడ్డి పల్లి గ్రామంలో బట్టు భాస్కర్ రెడ్డి, తౌటి తిరుపతి, బుస్సాపూర్ గ్రామంలో కేదారి సదాశివరెడ్డి తదితరులు ప్రచారాలు నిర్వహించారు. ఎన్నికల సందర్భంగా మద్యం, డబ్బు ప్రలోభాలు జరగకుండా రూరల్ సీఐ శ్రీను ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు గ్రామాలలో తనిఖీలు నిర్వహిస్తున్నారు.

ముండ్రాయిని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతా

- సర్పంచ్ అభ్యర్థి జిడ్డి చామంతి

ప్రతిపక్షం, నంగునూరు, డిసెంబర్ 9: సంచార జాతికి చెందిన గంగిరెద్దుల సామాజిక వర్గానికి చెందిన మహిళా విద్యావంతురాలిని అయిన తాను మొట్ట మొదటిసారిగా సిద్దిపేట జిల్లా నంగునూరు మండలం ముండ్రాయి గ్రామ సర్పంచ్ పదవికి పోటీ చేస్తున్నానని జిడ్డి చామంతి తెలిపారు. గ్రామస్తులు ఆశీర్వదించి అవకాశం ఇస్తే గ్రామాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని పేర్కొన్నారు. మంగళవారం గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రజలు ఆశీర్వదించి గ్రామ సర్పంచిగా గెలిపిస్తే గ్రామంలో ఉన్న ప్రధాన సమస్యలను పరిష్కరించేందుకు నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. గ్రామ అభివృద్ధికి శక్తి వంచన లేకుండా కృషి చేసి గ్రామాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో గంగిరెద్దుల సంఘం నాయకులు జిడ్డి వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

మెదక్‌లో తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, డిసెంబర్ 9: మెదక్ జిల్లా కేంద్రంలో త్వరలో తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు మెదక్ జిల్లా నోడల్ అధికారి శాస్త్రవేత్త కే.రాహుల్ విశ్వకర్మ తెలియజేశారు. ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం సహ పరిశోధనా సంచాలకులు డా.ఆర్. ఉమారెడ్డి ఆదేశానుసారం తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కొత్త జిల్లాలో వ్యవసాయ విశ్వవిద్యాలయం రైతుల తరుపున విస్తరణ విభాగానికి సంబంధించి కొత్త జిల్లాలకు ఇప్పటివరకు కార్యాలయాలు నోచుకోలేదు కాబట్టి విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొ. అల్దాస్ జానయ్య సూచనల మేరకు మన రాష్ట్రంలో కొత్తగా ఏర్పడ్డ జిల్లాలలో భాగంగా మన మెదక్ జిల్లాకి తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం కేటాయించబడినది మెదక్ జిల్లా నోడల్ అధికారి శాస్త్రవేత్త కే.రాహుల్ విశ్వకర్మ తెలిపారు జిల్లా కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో ఉన్న పాత వ్యవసాయ అధికారి కార్యాలయం ప్రస్తుతం కార్యకలపాలకు వాడుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి శ్రీ.కే.దేవ్ కుమార్ తెలవడంతో త్వరలో రైతు విజ్ఞాన కేంద్రాన్ని ప్రారంభిస్తామని ఆయన తెలిపారు. రైతు విజ్ఞాన కేంద్రంలో రైతులకు సంబంధించి సలహాలు సూచనలతో పాటు వారికి అవసరమైనటువంటి అన్ని రకాల సలహాలు సూచనలు ఇవ్వడం జరుగుతుందని ఇది రైతులు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఆయన విజ్ఞప్తి చేశారు.

బీఆర్ఎస్ హయాంలోనే పల్లెల్లో అభివృద్ధి

- మెదక్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు పద్మాదేవేందర్ రెడ్డి

ప్రతిపక్షం, మెదక్ టౌన్, డిసెంబర్ 9: బీఆర్ఎస్ పార్టీ బలపర్చిన సర్పంచ్ , వార్డు మెంబర్లను పంచాయతీ ఎన్నికల్లో గెలిపించాలని మాజీ డిప్యూటీ స్పీకర్ మెదక్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు యం.పద్మాదేవేందర్ రెడ్డి ప్రజలను కోరారు. పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓటు అడిగే హక్కులేదని పేర్కొన్నారు. మొదటి విడత గ్రామపంచాయతీ ఎన్నికల ప్రచారంలో భాగంగా బిఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించడానికి మెదక్ జిల్లా బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు మాజీ ఎమ్మెల్యే పద్మ దేవేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే శశిధర్ రెడ్డి, మండల నాయకులతో కలసి పాపన్నపేట మండలంలోని గాంధారిపల్లి, జయపురం, ఎల్లాపూర్,కొత్తపల్లి,అబ్లాపూర్,ఎన్కెపల్లి, సీతానగర్,కుర్తివాడ గ్రామాలలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మహిళలతో కలసి బతుకమ్మ ఆడారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..బీఆర్ఎస్ బలపర్చిన సర్పంచ్, వార్డు మెంబర్లను పంచాయతీ ఎన్నికల్లో గెలిపించాలని కోరారు.రెండేండ్ల పాలనలో కాంగ్రెస్ పల్లెలను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందన్నారు. కేసీఆర్ పదేండ్ల పాలనలో చేసిన అభివృద్ధి పనులు ఇప్పటికీ జిల్లాలోని గ్రామ పంచాయతీల్లో కనిపిస్తున్నాయని చెప్పారు. బిఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని ఓటర్లకు విజ్ఞప్తి చేశారు.పల్లెలను అభివృద్ధి చేసింది కేసీఆర్ అని అన్నారు. ప్రజల కోరిక మేరకు కొత్త పంచాయతీలను ఏర్పాటు చేయడంతోపాటు తండాలను పంచాయతీలుగా మార్చిన ఘనత కేసీఆర్‌ది అని పేర్కొన్నారు. రేవంత్‌రెడ్డి పాలనలో పల్లెల్లో అభివృద్ధి పడకేసింది.రెండేండ్ల పాలనలో గ్రామ పంచాయతీల్లో ఎక్కడా అభివృద్ధి జరగలేదు. పంచాయతీలకు రూపాయి నిధులు రాలేదని అన్నారు.ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరుగ్యారెంటీలు, 420 హామీల అమలులో సీఎం రేవంత్ విఫలం అయ్యారని విమర్శించారు . రూ.4వేల పింఛన్ ఇవ్వలేదు, ఆడబిడ్డలకు రూ.2500 ఇస్తామని, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ స్కీమ్‌లో తులం బంగారం ఇస్తామని చెప్పి రేవంత్ రెడ్డి ఇవ్వడం లేదని అన్నారు. మహిళలు, యువతను మోసం చేసిన కాంగ్రెస్‌కు ఎన్నికల్లో ఓటర్లు బుద్ధి చెప్పాలని సూచించారు.ఈ ప్రచారంలో మండల పార్టీ నాయకులు, కార్యకర్తలు గ్రామస్థులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పోలింగ్ రోజు స్థానిక సెలవు

- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్

ప్రతిపక్షం, మెదక్ టౌన్, డిసెంబర్ 9: మెదక్ జిల్లాలో మూడు విడతలు గా జరిగే గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా ఆయా మండలాల్లో పోలింగ్ రోజు స్థానిక సెలవులు ఇవ్వనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాహుల్ రాజ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ 11, 14, 17 తేదీల్లో పంచాయతీ ఎన్నికలు జరుగుతుండగా ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఆయా మండలాలలో స్థానికంగా సెలవులు ప్రకటించినట్లు కలెక్టర్ పేర్కొన్నారు.

ప్రజల్లో ఆత్మ స్థైర్యం నింపేందుకే ఫ్లాగ్ మార్చ్

ప్రతిపక్షం, దుబ్బాక, డిసెంబర్ 9: గ్రామపంచాయతీ ఎన్నికల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చర్యలు తీసుకుంటున్నామని, ప్రజల్లో ఆత్మస్థైర్యం నింపేందుకే ఫ్లాగ్ మార్చ్ నిర్వహించినట్టు దుబ్బాక సీఐ పాలెపు శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం మండలంలోని హబ్సీపూర్ గ్రామంలో ఏఆర్ పోలీస్ సిబ్బంది, స్థానిక పోలీసుల సహకారంతో గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.మద్యం, నగదు, ఇతర వస్తువులతో ఎవరైనా అభ్యర్థులు ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తున్నట్లు సమాచారం ఉంటే తమకు వివరాలను అందించాలని కోరారు. సామాజిక మాధ్యమాల్లో ఎవరైనా విద్వేషపూరితమైన, అభ్యంతరకరమైన కంటెంట్ను పోస్ట్ చేసినా, షేర్ చేసినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. నిష్పక్షపాతంగా, భయం లేకుండా ప్రజలందరూ తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో దుబ్బాక ఎస్సై కే. కీర్తి రాజు, ఏఆర్ ఎస్సైలు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమ ఫలితమే తెలంగాణ ఏర్పాటు

- డిసెంబర్ 9న రాష్ట్ర ఏర్పాటుకు తొలి అడుగు
- కేసీఆర్ దీక్ష ఫలితమే పోరాటమే విజయ్ దివాస్
- మెదక్ మున్సిపల్ మాజీ చైర్మన్ ఆరేళ్ళ. మల్లికార్జున్ గౌడ్

ప్రతిపక్షం, మెదక్ టౌన్, డిసెంబర్ 9: తుది దశ తెలంగాణ ఉద్యమ ఫలితంగా రాష్ట్ర ఏర్పాటుకు తొలి అడుగుపడిన రోజు డిసెంబర్ 9 విజయ్ దివస్ అని మెదక్ మున్సిపల్ మాజీ చైర్మన్ ఆరేళ్ళ మల్లికార్జున్ గౌడ్ అన్నారు. మంగళవారం మెదక్ జిల్లా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో విజయ్ దివస్ కార్యక్రమంలో భాగంగా మెదక్ మున్సిపల్ మాజీ చైర్మన్ ఆరేళ్ళ మల్లికార్జున్ గౌడ్ , పట్టణపార్టీ కన్వీనర్ మామిళ్ల ఆంజనేయులు ,జిల్లా పరిషత్ మాజీ ఉపాధ్యక్షురాలు యం . లావణ్య రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణారెడ్డి,మాజీ కౌన్సిలర్లు నాయకులతో కలిసి డాక్టర్ బీఆర్ అంబేదర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం తెలంగాణ తల్లి చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు.విజయానికి సూచికగా పింక్ బెలూన్లను ఎగురవేశారు.ఈ సందర్బంగా మెదక్ మున్సిపల్ మాజీ చైర్మన్ ఆరేళ్ళ మల్లికార్జున్ గౌడ్ , పట్టణ పార్టీ కన్వీనర్ మామిండ్ల ఆంజనేయులు మాట్లాడుతూ.. సబ్బండ వర్గాల పోరాటం, అమరుల త్యాగం,కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్షతో ఢిల్లీ పీఠం వణికి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియను ప్రారంభిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించి నేటికి 16 ఏండ్లయిందని చెప్పారు.నవంబర్ 29 దీక్ష దివాస్ లేకుంటే డిసెంబర్ 9 విజయ్ దివాస్ లేదని, డిసెంబర్ 9 లేకుంటే జూన్ 2 లేదని వెల్లడించారు. కేసీఆర్ చేపట్టిన ఆమరణ నిరాహార దీక్షకు తలొగ్గి కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియను ప్రారంభిస్తున్నట్టు ప్రకటించిన రోజే డిసెంబర్ 9 అని గుర్తుచేశారు. కేసీఆర్‌దీక్ష, తెలంగాణ పోరాటం,విద్యార్థుల త్యాగాలను ప్రజలకు, భవిష్యత్తు తరాలకు గుర్తుచేయాలని తెలిపారు. ఈ సందర్బంగా మాజీ ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి తో కలిసి ప్రభుత్వ దవాఖానల్లో రోగులకు పండ్లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు కొట్టాల.విశ్వం ,ఆర్కే శ్రీనివాస్,జయరాజ్,మాయ మల్లేశం, సోహెల్,నాయకులు కిష్టయ్య, మోచి. కిషన్, గట్టేష్, నగేష్, మహమ్మద్ హుస్సేన్,జుబెర్ అహ్మద్,శ్రీకాంత్,సంతోష్, నరేష్, లక్ష్మీనారాయణ, మధు, శంకర్, ఇస్మాయిల్, రామచంద్రారెడ్డి, యాదగిరి, లక్ష్మణ్ రవి, తదితరులు పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు

- ఎన్నికలు ప్రశాంతంగా సాగేందుకు పటిష్ట బందోబస్తు
- జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాస రావు

ప్రతిపక్షం, మెదక్ టౌన్, డిసెంబర్ 9: శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని మంగళవారం ఒక ప్రకటన ద్వారా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికలు మొదటి విడతగా రేగోడ్, హవెలిఘణపూర్, టేక్మాల్, అల్లాదుర్గ్, పాపన్నపేట్, పెద్ద శంకరంపేట్ మండలాల్లో ఈ నెల 11 న జరగనున్న నేపథ్యంలో ఎన్నికల శాంతియుతంగా, నిష్పక్షపాతంగా జరగేందుకు ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలు తప్పని సరిగా పాటించాలని, పోలింగ్ కేంద్రాలు సీసీ కెమెరాల నిఘా లో ఉంటాయని తెలిపారు. పోలింగ్‌కు 44 గంటల ముందు నుండి 09122025 సాయంత్రం 5 గంటల నుండి పోలింగ్ ముగిసే వరకు సైలెంట్ పీరియడ్ అమల్లో ఉంటుందని తెలిపారు.ఈ సమయంలో సభలు, సమావేశాలు, ఇంటింటా ప్రచారం పూర్తిగా నిషేధమని తెలిపారు. ఎంసీసీ (మోడల్ కోడ్ కండక్ట్) ఉల్లంఘనలు జరిగితే ఎన్నిక రద్దు అయ్యే అవకాశం ఉంటుందని హెచ్చరించారు.ఎన్నికల సమయంలో మద్యం ,డబ్బుల పంపిణీ చేసినా, గొడవలు లేదా అల్లర్లు సృష్టించినా వారిపై వెంటనే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మొదటి విడత ఎన్నికల నిర్వహణ కోసం మూడు అంచెల భద్రతా వ్యవస్థతో మొత్తం 750 మంది పోలీసు సిబ్బందిని నియమించి పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ గారు పేర్కొన్నారు. ఓట్ల లెక్కింపు పూర్తయ్యే వరకు ఈ బందోబస్తు కొనసాగుతుందని అన్నారు.ఎన్నికలు ముగిసే వరకు 163 BNSS (144 సెక్షన్) అమల్లో ఉంటుందని, ముగ్గురికి మించి గుంపులుగా ఉండడం నిషేధమని తెలిపారు.సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలు, అసత్య సమాచారం, వదంతులు వ్యాప్తి చేసే వారి పై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎన్నికల ప్రక్రియను ప్రభావితం చేసే విధంగా సోషల్ మీడియా దుర్వినియోగం జరిగితే సంబంధిత వ్యక్తులపై తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. పోలింగ్‌కు 44 గంటల ముందు నుండి రాజకీయ పార్టీలు, అభ్యర్థులు సమావేశాలు, ర్యాలీలు లేదా ఏ విధమైన ప్రచార కార్యక్రమాలు నిర్వహించరాదని ఈ సందర్భంగా సూచించారు.

సమరశీల పోరాటాలకు సన్నద్ధం కావాలి

- మహాసభల ముగింపులో సీఐటీయూ అఖిలభారత ప్రధాన కార్యదర్శి తపన్ సేన్

ప్రతిపక్షం ప్రతినిధి, మెదక్, డిసెంబర్ 9: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు రాబోయే కాలంలో కార్మిక వర్గం అత్యంత భయంకరమైన పరిస్థితులను ఎదుర్కొబోతున్నదనీ, ఆ విధానాలకు ధీటుగా కార్మిక వర్గం అత్యంత సమరశీల పోరాటాలకు సన్నద్ధం కావాలని సీఐటీయూ అఖిల భారత ప్రధాన కార్యదర్శి తపన్ సేన్ పిలుపు నిచ్చారు. మంగళవారం సీఐటీయూ రాష్ట్ర ఐదో మహాసభల ముగింపు సందర్భంగా ఆయన మాట్లాడుతూ లేబర్ కోడ్ ప్రమాదం గురించి ఎక్కడ బడితే అక్కడ, గ్రామాలు,పరిశ్రమలు, నివాస ప్రాంతాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని సూచించారు. ఆ విధానాలు కార్మిక వర్గానికి పెద్ద శత్రువుని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అన్ని రాష్ట్రాలలో నాలుగు లేబర్ కోడ్ లను అమలు చేయాలని ఆ దిశగా ముందుకు వస్తున్న తరుణంలో కార్మిక వర్గం వాటిని తిప్పి కొట్టేందుకు అదే తరహాలో పోరాటాలను పెంచాలని చెప్పారు. ప్రభుత్వం కార్పొరేట్ల కోసం పనిచేస్తున్నదనీ, సీఐటీయూ కార్మికుల పక్షాన పోరాడాలన్నారు. ఇదే క్రమంలో రాష్ట్రంలో మతోన్మాద శక్తులు పెరగితే.కార్మికుల ఐక్యతకు విఘాతం కలుగుతుందని చెప్పారు.అందుకే అది పెరగకుండా తగిన పోరాటాలతో పాటు ప్రత్యామ్నాయ భావాలను వ్యాప్తి చేసేందుకు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. విద్యుత్ బిల్లు వల్ల కార్మికులకే కాదు. కర్షకులకు తీవ్ర నష్టం గ్రామ గ్రామాన రైతులకు తెలియజేయాలని అందుకోసమే సిఐటియు గ్రామ కమిటీలను సైతం భాగస్వామ్యం చేయాల్సిందిగా ఆయన పిలుపునిచ్చారు. దానికి వ్యతిరేకంగా కార్మిక కర్షక మైత్రితో నిర్వహించే పోరాటాలు కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. మహాసభల ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సీఐటీయూ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులుగా చుక్క రాములు, పాలడుగు భాస్కర్, కోశాధికారిగా వంగూరి రాములు, శ్రామిక మహిళ సమన్వయ కమిటీ కన్వీనర్ ఎస్వీ రమ. 31 మందితో ఆఫీసు బేరర్లు ఎన్నుకోగా, ఇందులో ఉపాధ్యక్షులు ఎస్ వీరయ్య,ఆర్ సుధాభాస్కర్, భూపాల్, ఎస్వీ రమ, కళ్యాణం వెంకటేశ్వరరావు, టి వీరారెడ్డి, పి జయలక్ష్మి, జె మల్లిఖార్జున్, వీఎస్ రావు, కె ఈశ్వరరావు,టి రాజారెడ్డి, ఆర్ త్రివేణి, కార్యదర్శులుగా జె వెంకటేశ్, ఎ ముత్యంరావు,బి మధు, జె చంద్రశేఖర్, బి మల్లేశ్, ఎం పద్మశ్రీ, కూరపాటి రమేష్, పి శ్రీకాంత్, ఎం వెంకటేశ్, ఎజే రమేష్, రాగుల రమేష్, కె గోపాల స్వామి, కాసు మాదవి, పి సుధాకర్, జి కవిత ఒకటి కోఅప్షసన్ను మహాసభ ఏకగ్రీవంగా. ఎన్నుకున్నది. 139 మంది రాష్ట్ర కౌన్సిల్, 103 వర్కింగ్ కమిటీ సభ్యులను మహాసభ ఎన్నుకున్నది.ఆకలి మంటల మలమలలాడే అనాదలందరు లేవండోయ్ అనే అంతర్జాతీయ శ్రామిక గీతంతో సభ ముగిసింది. మూడు రోజుల పాటు మహాసభ ప్రతినిధులకు అన్ని సౌకర్యాలు కల్పించిన ఆహ్వాన సంఘం వారికి మహాసభ ధన్యవాదాలు తెలిపింది. మెదక్ జిల్లా సిఐటియు జిల్లా కార్యదర్శిగా పనిచేస్తున్న మల్లేశం ను తోపాటు బాలమణి. నర్సమ్మ లను సిఐటియు రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకోవడంపై మెదక్ సిఐటియు నాయకులు నాగరాజు. సంతోష్ మల్లేశం. బసవరాజ్. తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

తెలంగాణ అభివృద్ధికి విజన్ డాక్యుమెంట్-2047 ఓ దిక్సూచి. ఓ గదిలో కూర్చొని దీన్ని రూపొందించలేదని, విస్తృత సంప్రదింపులు, అనేక అభిప్రాయాల తర్వాతే దీనికి రూపు తెచ్చాం. సమ్మిళిత వృద్ధి ప్రభుత్వ లక్ష్యం. సమ్మిట్‌కు విభిన్న ఆలోచనలతో వచ్చినవారందరికీ ధన్యవాదాలు. అందరి సూచనలు, ఆశయాలకు అనుగుణంగా ముందుకు సాగుతాం.

- గ్లోబల్ సమ్మిట్లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

ప్రాంతీయం

ఘనంగా సోనియా గాంధీ జన్మదిన వేడుకలు

ప్రతిపక్షం బ్యూరో, నిజామాబాద్, డిసెంబర్ 9: కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకురాలు సోనియా గాంధీ 79వ పుట్టినరోజు సందర్భంగా కాంగ్రెస్ భవన్ లో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు నగేష్ రెడ్డి, నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు బొబ్బిలి రామకృష్ణ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి సోనియా గాంధీ జన్మదిన వేడుకలు నిర్వహించారు. అనంతరం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు విపుల్ గౌడ్ ఆధ్వర్యంలో సోనియాగాంధీ చిత్రపటానికి పాలాభిషేకం జరిగింది.ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షుడు నగేష్ రెడ్డి మాట్లాడుతూ సోనియా గాంధీ తన భర్త రాజీవ్ గాంధీ చనిపోయిన దుఃఖాన్ని ఆపుకొని పార్టీ కోసం నిలబడిన వ్యక్తి అన్నారు. ఆమె నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో వచ్చిన ఏనాడు అధికారం కోసం చూడలేదు. సోనియాగాంధీ జాతీయ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలుగా ఎక్కువ కాలం కొనసాగి కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేసిన నాయకురాలు అన్నారు. దేశంలో కాంగ్రెస్ పార్టీ బలంగా ముందుకు వెళ్లడానికి తోడుపడుతున్నాయని, ఎల్లప్పుడూ పార్టీ కోసం శ్రమించే మరెన్నో పుట్టినరోజులు జరుపుకోవాలని, ఆ దేవుడు ఆమెకు ఆయురారోగ్యాలు ప్రసాదించాలని సోనియా గాంధీ గారి నాయకత్వంలో ఖచ్చితంగా రాబోయే ప్రోగ్రామింగ్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని రాహుల్ గాంధీ నీ ప్రధానిగా చేస్తామని అన్నారు. దేశంలో బీజేపీ ప్రభుత్వం మోదీ నెహ్రూ కుటుంబం పై అసత్యపు ప్రచారాలు చేసి ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని, వాటిని కాంగ్రెస్ నాయకులు తిప్పికొడుతున్నారని అన్నారు. నగర అధ్యక్షులు బొబ్బిలి రామకృష్ణ మాట్లాడుతూ తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడింది అంటే అది కేవలం సోనియాగాంధీ చొరవ వల్లనే అని, తెలంగాణ ప్రజలు ఆమెకు రుణపడి ఉంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, చైర్మన్ కేశ వేణు, పిసిసి ప్రధాన కార్యదర్శి రామ్ భూపాల్, పిసిసి డెలిగేట్ శేఖర్ గౌడ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి ,భక్తవత్సలం, జావీద్ అక్రమ్, రత్నాకర్, రామర్తి గోపి, విపుల్ గౌడ్, వేణు రాజ్, రాజా నరేందర్ గౌడ్, సేవాదళ్ సంతోష్, యాదగిరి, ఈసా, మఠం రేవతి, అబ్దుల్ ఎజాజ్, పోల ఉష, చంద్రకళ, లవంగ ప్రమోద్, సకినాల శివ కుమార్, విజయ లక్ష్మీ , సుజాత, ఆశబీ, మాలిక బేగం, రాజేంద్ర ప్రసాద్ ,నరేందర్ గౌడ్, విజయ రాణి, స్వప్న, మీనా, షకీల్, ముస్తఫా, ఆదే ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల సిబ్బంది ర్యాండమైజేషన్ పూర్తి

- జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్

ప్రతిపక్షం ప్రతినిధి, జగిత్యాల, డిసెంబర్9: జిల్లాలో గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణకు ర్యాండమైజేషన్ విధానంలో ఎన్నికల సిబ్బంది కేటాయింపు పూర్తి చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ కార్యాలయంలో ఈ ప్రక్రియ నిర్వహించారు. అనంతరం ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లపై లోకల్ బాడీస్ అడిషనల్ కలెక్టర్ బి. రాజ గౌడ్, ఎలక్షన్ అబ్జర్వర్లు, జిల్లా అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల వారీగా రాండమైజేషన్లో పోలింగ్ సిబ్బందిని కేటాయించినట్లు పేర్కొన్నారు. ర్యాండమైజేషన్ లో పోలింగ్ అధికారులు 1406 (పీవో ప్రిసైడింగ్ ఆఫీసర్స్), ఇతర పోలింగ్ అధికారులు 2005 (ఓపివో)లను మొదటి విడత కొరకు కేటాయించినట్లు తెలిపారు. నియమించిన ఎన్నికల సిబ్బంది ఎలాంటి తప్పిదాలు జరగకుండా ఎన్నికల సంఘం నిబంధనల మేరకు పూర్తి నిష్పక్షపాతంగా ఎన్నికల విధులు నిర్వర్తించాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించే మండలాల్లో బ్యాలెట్ బాక్సులు, పోస్టల్ బ్యాలెట్ల తరలింపు, ఎన్నికల సంబంధించిన ఏర్పాట్లను జిల్లా పంచాయతీ అధికారి రఘువరన్ జిల్లా కలెక్టర్ కు వివరించారు.

కాంగ్రెస్ దే విజయం.. బీఆర్ఎస్, బీజేపీ కనుమరుగు ఖాయం

- కాంగ్రెస్ నేత వెలిచాల రాజేందర్ రావు

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, డిసెంబర్ 9: సర్పంచ్ నుంచి మొదలుకొని ఎంపీటీసీ, జడ్పీటీసీతో పాటు ప్రతి ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడం ఖాయమని, సీఎం రేవంత్ రెడ్డి సుపరిపాలన గ్రామాలకు శ్రీరామరక్ష అని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్చార్జి వెలిచాల రాజేందర్ రావు పేర్కొన్నారు. మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశం లో మాట్లాడుతూ కరీంనగర్లో బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ఇక కనుమరుగవుతాయని ఆరోపించారు. ఇక ఆయా పార్టీలను ప్రజలు నమ్మే పరిస్థితి లేదని బీఆర్ఎస్, బీజేపీ దుకాణం బంద్ కాబోతుందని పేర్కొన్నారు. కరీంనగర్ నియోజకవర్గంలో గ్రానైట్ పరిశ్రమ పేరిట గత బీఆర్ఎస్ పాలకులు కోట్లాది రూపాయల దోచుకుతిన్నారని మండిపడ్డారు. కరీంనగర్ నియోజకవర్గంలోని కరీంనగర్ రూరల్ మండలం కొత్తపల్లి మండలంలో కాంగ్రెస్ పార్టీ బలపరుస్తున్న అభ్యర్థులను గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. కొత్తపల్లి మండలంలో 20 గ్రామాల్లో కాంగ్రెస్ బలపరుస్తున్న అభ్యర్థులను ప్రజల అత్యధిక మెజార్టీతో గెలిపించడం ఖాయమని, తాను పర్యటించిన సమయంలో ఇదే విషయాన్ని ప్రజలు వెల్లడించారని తెలిపారు. బావు పేటను గత బీఆర్ఎస్ పాలకులు గ్రానైట్ అడ్డగా మార్చుకొని కోట్లాది రూపాయలు దోపిడీకి పాల్పడ్డారని మండిపడ్డారు. సర్పంచ్ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఏ ఎన్నిక వచ్చినా కాంగ్రెస్ పార్టీ విజయం ఖాయమని కరీంనగర్ ను కాంగ్రెస్ అడ్డాగా తీర్చిదిద్దుతామని రాజేందర్ రావు వెల్లడించారు. కరీంనగర్ రూరల్ కొత్తపెల్లి మండలాల్లో అన్ని గ్రామాలను సందర్శించానని, సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ బలపరచిన అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపిస్తామని ప్రజలు స్పష్టం చేశారని రాజేందర్రావు తెలిపారు. సోనియాగాంధీ జన్మదినాన్ని పురస్కరించుకుని అత్యధికంగా సర్పంచ్ స్థానాలను సాధించి తీరుతామని పేర్కొన్నారు.

ఘనంగా సోనియా జన్మదిన వేడుకలు

ప్రతిపక్షం, మంచిర్యాల, డిసెంబర్ 9: మంచిర్యాల జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ అగ్ర నేత సోనియా గాంధీ 79వ జన్మదిన వేడుకలను ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు స్వగృహంలో ఆయన సతీమణి కొక్కిరాల సురేఖ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సోనియా గాంధీ తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన అధినేత అని అన్నారు. నవంబర్ 9న తెలంగాణ రాష్ట్ర తొలి ప్రకటన జరిగిందన్నారు. ఇటువంటి తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రదాత మరెన్నో జన్మదిన వేడుకలు జరుపుకొని తన సేవలు కాంగ్రెస్ పార్టీకి దేశానికి అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా నాయకురాలు, విద్యార్థి విభాగం నాయకులు మాజీ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

యూజీసీ నెట్, టీజీ సెట్ కోసం

పీజీ పరీక్షలు రీ షెడ్యూల్

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, డిసెంబర్ 9: శాతవాహన విశ్వవిద్యాలయంలో విద్యార్థులతో ఉపకులపతి ఆచార్య ఉమేష్ కుమార్ మాట్లాడారు. విద్యార్థులు ప్రధానంగా యూజీసీ నెట్, టీజీ సెట్ పరీక్షలకు సన్నద్ధం అవుతున్నారని అందుకే పీజీ పరీక్షలను జనవరి 5, 2026 నుండి నిర్వహించడానికి ప్రణాళికలు చేస్తామన్నారు. ఈ సమావేశంలో ఉపకులపతి రిజిస్ట్రార్ ఆచార్య జాస్తి రవికుమార్, పరీక్షల నియంత్రణ అధికారి సురేష్ కుమార్, ప్రిన్సిపల్స్ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చదువుల తల్లికి అండగా హరీష్ రావు

- దళిత బిడ్డ డాక్టర్ కలకు వీహెచ్ఆర్ ఫౌండేషన్ భరోసా
- ఎంబీబీఎస్ విద్యార్థిని సౌజన్యకు రూ.1.50 లక్షల ఆర్థిక సాయం అందజేత

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, డిసెంబర్ 9: పేదరికం ప్రతిభకు అడ్డుకాకూడదని ఉన్నత చదువులు చదవాలన్న పేద విద్యార్థుల కలలకు తాను ఎప్పుడూ అండగా ఉంటానని మాజీ మంత్రి హరీష్ రావు మరోసారి నిరూపించుకున్నారు. వైద్య విద్యను అభ్యసించాలన్న ఓ దళిత బిడ్డ సంకల్పానికి ఆయన తోడ్పాటునందించారు.సిద్దిపేటలోని సురభి మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించిన దళిత విద్యార్థిని సౌజన్యకు కాలేజీ ఫీజు చెల్లించడానికి వి.హెచ్.ఆర్ ఫౌండేషన్ సహకారంతో సమకూర్చిన రూ. 1,50,000 రూపాయలు ఆర్థిక సాయాన్ని ఈరోజు హరీష్ రావు స్వయంగా అందజేశారు.ఈ సందర్భంగా హరీష్ రావు విద్యార్థిని సౌజన్యను ఆప్యాయంగా పలకరించి, పేదరికంలోనూ కష్టపడి ఎంబీబీఎస్ సీటు సాధించినందుకు ప్రత్యేకంగా అభినందించారు. కష్టపడి చదివి మంచి డాక్టర్ గా ఎదగాలి పేదలకు సేవ చేయాలి. ఆర్థిక ఇబ్బందుల గురించి ఆందోళన చెందవద్దు. భవిష్యత్తులో చదువు పరంగా ఏ అవసరం వచ్చినా తనను సంప్రదించమని విద్యార్థినికి ధైర్యం చెప్పి ఆల్ ది బెస్ట్ తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేషన్ చైర్మన్ డా. ఎర్రోళ్ల శ్రీనివాస్ , సీనియర్ నాయకులు అభిలాష్ రంగినేని పాల్గొన్నారు.

'శాతవాహన'లో దక్షిణ మండల బాల్ సెలక్షన్స్

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, డిసెంబర్ 9: శాతవాహన విశ్వవిద్యాలయ క్రీడా మైదానంలో సౌత్ జోన్ అంతర విశ్వవిద్యాలయ ఫుట్ బాల్ టోర్నమెంట్ జనవరి 5 నుండి 11 వరకు హోక్సన్ విశ్వవిద్యాలయం హైదరాబాద్ లో జరగనుండగా శాతవాహనలోఎంపికలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన విశ్వవిద్యాలయ సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ రమాకాంత్ మాట్లాడుతూ క్రీడల వల్ల శారీరక దృఢత్వం పెరుగుతుందని దీనితో విద్యార్థుల ఆత్మ ధైర్యం పెరుగుతుందని దీనివల్ల విద్యార్థులు క్రీడా నైపుణ్యాలు పెంచుకొని బహుమతులు గెల్చుకొని విశ్వవిద్యాలయానికి పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని తెలిపారు. స్పోర్ట్స్ బోర్డ్ సెక్రటరీ నజీముద్దీన్ మునవర్ మాట్లాడుతూ క్రీడాకారులు విశ్వవిద్యాలయాలకి, తాము చదివిన విద్యాసంస్థలకు మంచి పేరును తీసుకురావాలని సందేశం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ స్పోర్ట్స్ కోఆర్డినేటర్ డా. మనోజ్ కుమార్, పీడీ విజయకుమార్, వివిధ కళాశాలల వ్యాయామ అధికారులు ఫుట్ బాల్ కోచ్ లు దినేష్, శ్రీనాథ్, సాబీ, రషీద్ వివిధ కళాశాలల క్రీడాకారులు పాల్గొన్నారు.

అవినీతి రహిత సమాజమే మనందరి లక్ష్యం

- జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

ప్రతిపక్షం బ్యూరో, కరీంనగర్, డిసెంబర్ 9: అవినీతి రహిత సమాజం మనందరి లక్ష్యమని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. అంతర్జాతీయ అవినీతి నిరోధక దినోత్సవం పురస్కరించుకొని అవినీతి నిరోధక శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో ఏర్పాటు చేసిన పోస్టర్ ఆవిష్కరణ, ప్రతిజ్ఞ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. అవినీతి వ్యతిరేక దినోత్సవ పోస్టర్ను ఆవిష్కరించారు. అవినీతిని నిరోధిస్తామని అధికారులు, ఉద్యోగులు కలెక్టర్ తో కలిసి ప్రతిజ్ఞ చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అవినీతి నిర్మూలనలో విద్యార్థి, యువత పాత్ర చాలా కీలకమని అన్నారు. ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగులు లంచం అడిగితే 1064 టోల్ ఫ్రీ నంబర్ కు సమాచారం అందించాలని తెలిపారు. ప్రభుత్వ అధికారులు, సిబ్బంది తమ కర్తవ్యాన్ని బాధ్యతాయుతంగా నిర్వహించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్ఓ వెంకటేశ్వర్లు, ఏసీబీ డీఎస్పీ విజయ్ కుమార్, ఇన్స్ స్పెక్టర్ కృష్ణ కుమార్, ప్రభుత్వ అధికారులు, సిబ్బంది, ఏసీబీ సిబ్బంది పాల్గొన్నారు.

చైన్ స్నాచింగ్ కేసులో నిందితుడి అరెస్టు

ప్రతిపక్షం, కొమురవెల్లి, డిసెంబర్ 9: చైన్ స్నాచింగ్ కేసులో కొమురవెల్లి పోలీసులు నిందితుడిని చాకచక్యంగా పట్టుకుని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. మంగళవారం కొమురవెల్లి పోలీసు స్టేషన్ లో ఎస్ఐ టి .మహేష్ విలేకరుల సమావేశం నిర్వహించి నిందితుడి వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా కొమురవెల్లిలో చోరీ జరిగిన నుంచి అనుక్షణం ,ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టి, నిందితుడిని పట్టుకున్నామని, ఈఘటనపై బాధితురాలి ఫిర్యాదు మేరకు కొమురవెల్లి పోలీసులు స్టేషన్లో కేసు నమోదు చేసుకొని విచారణ ప్రారంభించినట్లు తెలిపారు. నమ్మకమైన సమాచారం ఆధారంగా పోలీసులు నిందితుడైన కొమురవెల్లికి చెందిన తిగుళ్ల రాజనీకాంత్ ను అరెస్టు చేశామని తెలిపారు. విచారణలో నిందితుడు నేరాన్ని ఒప్పుకోగా, అతని వద్ద నుండి దొంగిలించిన బంగారు వస్తువులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని మంగళవారం న్యాయస్థానంలో హాజరు పరచగా, నిందితుడిని జ్యూడిషియల్ రిమాండ్ కు తరలించినట్లు తెలిపారు.

తొలి విడతకు కట్టుదిట్టమైన భద్రత

- పోలీస్ కమిషనర్ విజయ్‌కుమార్

ప్రతిపక్షం బ్యూరో, సిద్దిపేట, డిసెంబర్ 9: సిద్దిపేట జిల్లా గజ్వేల్, దౌల్తాబాద్, జగదేవ్‌పూర్, మర్కుక్, ములుగు, రాయపోల్ మరియు వర్గల్ మండలాల్లో స్థానిక సంస్థల ఎన్నికల తొలి విడత డిసెంబర్ 11న ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరగనున్న నేపథ్యంలో, ఎన్నికలు పూర్తిగా శాంతియుతంగా, నిష్పక్షపాతంగా సాగేందుకు విస్తృత భద్రతా ఏర్పాట్లు చేసినట్టు సిద్దిపేట పోలీస్ కమిషనర్ ఎస్ఎం విజయ్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఎన్నికల సమయంలో ఎలాంటి అనుచిత సంఘటనలు జరగకుండా జిల్లాలో 163 BNSS (144 సెక్షన్) అమల్లో ఉందని తెలిపారు. పోలింగ్ కేంద్రాల పరిసరాల్లో 100 మీటర్ల పరిధిలో ఐదు గురికి పైగా వ్యక్తులు గుంపులుగా గుమికూడకూడదని , సైలెంట్ పీరియడ్ కూడా ఇప్పటికే ప్రారంభమైందన్నారు. డిసెంబర్ 9 సాయంత్రం 5 గంటలనుండి పోలింగ్ ముగిసే వరకు ఎలాంటి రాజకీయ సభలు, ఇంటింటా ప్రచారం, లౌడ్‌స్పీకర్ల వినియోగం, బైక్ ర్యాలీలు పూర్తిగా నిషేధం అన్నారు. పోలింగ్ కేంద్రం వైపు వెళ్లే మార్గాల్లో ప్రచారం చేయడం, ఓటర్లను ప్రలోభ పెట్టడం, ఉద్రిక్తత సృష్టించడం అస్సలు అనుమతి లేదని కమిషనర్ హెచ్చరించారు. ఎలక్ట్రానిక్ పరికరాలపై నిబంధనలు కఠినంగా అమల్లో ఉంటాయని స్పష్టం చేస్తూ పోలింగ్ కేంద్రం ప్రాంగణంలో లేదా 100 మీటర్ల పరిధిలో మొబైల్ ఫోన్లు, కార్డ్‌లెస్ ఫోన్లు, వైర్‌లెస్ పరికరాలు తీసుకురావడం అనుమతి లేదు అన్నారు.ఎన్నికల భద్రత దృష్ట్యా వైన్‌షాపులు డిసెంబర్ 9 సాయంత్రం 5 గంటలనుంచి 12వ తేదీ ఉదయం 10 గంటల వరకు పూర్తిగా మూసివుంచాలనీ,అక్రమ మద్యం రవాణా, నిల్వపై ఎవరైనా కనిపించినా కఠినంగా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఓటర్లు పోలింగ్ కేంద్రానికి కేవలం గుర్తింపు కార్డు మాత్రమే తెచ్చుకోవాలనీ, ఇంక్, వాటర్ బాటిళ్లు, కత్తులు లేదా భద్రతా దృష్ట్యా అనుమానం కలిగించే ఇతర వస్తువులు తీసుకురావడం నిషేధం అన్నారు. పోలింగ్ పూర్తయ్యే వరకు బయట ప్రాంతాల నుంచి వచ్చిన వ్యక్తులు కేంద్రాల పరిసరాల్లో ఉండడానికి అనుమతి లేదనీ,ఓటు వేసిన వెంటనే ఎక్కడా గుమిగూడకుండా నేరుగా ఇళ్లకు వెళ్లాలనీ,అలాగే పోలింగ్ ముగిసిన తర్వాత విజయోత్సవ ర్యాలీలు, ఊరేగింపులు, ప్రదర్శనలు పూర్తిగా నిషేధం అన్నారు. ఎవరు ఈ నిబంధనలను ఉల్లంఘించినా కేసులు నమోదు చేస్తాం అని స్పష్టం చేశారు.ఎన్నికలు శాంతియుతంగా, స్వచ్ఛంగా, పారదర్శకంగా జరగడానికి ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని మనవి చేస్తున్నాను అని కమిషనర్ ఎస్.ఎం. విజయ్‌కుమార్ పౌరులను కోరారు.

విధి నిర్వహణలో పక్షపాత ధోరణి వద్దు

ప్రతిపక్షం, మిడిదొడ్డి, డిసెంబర్ 9: ఎన్నికల నిర్వహణలో అధికారులు పక్షపాత ధోరణి అవలంబించవద్దని జడ్పీ సీఈవో రమేష్ పేర్కొన్నారు. మంగళవారం మిరుదొడ్డి రైతు వేదికలో రెండో విడత ఎన్నికల నేపథ్యంలో ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ తరగతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఎన్నికల నిర్వహణలో పాటించాల్సిన విధివిధానాలపై దిశా నిర్దేశం చేశారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని పాటించాలన్నారు. శిక్షణ కార్యక్రమంలో ఎంపీడీఓ గణేష్ రెడ్డి, ఎంపీవో ఫహీం, ఎంఈఓ ప్రవీణ్ బాబు, మాస్టర్ ట్రైనర్స్ జగదీశ్వర్ తదితరులున్నారు.

జీరో ఎర్రర్ రెవెన్యూ వ్యవస్థ ఏర్పాటు దిశగా ప్రభుత్వం పనిచేస్తుంది. గత పాలకుల పాపాలను కడిగేందుకు కృషి చేయడంతో ప్రజలకు పూర్తిస్థాయిలో న్యాయం చేయలేకపోయాం. అన్ని జిల్లాల్లో రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసమే జాయింట్ కలెక్టర్లు పనిచేయాలని సీఎం స్పష్టం చేశారు. జేసీలు లేని జిల్లాలకు వెంటనే నియమించాలన్నారు. ఇకపై భూసమస్యలన్నింటికీ జేసీలదే బాధ్యత.

- ఏపీ మంత్రి అనగాని సత్యప్రసాద్

ప్రాంతీయం

కలెక్టరేట్ లో ఘనంగా తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ

- విగ్రహావిష్కరణ చేసిన జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్

ప్రతిపక్షం, హనుమకొండ, డిసెంబర్ 9: హనుమకొండ జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహావిష్కరణ కార్యక్రమం మంగళవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ముఖ్య అతిథిగా హాజరై తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించారు. తెలంగాణ గౌరవం, సాంప్రదాయాలు, సాంస్కృతిక వైభవాన్ని ప్రతిబింబించేలా ఈ ఆవిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్చార్జి అదనపు కలెక్టర్ వైవీ. గణేష్, డీఆర్డీవో మేన శ్రీను, ఆర్ అండ్ బీ ఈఈ సురేష్ బాబు, హనుమకొండ ఆర్డీఓ రాథోడ్ రమేష్, డీటీఓ శ్రీనివాస్ కుమార్, జిల్లా అధికారులతో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

వంగరామయ్యపల్లి సర్పంచ్‌గా భూక్య రాజేశ్వరి

- సర్పంచ్ సహా 8 వార్డులను ఏకగ్రీవంగా ఎన్నుకున్న గ్రామస్తులు

ప్రతిపక్షం, హుస్నాబాద్, డిసెంబర్ 9: హుస్నాబాద్ మండలంలోని వంగరామయ్యపల్లి గ్రామ సర్పంచ్ ను గ్రామస్తులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామస్తులు గ్రామపంచాయతీ ఆవరణలో సమావేశమై కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థి భూక్య రాజేశ్వరి తిరుపతి నాయక్ ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఒకటో వార్డ్ నుంచి లావుడ్య జ్యోతి, రెండవ వార్డు బందేల శరత్, మూడవ వార్డు యశోద, నాలుగో వార్డు బోడ రమేష్ , ఐదవ వార్డు లావుడ్యరవీందర్, ఆరో వార్డు దుండగుల రాజు, ఏడవ వార్డు లావుడ్య రమ, ఎనిమిదవ వార్డు సాంకూరి సంగీతను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నిక పట్ల కాంగ్రెస్ పార్టీ నాయకులు బందెల హరీష్, అనుమాండ్ల శ్రీకాంత్ రెడ్డి, మండలం బీఆర్ఎస్ నాయకులు వంగ వెంకట్రామిరెడ్డి, ఎడబోయిన తిరుపతిరెడ్డి, బోడ శ్రీనివాస్, బోడ మోహన్ నాయక్, గ్యామా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

తోటపల్లిని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతా

- కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బంక చందు
- సర్పంచ్‌గా బంక లక్ష్మీ చందు ఏకగ్రీవ ఎన్నిక పట్ల కృతజ్ఞతలు

ప్రతిపక్షం, హుస్నాబాద్, డిసెంబర్ 9: ఒక నాయకుడిగా కాకుండా, సేవకుడిలా పనిచేసి తోటపల్లి గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని హుస్నాబాద్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బంక చందు స్పష్టం చేశారు. హుస్నాబాద్ మండలంలోని తోటపల్లి గ్రామ సర్పంచ్‌గా తన భార్య బంక లక్ష్మీ చందు ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా గ్రామస్తులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా బంక చందు మాట్లాడుతూ.. రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రత్యేక చొరవ, సహాయ సహకారాలతో గ్రామంలో ఇప్పటికే కోట్లాది రూపాయల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామన్నారు. గ్రామస్తులంతా తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా, గ్రామాభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా హుస్నాబాద్ మండలంలోని వంగరామాయపల్లి, రాములపల్లి, తోటపల్లి గ్రామాలు ఏకగ్రీవంకావడం పట్ల ఆయా గ్రామ ప్రజలకు బంక చందు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తోటపల్లి గ్రామ ప్రజలందరినీ తన కుటుంబ సభ్యులుగా భావిస్తూ, నిరంతరం అందుబాటులో ఉంటానని తెలిపారు.

ఘనంగా సోనియా గాంధీ జన్మదిన వేడుకలు

ప్రతిపక్షం, హుస్నాబాద్, డిసెంబర్ 9: సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలో కాంగ్రెస్ అగ్ర నాయకురాలు సోనియా గాంధీ జన్మదిన వేడుకలు స్థానిక కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో భారీ కేక్ కట్ చేశారు. స్వీట్లు పంపిణీ చేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో బ్రేడ్ పండ్లు పంపిణీ చేశారు. అనంతరం కేడం లింగమూర్తి మాట్లాడుతూ ఎందరో విద్యార్థుల ఆత్మ బలిదానాలు చూసి చలించిపోయి సోనియా గాంధీ జన్మదిన కానుకగా తెలంగాణ ఇచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ బోలిశెట్టి శివయ్య, మాజీ కౌన్సిలర్లు చిత్తారి పద్మ, వల్లపు రాజు మేదరవేణి శ్రీను, కాంగ్రెస్ నాయకులు నాయిని రజిత, గంపల శ్రీనివాస్, పచ్చిమట్ల రాధ, లావుడ్యా బిక్య నాయక్, బత్తుల రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరికలు

ప్రతిపక్షం, హుస్నాబాద్, డిసెంబర్ 9: సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం మహమ్మదాపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకులు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కేడం లింగమూర్తి, హుస్నాబాద్ సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య ఆధ్వర్యంలో హుస్నాబాద్ లో కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో మహమ్మదాపూర్ బీఆర్ఎస్ పార్టీ కి చెందిన మాజీ ఉప సర్పంచ్ జిల్లెల తిరుపతిరెడ్డి, గ్రామ శాఖ వర్కింగ్ ప్రెసిడెంట్ కత్తుల సమ్మరాజు, నాయకులు బొల్లితిరుపతి ఉన్నారు. ఈ సందర్భంగా కేడం లింగమూర్తి, బొలిశెట్టి శివయ్యలు మాట్లాడుతూ ఈనెల 17న జరగనున్న గ్రామపంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్ తో సహా, పది వార్డు స్థానాలు అత్యధిక మెజార్టీతో పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవాలని నాయకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అధ్యక్షుడు బంక చందు, మహమ్మదాపూర్ కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు సంగ శ్రీధర్, ఓయూ జేఏసీ వైస్ చైర్మన్ గంపల శ్రీనివాస్, ఇన్చార్జి బొంగోని శ్రీనివాస్, గ్రామ శాఖ అధ్యక్షులు సంఘ శ్రీధర్, నాయకులు పూదరి శ్రీనివాస్, వల్లపు రాజు, పున్నసది, ముప్పిడి రాజిరెడ్డి, మామిడి తిరుపతి, మెరుగు వెంకటయ్య, దుద్దెడ తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

నర్సంపేటలో కనుల పండువగా పంబా ఆరాట్టు

- పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి దంపతులు

ప్రతిపక్షం, నర్సంపేట, డిసెంబర్ 9: నర్సంపేట పట్టణంలో శ్రీ ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి వారి పంబా ఆరాట్టు మహోత్సవం అత్యంత వైభవంగా, కన్నుల పండుగా నిర్వహించారు. అయ్యప్ప స్వామి వారి 25వ (పంచవింశతి) మండల పూజ రజతోత్సవం సందర్భంగా మాదన్నపేట చెరువు పరిసరాలు భక్తిరసంతో మార్మోగాయి. వేలాదిగా తరలివచ్చిన భక్తులు కేరళ సంప్రదాయబద్ధ పూజలు, అష్టాభిషేకాలు, జల స్నానాలు, బోనాలు, కోలాటాలు, వాయిద్యాలతో జరిగిన ఊరేగింపును ఆనందంతో వీక్షించారు. శబరిమల మెల్ శాంతిగా వ్యవహరిస్తున్న బ్రహ్మశ్రీ శంకరన్ నంబూద్రి , ప్రత్యేక అభిషేక పూజ నిర్వహించగా, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ శాసనసభ్యులు పెద్ది సుదర్శన్ రెడ్డి దంపతులు హాజరై స్వామి వారిని దర్శించుకున్నారు. తరువాత మాదన్నపేట చెరువు వద్ద జరిగే పంబా ఆరాట్ మరియు మహా అన్నదాన కార్యక్రమాన్ని పెద్ది సుదర్శన్ రెడ్డి పర్యవేక్షించారు. గత 25 సంవత్సరాలుగా ఈ ప్రాంత రైతుబిడ్డగా, భక్తిగా, సేవకుడిగా ఈ మహోత్సవాన్ని నిరంతరంగా నిర్వహిస్తూ వస్తున్న ఆయన సేవలను వేలాది భక్తులు ప్రశంసించారు. ఈ సందర్భంగా మాట్లాడిన మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి అయ్యప్ప స్వామి అనుగ్రహంతో ఈ ప్రాంతానికి రెండు పంటలకు అవసరమైన గోదావరి జలాలు చేరాయని, ప్రజలందరూ సుభిక్షం, ఆయురారోగ్యాలతో ముందుకు సాగాలని స్వామి ఆశీస్సులు ఎల్లప్పుడూ కాపాడుతున్నాయని తెలిపారు. పంబా ఆరాట్ మొదటిసారి ప్రారంభమైన రోజుల పరిస్థితుల నుంచి ఇప్పటి వరకు ఈ ప్రాంతం ఎంతో అభివృద్ధిని సాధించిందని ఆయన పేర్కొన్నారు. విద్య, ఆరోగ్యం, వ్యవసాయం, గ్రామాల అభివృద్ధి, రవాణా రంగాల్లో దేవుడు ఇచ్చిన శక్తి మేరకు పనిచేయడం తన ధర్మమని, ఈ భూమికి, ఈ ప్రాంత ప్రజలకు సేవ చేసే అవకాశం దక్కడం తమ అదృష్టమని చెప్పారు. పాకాల, రంగయ్య చెరువు, మాదన్నపేట చెరువు వంటి కీలక నీటినిల్వలకు గోదావరి జలాలను తీసుకురావడం ప్రాంత ఆర్థికవ్యవస్థను బలోపేతం చేసిందని తెలిపారు. గత 23 సంవత్సరాలుగా పంబా ఆరాట్ మహోత్సవంలో మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించేభాగ్యాన్ని కల్పించిన దేవాలయ కమిటీ సభ్యులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. మాదన్నపేట కట్టపై అయ్యప్ప స్వామి వారి జల క్రీడలు, భక్తుల శరణఘోష, ఆధ్యాత్మిక వాతావరణం నర్సంపేట పట్టణాన్ని దేవాలయ క్షేత్రంలా మార్చింది. భక్తులు, సేవాదారులు, ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొని ఈ రజతోత్సవ మహోత్సవాన్ని జయప్రదంగా జరిగింది.

కాంగ్రెస్ లో చేరిన సర్పంచ్ అభ్యర్థి

ప్రతిపక్షం ప్రతినిధి, నిర్మల్ డిసెంబర్ 9: స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే ధ్యేయంగా ముందుకెళ్తున్నామని నిర్మల్ నియోజకవర్గ ఇన్చార్జ్ కూచాడి శ్రీహరి రావు అన్నారు. నిర్మల్ రూరల్ మండలం రానాపూర్ గ్రామానికి చెందిన బీజేపీ సర్పంచ్ అభ్యర్థి జీవన్ నాయక్ లు బీజేపీ కి రాజీనామా చేసి హస్తం పార్టీలో 50 మందితో మంగళవారం కాంగ్రెస్ పార్టీ నిర్మల్ నియోజకవర్గ బాధ్యులు శ్రీహరి రావు గారి సమక్షంలో మంగళవారం సాయంత్రం కాంగ్రెస్ పార్టీలో చేరారు. శ్రీహరి రావు గారు కండువాలు కప్పి శ్రీహరి రావు ఆహ్వానించారు. ఈ కార్యక్రమం లో నిర్మల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సోమ బీమ్ రెడ్డి, నాయకులు కొట్టే శేఖర్, తదితరులు ఉన్నారు.

నేటితో తొలివిడత ప్రచార గడువు ముగింపు

- ఆరు మండలాల్లో నిషేధాజ్ఞలు అమలు.. మద్యం దుకాణాలు మూసివేత

ప్రతిపక్షం, నిర్మల్,డిసెంబర్ 9: జిల్లాలో ఈనెల పదకొండవ తేదీన గురువారం జరగనున్న తొలి విడత గ్రామ పంచాయతీ ఎన్నికల సందర్భంగా, ఎన్నికల ప్రచారంపై అధికారులు కీలక ఆదేశాలు జారీ చేశారు. తొలి విడత ఎన్నికలు జరిగే ఆరు మండలాలు అయిన దస్తురాబాద్, ఖానాపూర్, పెంబి, కడెం, లక్ష్మణచందా, మామడల పరిధిలో నేటి సాయంత్రం ఐదు గంటల (17:00గం.లు) వరకు తప్పనిసరిగా అభ్యర్థులు తమ ప్రచారాన్ని ముగించాలని స్పష్టం చేశారు. గడువు ముగిసిన తర్వాత బహిరంగ ప్రచారానికి అనుమతి ఉండదు. నిషేధాజ్ఞల అమలు: ఎన్నికల సజావుగా నిర్వహణ కోసం ఇప్పటికే ఈ ఆరు మండలాల్లో నిషేధాజ్ఞలు ఈరోజు సాయంత్రం 5 గంటల నుండి (సెక్షన్ 163 BNSS) అమలులోకి వస్తాయి. ఐదుగురు లేదా అంతకంటే ఎక్కువ మంది గుమిగూడటం నిషేధం. మద్యం దుకాణాలు బంద్: ఈరోజు సాయంత్రం 5 గంటల నుంచి పోలింగ్ మరియు ఓట్ల లెక్కింపు ముగిసే వరకు ఈ ప్రాంతాలలో అన్ని మద్యం దుకాణాలను మూసివేయాలని అధికారులు ఆదేశించారు.కాగా మొదటి దశ గ్రామ పంచాయతీ ఎన్నికలను 11వ తేదీ, గురువారం ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహించబడుతుంది.

తెలంగాణ తల్లిని అవమానించిన రేవంత్ రెడ్డి

- రెడ్కో మాజీ చైర్మన్ వై. సతీష్ రెడ్డి

ప్రతిపక్షం ప్రతినిధి, ములుగు, డిసెంబర్9: తెలంగాణ అస్తిత్వాన్ని దెబ్బతీయడానికి రేవంత్ రెడ్డి కుటిల ప్రయత్నాలు చేస్తున్నారని రెడ్కో మాజీ చైర్మన్ వై. సతీష్ రెడ్డి మండిపడ్డారు. ములుగులో తెలంగాణ తల్లి విగ్రహానికి ముసుగు వేసిన ఘటనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ అస్తిత్వాన్ని దెబ్బతీసే కుట్రలను రేవంత్ రెడ్డి కొనసాగిస్తున్నారంటూ, బీఆర్ఎస్ నాయకులతో కలిసి ముసుగు తొలగించి పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ తల్లిని తెలంగాణ ప్రజలకు దూరం చేస్తున్నాడని అన్నారు. వచ్చీ రాగానే తెలంగాణ తల్లిని కాదని.. కొత్తగా కాంగ్రెస్ తల్లిని తీసుకొచ్చి తెలంగాణ ప్రజలపై రుద్దాడని అన్నారు. అసలు సిసలైన తెలంగాణ తల్లిని ప్రజలకు కనిపించకుండా చేస్తున్నాడని, అందులో భాగంగానే ములుగు జిల్లా గోవిందరావుపేటలో తెలంగాణ తల్లి విగ్రహానికి ముసుగు వేశారని అన్నారు. కేసీఆర్ దీక్షతోనే తెలంగాణ రాష్ట్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించిన రోజున.. తెలంగాణ తల్లి కనిపించకుండా కుట్రలు చేశారని ఆరోపించారు. తెలంగాణ అస్తిత్వాన్ని దెబ్బతీసేలా రేవంత్ రెడ్డి చేస్తున్న కుట్రలన్నింటినీ ప్రజలు గమనిస్తున్నారని, తప్పకుండా తగినరీతిలో బుద్ధి చెబుతారని అన్నారు. ఈ కార్యక్రమంలో ములుగు గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పోరిక గోవింద్ నాయక్ , మాజీ ఎంపీపీ శ్రీనివాస్ రెడ్డి, మండల అధ్యక్షుడు నర్సింహ నాయక్, స్థానిక బీఆర్ఎస్ నాయకులు, ఉద్యమకారులు పాల్గొన్నారు.

తెలంగాణ కోసం ప్రాణత్యాగానికి సిద్ధపడ్డ కేసీఆర్

- మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు బాల్క సుమన్

ప్రతిపక్షం ప్రతినిధి, మంచిర్యాల, డిసెంబర్9: తెలంగాణ స్వరాష్ట్ర సాధన కోసం తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు కేసీఆర్ ఆమరణ నిరహార దీక్ష చేపట్టడంతో పాటు విద్యార్థుల ఆత్మబలిదానాలు, ప్రజా పోరాటాలతో తెలంగాణ స్వరాష్ట్ర కల సాకారమైదని చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు బాల్క సుమన్ అన్నారు. మంగళవారం బీఆర్ఎస్ పార్టీ విజయదివస్ కార్యక్రమంలో భాగంగా పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ మార్కెట్ సెంటర్ నుంచి కోల్ బెల్ట్ మీదుగా అంబేద్కర్ విగ్రహం వరకు సాగింది. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ వ్యాప్తంగా ప్రజలందరూ విజయ్ దివస్‌ను ఘనంగా నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనకు, రెండేళ్ల ప్రజాపాలనను గమనిస్తున్నారని తెలిపారు. పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థులను ఓడించి బీఆర్ఎస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

- గ్రామపంచాయతీ ఎన్నికల జిల్లా పరిశీలకులు శివకుమార్ నాయుడు

ప్రతిపక్షం, హనుమకొండ, డిసెంబర్ 9: గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని ఎన్నికల పరిశీలకులు శివకుమార్ నాయుడు అన్నారు. మంగళవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో మొదటి విడత మండలాల్లో మూడో ర్యాండమైజేషన్ పూర్తి చేసిన అనంతరం కలెక్టర్ స్నేహ శబరీష్, అధికారులతో కలసి ఎన్నికల పరిశీలకులు సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ స్నేహ శబరిష్ మాట్లాడుతూ ఈనెల 11న మొదటి విడత గ్రామపంచాయతీ ఎన్నికల నిర్వహించే భీమదేవరపల్లి, ఎల్కతుర్తి, కమలాపూర్ మండలాల్లో పోలింగ్ కేంద్రాలలో ఏర్పాట్లను పూర్తి చేశామని తెలిపారు. ఎన్నికల సిబ్బంది ర్యాండమైజేషన్ పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. పోలింగ్ కేంద్రాలలో ఏర్పాట్లను ఆర్వోలు వెళ్లి పర్యవేక్షించాలని ఆదేశించారు. ఎన్నికల నిర్వహణకు బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పేపర్లు, ఇతర పోలింగ్ సామగ్రిని ఇప్పటికే ఆయా మండల కేంద్రాలకు తరలించినట్లు తెలిపారు. పోలింగ్ రోజున ఈ మూడు మండలాలకు సెలవు దినంగా ప్రకటించినట్లు పేర్కొన్నారు. బ్యాలెట్ పేపర్ తనిఖీ చేయాలని ఎంపీడీవోలు, స్పెషల్ ఆఫీసర్లకు ఆదేశించినట్లు తెలిపారు. అనంతరం జిల్లా ఎన్నికల పరిశీలకులు శివకుమార్ నాయుడు మాట్లాడుతూ సర్పంచ్, వార్డు స్థానాలకు సంబంధించి ప్రతి వార్డు బ్యాలెట్ పేపర్ ను తనిఖీ చేయాలని సూచించారు. బ్యాలెట్ పేపర్లు సరిగా ఉన్నాయా లేదా అని చెక్ చేసుకోవాలని అన్నారు. ఎన్నికల సామగ్రి, సిబ్బంది తరలింపునకు సరిపోను ఏర్పాటు చేసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాలలో ఎన్నికల సంఘం నిబంధనల మేరకు పటిష్ట ఏర్పాట్లను చేయాలన్నారు. పోలింగ్ రోజున పోలింగ్ సమయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండ చర్యలు చేపట్టాలని, పోలింగ్ అనంతరం కౌంటింగ్ జాగ్రత్తగా నిర్వహించాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్చార్జి అదనపు కలెక్టర్ వై.వి. గణేష్, జిల్లా పంచాయతీ అధికారి లక్ష్మీ రమాకాంత్, డిఆర్డిఓ మేన శ్రీను, జడ్పీ సీఈవో రవి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

దేశీయ, విదేశీ పెట్టుబడులను ఆకర్షించేలా ప్రపంచస్థాయి నగరంగా 'భారత్ ఫ్యూచర్ సిటీ'ని అభివృద్ధి చేయనున్నాం. 13,500 ఎకరాల్లో జీరో కార్బన్ సిటీగా దీన్ని రూపొందిస్తాం. ఇక్కడి సంస్థల ద్వారా 13L మందికి ఉద్యోగాలు వస్తాయి. 9 లక్షల జనాభాకు వీలుగా గృహ నిర్మాణం జరుగుతుంది. డేటా సెంటర్లకు 400 ఎకరాలిస్తాం. అద్భుత ఆర్కిటెక్చర్, అర్బన్ ఫారెస్టులూ ఉంటాయి.

- మంత్రి శ్రీధర్ బాబు

ఓట్ చోరీపై కేంద్రాన్ని నిలదీసిన రాహుల్

ప్రతిపక్షం నేషనల్‌బ్యూరో, న్యూఢిల్లీ, డిసెంబర్ 9: కేంద్ర ప్రభుత్వంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ లోక్‌సభ లో తీవ్ర వ్యాఖ్యలు చేశారు. దేశంలోని ప్రజాస్వామ్యాన్ని నాశనం చేసేందుకే బీజేపీ సర్కారు ఎన్నికల కమిషన్‌ను వాడుకుంటోందని విమర్శించారు. ఎన్నికల సంస్కరణలపై ఇవాళ లోక్‌సభలో జరిగిన చర్చలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సీఈసీని కాపాడేందుకు ఏకంగా చట్టాలనే మార్చేశారని రాహుల్‌గాంధీ ఆగ్రహం వ్యక్తంచేశారు. పథకం ప్రకారమే తప్పు చేసినా శిక్ష అనుభవించకుండా తప్పించుకునే అవకాశాన్ని ఈసీకి కల్పించారని ఆరోపించారు. ఓట్ల చోరీకి సంబంధించి తమవద్ద అనేక ఆధారాలు ఉన్నట్లు తెలిపారు. ఎన్నికల సంస్కరణలపై కేంద్రానికి మూడు ప్రశ్నలు వేశారు.అందులో మొదటి ప్రశ్న.. ఎన్నికల సంఘం స్వయంప్రతిపత్తి ఎందుకు బలహీనపడుతోంది..? దాని స్వతంత్రతను నిర్ధారించే యంత్రాంగాలను ప్రభుత్వం పునరుద్ధరిస్తుందా..? రెండో ప్రశ్న.. ఎస్ఐఆర్ ప్రక్రియపై అనేక రాష్ట్రాల నుంచి ఫిర్యాదులు అందుతున్న వేళ ఓటర్ల జాబితాలను తారుమారు చేయకుండా నిరోధించడానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు..? మూడో ప్రశ్న.. ఈసీ నియామకాలు, నిర్ణయాలు రాజకీయ ప్రయోజనాలకు అనుగుణంగా ఎందుకు కనిపిస్తున్నాయి..? ఈ విషయంలో పారదర్శక సంస్కరణలు చేపట్టడానికి ప్రభుత్వం కట్టుబడి ఉంటుందా..? ఈ మూడు ప్రశ్నలకు ప్రభుత్వం సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. అదేవిధంగా అధికారిక బీజేపీకి అనుకూలంగా ఈసీ ఎన్నికల షెడ్యూల్ విడుదల చేస్తోందని రాహుల్‌గాంధీ ఆరోపించారు. పోలింగ్ తర్వాత 45 రోజులకు సీసీ ఫుటేజీ ధ్వంసం చేయాలనే నిబంధన ఎందుకు తీసుకువచ్చారని ప్రశ్నించారు. ఓట్ల చోరీకి సంబంధించిన ఆధారాలన్నీ ప్రజల ముందుకు తీసుకువచ్చినప్పటికీ వాటిపై ఈసీ తమకు సమాధానం ఇవ్వలేదని చెప్పారు. హర్యానా ఓటర్ల జాబితాలో బ్రెజిల్‌కు చెందిన మోడల్‌కు 23 ఓట్లు ఉన్న అంశాన్ని మళ్లీ గుర్తుచేశారు. మరోవైపు ఆర్ఎస్ఎస్ పైనా రాహుల్‌గాంధీ ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆర్ఎస్ఎస్ ఒక్కొక్కటిగా అన్ని వ్యవస్థలను కబ్జా చేస్తోందని విమర్శించారు. దేశంలోని వ్యవస్థలు అన్నిటిపైనా ఆర్ఎస్ఎస్ ఆధిపత్యం చూపిస్తోందని మండిపడ్డారు.

విశ్వ వీక్షణం

ఇండోనేషియాలో అగ్నిప్రమాదం

- 20 మంది మృతి

ఇండోనేషియాలో విషాదం చోటు చేసుకుంది. ఆ దేశ రాజధాని జకార్తాలో ఓ ఏడు అంతస్తుల భవనంలో అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో సుమారు 20 మంది సజీవ దహనమయ్యారు. అగ్నిమాపక సిబ్బంది సహాయక చర్యలు చేపట్టింది. అయితే.. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశమున్నట్టు తెలుస్తోంది. మంగళవారం మధ్యాహ్నం వేళ.. సెంట్రల్ జకర్తాలో ఈ ప్రమాదం జరిగింది. తొలుత.. మొదటి అంతస్తులో మంటలు చెలరేగగా.. ఆ వెంటనే పైఅంతస్తులకూ వ్యాపించాయి. ఉవ్వెత్తున ఎగిసిపడిన మంటలతో స్థానికులు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. వెంటనే అగ్నిమాపక అధికారులకు సమాచారం అందజేశారు. సహాయక బృందాలు రంగంలోకి దిగి.. తీవ్రంగా శ్రమించి మంటలను ఆర్పివేశారు. అప్పటికే 20 మంది మంటల్లో చిక్కుకుని మృతిచెందారు. వారిలో 15 మంది పురుషులు, ఐదుగురు మహిళలు ఉన్నారు. మరికొందరు గాయపడగా.. వారిని వెంటనే ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి గురైన భవనంలో టెర్రా డ్రోన్ అనే ఇండోనేషియా సంస్థ కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్టు అక్కడి అధికారి తెలిపారు. భవనంలో ఉన్నట్టుండి ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో.. కొందరు నిచ్చెనల ద్వారా భవనం పైకెక్కి సురక్షితంగా బయటపడ్డారు. ప్రస్తుతం.. వారు బిల్డింగ్ పై నిల్చుని సహాయం కోసం అభ్యర్థిస్తున్న దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. అయితే.. అగ్ని ప్రమదానికి గల కారణాలపై ఇంకా ఎలాంటి స్పష్టతా రాలేదు. మంటల్ని పూర్తిగా అదుపులోకి తెచ్చి, సహాయక చర్యలన్నీ ముగిశాకే స్పష్టమైన వివరాలు అందజేస్తామని అధికారులు పేర్కొన్నారు.

ఈ ఫ్రూట్స్ తింటే.. మీ గుండె పదిలం

మనిషి ఎక్కువ కాలం జీవించాలి అంటే.. గుండె ఆరోగ్యంగా ఉండటం కూడా చాలా ముఖ్యం. ఈ గుండె ఈరోగ్యంగా ఉండాలి అంటే.. శరీరంలో చెడు కొలిస్ట్రాల్ స్థాయిలను తగ్గిస్తూ, మన రక్త నాళాలను శుభ్రం చేసే ఆహారాలు తీసుకోవడం చాలా ముఖ్యం. మరి... అలాంటి ఫుడ్స్ ఏమున్నాయో ఓసారి చూద్దాం...

మనిషి జీవించాలి అంటే.. వారి గుండె పనితీరు సరిగా ఉండాలి. కానీ.. ఈ రోజుల్లో చిన్నా, పెద్ద అనే వయసు తేడా లేకుండా చాలా మంది గుండె సంబంధింత సమస్యలతో బాధపడుతున్నారు. బాధపడటమే కాదు.. హార్ట్ ఎటాక్ తో ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ గుండె సంబంధింత సమస్యలు రావడానికి కారణాలు చాలా ఉన్నాయి. అధిక రక్త పోటు, రక్తంలో కొలిస్ట్రాల్, డయాబెటిస్ లాంటివి కూడా కారణాలు కావచ్చు. ముఖ్యంగా గుండెకు రక్తాన్ని సరఫరా చేసే ధమనిలో చెడు కొలెస్ట్రాల్ పేరుకుపోయి రక్త ప్రసరణకు ఆటంకం కలిగిస్తుంది, ఇది గుండెపోటుకు ప్రధాన కారణం. ఈ విధంగా ధమనిలో చెడు కొలెస్ట్రాల్ పేరుకుపోవడానికి ప్రధాన కారణం అనారోగ్యకరమైన జీవనశైలి ,అనారోగ్యకరమైన ఆహారం తీసుకోవడం. ఈ విధంగా రక్త నాళాల్లో పేరుకుపోయే చెడు కొలెస్ట్రాల్‌ను కొన్ని పండ్లను తినడం ద్వారా సులభంగా తొలగించవచ్చు. అవును, ప్రతిరోజూ కొన్ని పండ్లను క్రమం తప్పకుండా తింటే, శరీరంలో చెడు కొలెస్ట్రాల్ స్థాయి క్రమంగా తగ్గడం ప్రారంభమవుతుంది. ఇది రక్త నాళాలను శుభ్రంగా ఉంచుతుంది. గుండెపోటు ప్రమాదాన్ని తగ్గించవచ్చు. హృదయాన్ని ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడే కొన్ని పండ్ల గురించి తెలుసుకుందాం.

ఆపిల్

ప్రతిరోజూ ఒక ఆపిల్ తినండి అని వైద్యులు చెబుతారు. అవును, ప్రతిరోజూ ఆపిల్ తినడం వల్ల హృదయం ఆరోగ్యంగా ఉంటుంది. ముఖ్యంగా శరీరంలో చెడు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడం ద్వారా గుండెపోటు ప్రమాదాన్ని తగ్గిస్తుంది. కాబట్టి గుండెపోటును నివారించడానికి ప్రతిరోజూ ఒక ఆపిల్ తినండి. పేరల: పేరల (జామపండు) కూడా ఆపిల్ లాగానే పోషకాలను కలిగి ఉంటుంది. ఇందులో ఉండే పోషకాలు హృదయానికి రక్తాన్ని సరఫరా చేసే ధమనిలో ప్లేక్ పేరుకుపోకుండా నిరోధిస్తాయి. కాబట్టి గుండెపోటు రాకుండా ఉండాలంటే ప్రతిరోజూ ఒక పేరల తినండి.

దానిమ్మ

దానిమ్మలో యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇది రక్తపోటును నియంత్రణలో ఉంచడమే కాకుండా హృదయ ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో కూడా కీలక పాత్ర పోషిస్తుంది. ఇది చెడు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంలో సహాయపడుతుంది. కాబట్టి ప్రతిరోజూ ఒక దానిమ్మ తింటే గుండె బలంగా ఉంటుంది. ప్రయత్నించి చూడండి.

నారింజ:

నారింజ ఒక రకమైన సిట్రస్ పండు. ఇది విటమిన్ సి , యాంటీఆక్సిడెంట్లను పుష్కలంగా కలిగి ఉంటుంది. ఇవి హృదయానికి రక్తాన్ని సరఫరా చేసే ధమనిలో ప్లేక్ పేరుకుపోకుండా నిరోధిస్తాయి. చెడు కొలెస్ట్రాల్ స్థాయిలను క్రమంగా తగ్గించడంలో సహాయపడతాయి. కాబట్టి వీలైనంత వరకు నారింజ పండ్లను కొని తినండి.

ద్రాక్ష

ద్రాక్షలో విటమిన్ సి , యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. క్రమం తప్పకుండా ద్రాక్ష తినడం వల్ల గుండెపోటు ప్రమాదాన్ని తగ్గించవచ్చు.

బెర్రీలు

స్ట్రాబెర్రీలు, బ్లూబెర్రీలు, రాస్ప్బెర్రీలు బెర్రీలు అనేక రకాలుగా వస్తాయి. ఇవి యాంటీఆక్సిడెంట్లను పుష్కలంగా కలిగి ఉంటాయి. ఇది ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది. రక్త నాళాల్లో ప్లేక్ పేరుకుపోకుండా నిరోధిస్తుంది. కాబట్టి అవకాశం ఉంటే, అప్పుడప్పుడు బెర్రీలను కొని తినండి.

బొప్పాయి

బొప్పాయి అన్ని కాలాల్లోనూ లభిస్తుంది. ఇది విటమిన్ సి , పపైన్‌ను కలిగి ఉంటుంది. ఇవి శరీరంలో చెడు కొలెస్ట్రాల్ స్థాయిలు పెరగకుండా నిరోధిస్తాయి. రక్త నాళాల్లో ప్లేక్ పేరుకుపోకుండా నిరోధిస్తాయి. కాబట్టి ఈ పండును క్రమం తప్పకుండా తినడం వల్ల గుండెపోటు ప్రమాదాన్ని తగ్గించవచ్చు. జాగ్రత్త: పైన పేర్కొన్న పండ్లలో దేనినైనా ఒకదాన్ని క్రమం తప్పకుండా తింటే మీకు గుండెపోటు రాదు!

పెరుగు తిని బరువు తగ్గొచ్చు!!

చాలామందికి పెరుగుతో తిననది.. భోజనం పూర్తైన అనుభూతి ఉండదు. కొందరు.. పెరుగు తినడాన్నిఎక్కువగా ఇష్టపడితే.. మరి కొందరు అసలు తినరు. కానీ... పెరుగు మన ఆరోగ్యానికి చాలా మేలు చేస్తుంది. దీనిలో... ప్రో బయోటిక్స్,కాల్షియం,ప్రోటీన్,విటమిన్లు,బి 2,బి 12, పొటాషియం, మెగ్నీషియం వంటి ఖనిజాలు సమృద్ధిగా ఉంటాయి. పెరుగు జీర్ణక్రియను మెరుగుపరచడానికి, ఎముకలను బలోపేతం చేయడానికి, పేగు ఆరోగ్యానికి తోడ్పడే సామర్థ్యం కూడా పెరుగులో ఉంటుంది. మరి.. ఇన్ని ప్రయోజనాలు ఉన్న ఈ పెరుగు తిని.. ఈజీగా బరువు కూడా తగ్గవచ్చని మీకు తెలుసా? అవును. పెరుగులో కేలరీలు తక్కువగా ఉంటాయట. ప్రోటీన్లు పుష్కలంగా ఉంటాయి. మరి.. ఈ పెరుగు తింటే కలిగే లాభాలు ఏంటి? ఎలా బరువు తగ్గుతారో ఇప్పుడు తెలుసుకుందాం...

అధిక ప్రోటీన్లతో కడుపు నిండుతుంది..

పెరుగు అధిక ప్రోటీన్లతో నిండి ఉంటుంది. బరువు తగ్గాలి అనుకునేవాళ్లు.. ప్రోటీన్ ని తీసుకోవాలి. ఆ ప్రోటీన్ పెరుగులో పుష్కలంగా ఉంటుంది. మనల్ని సంతృప్తిపరచడంలోనూ,ఆకలి తగ్గించడంలోనూ సహాయపడుతుంది. క్రమం తప్పకుండా తీసుకుంటే, పెరుగులోని ప్రోటీన్ మిమ్మల్ని ఎక్కువసేపు నిండుగా ఉంచుతుంది, ఇది మొత్తం కేలరీల తీసుకోవడం తగ్గించడంలో సహాయపడుతుంది. ఇతర ఆహారాలు అతిగా తినే అలవాటును తగ్గిస్తుంది.

తక్కువ కేలరీలు

సాదా పెరుగులో సహజంగా కేలరీలు తక్కువగా ఉంటాయి, బరువు తగ్గించే ప్రయాణంలో ఉన్నవారికి ఇది ఆదర్శవంతమైన ఆహారం. మీ ఆహారంలో ఎక్కువ కేలరీలు జోడించకుండా , కంట్రోల్ చేయడానికి సహాయం చేస్తుంది. పెరుగును ఒక గొప్ప అల్పాహారం లేదా భోజనం భాగం చేస్తుంది.

బెల్లీ ఫ్యాట్ తగ్గిస్తుంది

పెరుగు, ముఖ్యంగా తక్కువ కొవ్వు పాలతో తయారు చేసినప్పుడు, పొట్ట కొవ్వును తగ్గించడంలో సహాయపడే కాల్షియం, ప్రోబయోటిక్స్ ఉంటాయి. కాల్షియం శరీరాన్ని ఎక్కువ కొవ్వును కాల్చడానికి ప్రోత్సహిస్తుంది, ముఖ్యంగా పొత్తికడుపు ప్రాంతంలో, ప్రోబయోటిక్స్ జీర్ణక్రియను మెరుగుపరుస్తాయి, ఇది కడుపు ఉబ్బరాన్ని తగ్గిస్తుంది.

జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది

పెరుగు ప్రోబయోటిక్స్, లేదా "మంచి బ్యాక్టీరియా," ఆరోగ్యకరమైన గట్ ఫ్లోరాను ప్రోత్సహించడం ద్వారా జీర్ణక్రియకు సహాయపడుతుంది. సరైన జీర్ణక్రియ శరీరాన్ని సమర్ధవంతంగా ప్రాసెస్ చేస్తుంది. పోషకాలను గ్రహిస్తుంది, ఉబ్బరం తగ్గిస్తుంది. సాధారణ ప్రేగు కదలికలను నిర్వహిస్తుంది, ఇవి బరువు తగ్గడంలో కీలక కారకాలు.

రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రిస్తుంది

పెరుగు తీసుకోవడం కార్బోహైడ్రేట్ల శోషణను మందగించడం ద్వారా రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుంది. ఇది ఇన్సులిన్ స్పైక్‌లను నిరోధించడంలో సహాయపడుతుంది, ఇది కొవ్వు నిల్వకు దారితీస్తుంది. స్థిరమైన రక్తంలో చక్కెర స్థాయిలు కూడా చక్కెర కోరికలను తగ్గిస్తాయి, మీ ఆహారాన్ని నియంత్రించడాన్ని సులభతరం చేస్తాయి.

కండర ద్రవ్యరాశిని పెంచుతుంది

పెరుగులో అవసరమైన అమైనో ఆమ్లాలు పుష్కలంగా ఉంటాయి, ఇవి కండరాల మరమ్మత్తు , పెరుగుదలకు తోడ్పడతాయి. కండర ద్రవ్యరాశిని పెంచడం జీవక్రియను పెంచుతుంది, ఎందుకంటే కండరాలు విశ్రాంతి సమయంలో కూడా కొవ్వు కంటే ఎక్కువ కేలరీలను బర్న్ చేస్తాయి. ఇది బరువు తగ్గడానికి సహాయం చేస్తుంది.

సాధారణ స్థితికి విమాన సేవలు

- ప్రకటించిన ఇండిగో సంస్థ
- క్షమాపణలు చెబుతూ వీడియో విడుదల చేసిన సీఈవో ఎల్బర్స్

ప్రతిపక్షం నేషనల్‌బ్యూరో, న్యూఢిల్లీ, డిసెంబర్ 9: సంక్షోభంపై ఇండిగో సంస్థ మంగళవారం కీలక ప్రకటన చేసింది. విమాన సేవలు సాధారణ స్థితికి చేరుకుంటున్నాయని ఇండిగో ఎయిర్‌లైన్స్ ప్రకటించింది. విమానాలను సర్దుబాటు చేశామని, వెబ్‌సైట్ లో పబ్లిష్ చేసిన షెడ్యూల్ ప్రకారం.. విమానాలన్నీ క్రమం తప్పకుండా నడుస్తాయని కంపెనీ తెలిపింది. విమానాశ్రయాల్లో చిక్కుకుపోయిన ప్రయాణికుల లగేజీని వారికి అప్పగించామని.. మిగతా లగేజీని డెలివరీ చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని చెప్పింది. మంగళవారం కంపెనీ 1800 విమానాలను నడుపుతుందని ఇండిగో తెలిపింది. బుధవారం నుంచి 1900 విమానాలను నడిపేందుకు ప్లాన్ చేసింది. ఆన్ టైమ్ పనితీరు సైతం సాధారణ స్థితికి చేరుకుందని ఇండిగో పేర్కొంది. ప్రయాణికుల కోసం పూర్తి రీఫండ్ ప్రక్రియను ఎయిర్‌లైన్ ఆటోమేటెడ్ విధానంలోకి మార్చింది. కంపెనీ వెబ్‌సైట్‌లో ఒక సాధారణ ప్రక్రియ ద్వారా పూర్తి చేయవచ్చని తెలిపింది. ప్రయాణికులు తప్పనిసరిగా ఎయిర్‌పోర్ట్‌కు బయలుదేరే ముందుగా వెబ్‌సైట్ లో విమానం లెటెస్ట్ అప్‌డేట్‌ను తనిఖీ చేయాలని ఇండిగో విజ్ఞప్తి చేసింది. ప్రయాణికులకు కలిగిన అసౌకర్యంపై కంపెనీ విచారం వ్యక్తం చేసింది. ఇండిగో సీఈవో పీటర్ ఎల్బర్స్ వీడియోను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షోభం తర్వాత విమానయాన సంస్థ మళ్లీ తన కాళ్లపై నిలబడిందని తెలిపారు.

ఇండిగోపై కేంద్రం కొరడా.. 10 శాతం విమానాలు తగ్గించాలని ఆదేశం

ఇండిగో ఎయిర్‌లైన్స్‌పై పౌర విమానయాన మంత్రిత్వశాఖ కొరడా ఝుళిపించింది. కంపెనీ ప్రస్తుతం నడుపుతున్న విమానాల్లో 10శాతం తగ్గించాలని ఆదేశాలు జారీ చేసింది. క్రూ రోస్టర్ ఇంటర్నల్ మిస్‌మేనేజ్‌మెంట్‌లో, విమానాల షెడ్యూల్, కమ్యూనికేషన్స్‌లో లోపాల నేపథ్యంలో వారానికిపైగా ప్రయాణికులు తీవ్రంగా అసౌకర్యానికి గురయ్యారు. ఈ క్రమంలో పౌర విమానయాన మంత్రిత్వశాఖ కఠిన నిర్ణయం తీసుకుంది. ఎయిర్‌లైన్ కార్యకలాపాలు స్థిరీకరించడం, విమానాల రద్దును నివారించేందుకు కోతలు విధించడం అవసరమని మంత్రిత్వశాఖ భావిస్తున్నది. అయితే, ఈ తగ్గింపు ఉన్నప్పటికీ.. ఇండిగో ప్రస్తుతం అన్ని గమ్యస్థానాలకు విమానాలను నడుపుతూనే ఉంటుంది. ఇండిగో సీఈవో పీటర్ ఎల్బర్స్‌ను మంగళవారం విమానయాన మంత్రిత్వ శాఖ కార్యాలయానికి పిలిపించారు. పరిస్థితిని స్థిరీకరించేందుకు తీసుకుంటున్న చర్యలపై ఆయన అప్‌డేట్స్‌ను అందించారు.

భారత్‌తో బలమైన బంధం

- చైనాకు చెక్ పెట్టేందుకు ట్రంప్‌వ్యూహం

ప్రతిపక్షం నేషనల్ బ్యూరో, న్యూఢిల్లీ, డిసెంబర్ 9: డొనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్షుడు అయినప్పటి నుంచి భారత్‌పై అక్కసు వెళ్లగక్కుతున్నారు. అమెరికా, భారత్ సంబంధాలను క్షీణింపజేశారు. భారత్‌పై భారీగా సుంకాలు విధించడం, హెచ్1బీ వీసా నిబంధనలను కఠినతరం చేయడం వంటి చర్యలతో ఇరు దేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. అయితే అమెరికా కాంగ్రెస్ నాయకులు మాత్రం భారత్‌తో బలమైన బంధాలను కోరుకుంటున్నారు. తాజాగా అమెరికా కాంగ్రెస్ నాయకులు 'నేషనల్ డిఫెన్స్ ఆథరైజేషన్ యాక్ట్' పేరుతో వార్షిక రక్షణ బిల్లును విడుదల చేశారు. ఇండోపసిఫిక్ ప్రాంతంలో స్వేచ్ఛాయుత పరిస్థితులు నెలకొనేలా చూసేందుకు, చైనా నుంచి ఎదురవుతున్న సవాళ్లను ఎదుర్కొనేందుకు భారత్‌తో స్నేహాన్ని బలోపేతం చేసుకోవడం అత్యవసరమని అమెరికా వార్షిక రక్షణ బిల్లులో అమెరికా ప్రభుత్వం పేర్కొంది. చైనాతో సాగిస్తున్న వ్యూహాత్మక పోటీలో అమెరికా ఆధిపత్యం కొనసాగేలా చూడాలని, అందుకోసం విదేశాంగ మంత్రితో సమన్వయం చేసుకోవాలని రక్షణ బిల్లు సూచించింది. భారత్, అమెరికా దేశాల మధ్య 2008లో కుదిరిన పౌర అణు ఒప్పంద పురోగతిని సమీక్షించాలని, యూఎస్ఇండియా స్ట్రాటజిక్ సెక్యూరిటీ డైలాగ్ వంటి సంప్రదింపుల వ్యవస్థను ఏర్పాటు చేయాలని తాజా బిల్లు పేర్కొంది. అమెరికా, ఆస్ట్రేలియా, భారత్, జపాన్‌తో కూడిన క్వాడ్ కూటమి ద్వారా ముందడుగు వేయాలని, ద్వైపాక్షిక, బహుళ సైనిక విన్యాసాలు చేపట్టాలని, రక్షణ వాణిజ్యాన్ని పెంపొందించాలని, మానవతా సహాయం, విపత్తు ప్రతిస్పందనలో సహకారాన్ని విస్తరించుకోవాలని సూచించింది.



వాళ్లిద్దరూ ఇంకా ఏం నిరూపించుకోవాలి?

టీమిండియా స్టార్ ప్లేయర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ ఇప్పటికే టెస్ట్, టీ20 ఫార్మాట్ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన విషయం తెలిసిందే. కేవలం వన్డేల్లో మాత్రమే కొనసాగుతున్న వీరిద్దరూ.. అద్భుతమైన ఫామ్‌లో ఉన్నారు. ఇటీవల ఆస్ట్రేలియా, సౌతాఫ్రికాతో జరిగిన సిరీస్‌లో అదరగొట్టి తాము 2027 ప్రపంచ కప్ ఆడటానికి సిద్ధంగా ఉన్నామని హింట్ ఇచ్చేశారు. అయితే ప్రపంచ కప్‌లో తుది జట్టులో వీరికి చోటు కల్పిస్తామని టీమిండియా మేనేజ్‌మెంట్ నుంచి ఎలాంటి స్పష్టత రాలేదు. ఈ నేపథ్యంలో భారత మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్.. రోకోపై ప్రశంసలు కురిపించాడు. 'రోహిత్ తన ఫిట్‌నెస్‌పై దృష్టి పెట్టి మళ్లీ అద్భుతంగా కమ్ బ్యాక్ ఇచ్చాడు. విరాట్ కోహ్లీ కూడా మునపటిలా చెలరేగి బ్యాటింగ్ చేస్తున్నాడు. వారు ఎంత కష్టపడ్డారనే దానికి ఇదే నిదర్శనం. రోకో నిరూపించుకోవాల్సి ఉందనేది హాస్యాస్పదమైన విషయం. వారు ఇంకా ఏం నిరూపించుకోవాలి? సుదీర్ఘ కెరీర్‌లో ఏ ఆటగాడికైనా ఎత్తుపల్లాలుంటాయి. కానీ, రోహిత్, కోహ్లీ ఎవ్వరికీ ఏమీ నిరూపించుకోవాల్సిన అవసరం లేదు. వీరి కమ్ బ్యాక్ రాబోయే తరం ఆటగాళ్లందరికీ ఒక ఉదాహరణగా నిలుస్తుంది. సుదీర్ఘమైన కెరీర్‌లను కలిగి ఉండాలంటే ఎన్నో త్యాగాలు చేయాలి. ఆట పట్ల నిబద్ధత ప్రదర్శించాలి. ఆటే అందరి కంటే ముఖ్యమైనది' అని అశ్విన్ తెలిపాడు.

ఆదరగొట్టిన పాండ్యా, అర్ష్‌దీప్
టీమిండియా విజయం

వన్డే సిరీస్ విజయోత్సాహాన్ని టీ20లోనూ కొనసాగిస్తూ ఘనంగా బోణీ కొట్టింది భారత్. బరాబతి స్టేడియంలో దక్షిణాఫ్రికాను 101 పరుగుల తేడాతో చిత్తుచిత్తుగా ఓడించింది. హార్దిక్ పాండ్యా(59 నాటౌట్, 1/16) ఆల్‌రౌండ్ షోకు.. అక్షర్ పటేల్(23, 2/7) మెరుపులు తోడవ్వగా సఫారీ టీమ్ 74కే ఆలౌటయ్యింది. పొట్టి క్రికెట్‌లో ప్రొటీస్‌కు ఇదే అత్యల్ప స్కోర్ కావడం విశేషం. టీ20ల్లో తమకు తిరుగులేదని నిరూపించిన సూర్యకుమార్ బృందం ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో 1-0తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. టీ20 ప్రపంచకప్ ఛాంపియన్ భారత జట్టు జోరు కొనసాగుతోంది. ఇటీవలే ఆస్ట్రేలియా గడ్డపై సిరీస్ గెలుపొందిన సూర్యకుమార్ సేన.. స్వదేశంలోనూ వేట మొదలెట్టింది. మంగళవారం బరాబతి స్టేడియంలో దక్షిణాఫ్రికాను బెంబేలెత్తించిన టీమిండియా 101 పరుగుల తేడాతో జయకేతనం ఎగురవేసింది. ఆల్‌రౌండ్ షోతో అదరగొట్టిన భారత్.. 12.3 ఓవర్లలోనే మ్యాచ్ ముగించి సిరీస్‌లో ముందంజ వేసింది. కటక్ బరాబతి స్టేడియంలో భారీ స్కోర్ చేసిన భారత జట్టు.. ప్రత్యర్థిని వణికించింది. తొలి ఓవర్లోనే వికెట్ తీసిన పేసర్ అర్ష్‌దీప్ సింగ్(2/14).. తన రెండో ఓవర్లోనూ వికెట్ అందించాడు. ఫామ్‌లో ఉన్న క్వింటన్ డికాక్(0)ను డకౌట్ చేశాడు అర్ష్‌దీప్ చక్రవర్తి ఓవర్లో 4,6 బాదిన బ్రెవిస్ స్కోర్ 40 దాటించాడు. అయితే.. ఆరో ఓవర్లో తొలి బంతికే మర్‌క్రమ్ లెగ్ స్టంప్‌ను ఎగరేశాడు అక్షర్ పటేల్. అంతే.. 40కే మూడు వికెట్లు పడ్డాయి. పవర్ ప్లేలో 3 వికెట్ల నష్టానికి సఫారీ టీమ్ 45 రన్స్ చేసింది. పాండ్యా మొదటి బంతికే డెవిడ్ మిల్లర్(1)ను.. డేంజరస్ డొనోవాన్ ఫెరీరా(5)ను వరుణ్ ఔట్ చేయగా 50కే ఐదు వికెట్లు కోల్పోయింది. తన ఓవరలో సిక్సర్ బాదిన మార్కో యాన్సెన్‌ను వరుణ్ బౌల్డ్ చేయగా మ్యాచ్ పూర్తిగా టీమిండియా చేతుల్లోకి వచ్చింది. బుమ్రా ఓవర్లో బ్రెవిస్ మిడాన్‌లో సూర్యకు దొరికిపోగా.. సఫారీల ఓటమి ఖాయమైంది. చివరి బ్యాటర్ మహరాజ్‌ను దూబే ఔట్ చేయగా సఫారీ టీమ్ 74కే కుప్పకూలింది. పునరాగమనం మ్యాచ్‌లో హార్దిక్ పాండ్యా(59 నాటౌట్) రెచ్చిపోయాడు. ఇటీవలే స్మాట్‌లో మెరుపులు మెరిపించిన పాండ్యా.. తొలి టీ20లో దక్షిణాఫ్రికాపైనే చెలరేగాడు. క్రీజులోకి వచ్చీరాగానే ఈ ఆల్‌రౌండర్ ఫోర్లు, సిక్సర్లు బాదేయగా టీమిండియా భారీస్కోర్ చేసింది. పవర్ ప్లేలో లుంగి ఎంగిడి(3/31) విజృంభణతో కష్టాల్లో పడిన జట్టును ఓపెనర్ అభిషేక్ శర్మ(17), తిలక్ వర్మ(26)లు ఆదుకున్నారు. వీరిద్దరి తర్వాత అక్షర్ పటేల్(23) జతగా పాండ్యా చితక్కొట్టాడు. చివరి ఓవర్లో 12 రన్స్ పిండుకోవడంతో ప్రత్యర్థికి 176 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది టీమిండియా.



పూరీ జగన్నాథుడిని దర్శించుకున్న టీమిండియా

కటక్ వేదికగా దక్షిణాఫ్రికాతో టీమిండియా తొలి టీ20 మ్యాచ్ ఆడనున్నది. ఈ మ్యాచ్‌కు ముందు ఒడిశాలోని ప్రముఖ జగన్నాథ్ ఆలయానికి భారత జట్టు సందర్శించింది. ఈ సందర్భంగా మంగళవారం ఉదయం జగన్నాథుడిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసింది. ఆటగాళ్లతో పాటు టీమిండియా హెడ్‌కోచ్ గౌతమ్ గంభీర్ సైతం ఉన్నాడు. భారత టీ20 జట్టు కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, భార్య దేవిషా శెట్టితో కలిసి ఆలయానికి చేరుకున్నాడు. తిలక్ వర్మ, హార్దిక్ పాండ్యా, శుభ్‌మాన్ గిల్ సహా పలువురు ప్లేయర్స్ ఉన్నారు. పటిష్టమైన భద్రతా ఏర్పాట్ల మధ్య ప్లేయర్లు ఆలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ సేవాయత్‌ల సింహద్వారల వద్ద దీపాలువ వెలిగించి.. దక్షిణాఫ్రికాపై టీ20 సిరీస్‌లో భారత జట్టు విజయం సాధించాలని పూజలు చేశారు. ఈ చాలా రోజుల తర్వాత ఒడిశాలో అంతర్జాతీయ మ్యాచ్ జరుగుతుండడం ఉత్సాహంగా ఉందని.. భారత ప్లేయర్లు అత్యుత్తమంగా రాణించి భారత్‌కు విజయం సాధించి పెట్టాలని ప్రార్థిస్తున్నట్లు ఓ పూజారి తెలిపారు.

పీసీబీ ఛైర్మన్‌కు అవమానం

- కారును తనిఖీ చేసిన బ్రిటీష్ పోలీసులు

పాకిస్తాన్ క్రికెట్ బోర్డు, హోంశాఖ మంత్రి మొహ్సిన్ నఖ్వీకి లండన్‌లో ఘోర అవమానం జరిగింది. బ్రిటీష్ పోలీసులు ఆయన కారును ఆపి సోదాలు చేశారు. ఇందుకు సంబంధించిన వీడియో నెట్టింట వైరల్‌గా మారింది. ఈ ఘటన పాకిస్తాన్‌కు అంతర్జాతీయంగా ఉన్న ఖ్యాతికి అద్దం పడుతున్నది. షాజాద్ అక్బర్, ఆదిల్ రాజా అప్పగింత అంశంపై చర్చించేందుకు నఖ్వీ బ్రిటన్ పర్యటనకు వెళ్లినట్లుగా సమాచారం. అయితే, లండన్ పోలీసులు ఆయన కారును తనిఖీ చేయడంపై ఎవరూ స్పందించలేదు. సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వీడియో ప్రకారం.. నఖ్వీ కారును పోలీసులు అడ్డుకొని సోదాలు చేస్తున్నట్లుగా కనిపించింది. పోలీసులు తనిఖీ చేసిన బట్టి తీరును చూస్తే సాధారణ తనిఖీల్లో భాగంగా జరిగినట్లు అనిపించడం లేదు. పీసీబీ ఛైర్మన్ అధికారులను కలిసేందుకు బ్రిటిష్ విదేశాంగ కార్యాలయానికి వచ్చిన సమయంలో కారును ఆపి సోదాలు చేశారు. నఖ్వీ ఆసియా క్రికెట్ కౌన్సిల్ ఛైర్మన్‌గా కొనసాగుతున్న విషయం తెలిసిందే. యూఏఈ వేదికగా జరిగిన ఆసియా కప్ టోర్నీలో భారత జట్టు విజయం సాధించిన విషయం తెలిసిందే. అయితే, ట్రోఫీ భారత్‌కు నఖ్వీ ట్రోఫీ అందించలేదు. పాకిస్తాన్‌ను ఓడించి భారత్ ఆసియా కప్‌ను నెగ్గింది. కానీ, సూర్యకుమార్ యాదవ్ నేతృత్వంలోని టీమిండియా ట్రోఫీని నఖ్వీ నుంచి తీసుకునేందుకు నిరాకరించింది. ఆ తర్వాత టీమిండియా ప్లేయర్లు ట్రోఫీ లేకుండానే సంబరాల్లో పాల్గొన్నారు. ట్రోఫీ లేకుండానే జట్టు భారత్‌కు చేరుకుంది. ఆయన ట్రోఫీని పట్టుకొని హోటల్‌కు వెళ్లిపోయారు. ప్రస్తుతం, ట్రోఫీ ఏసీసీ కార్యాలయంలో ఉంది. భారత క్రికెట్ నియంత్రణ మండలి (BCCI) ఇటీవల నఖ్వీకి ట్రోఫీని అందజేయాలని ఈ మెయిల్ పంపింది. అయితే, గెలిచిన జట్టుకు తాను మాత్రమే స్వయంగా అందజేస్తానని నఖ్వీ పట్టుదలతో ఉన్నట్లుగా తెలుస్తున్నది.

షూటింగ్‌లో రాజశేఖర్‌కు గాయాలు

యాంగ్రీ స్టార్ రాజశేఖర్ కొంత విరామం తర్వాత వరుస సినిమాలకు సంతకాలు చేశారు. ఓ వైపు కథానాయకుడిగా నటిస్తూ, మరో వైపు ప్రధాన పాత్రలు చేస్తున్నారు. నవంబర్ 25న కొత్త సినిమా చిత్రీకరణలో ఆయనకు గాయాలు అయ్యాయి. మేడ్చల్ సమీపంలో యాక్షన్ సీక్వెన్స్ షూటింగ్ చేస్తుండగా కాలికి గాయాలు అయ్యాయి. యూనిట్ సన్నిహిత వర్గాల నుంచి అందిన సమాచారం ప్రకారం... రాజశేఖర్ కుడి కాలికి బలమైన గాయాలు అయ్యాయి. మడమ దగ్గర పెద్ద ఇంజ్యూరీ అయినట్టు తెలిసింది. గాయమైన వెంటనే హుటాహుటిన యూనిట్ సభ్యులు ఆస్పత్రికి తీసుకు వెళ్లారు. వైద్యులు వెంటనే సర్జరీ చేశారు. సుమారు మూడు గంటల పాటు సర్జరీ జరిగింది. బలమైన గాయం కావడంతో బోన్ బయటకు వచ్చిందని, అందువల్ల సర్జరీకి మూడు గంటలు పట్టిందని సమాచారం. సర్జరీలో భాగంగా రాజశేఖర్ కాలిలో ప్లేట్స్ & వైర్ అమర్చారు. దీని వల్ల త్వరగా రికవరీ అవుతారని ఆస్పత్రి వర్గాలు తెలిపాయి. నొప్పి భరిస్తూ రాజశేఖర్ సర్జరీ చేయించుకున్నారని, ఆపరేషన్ సక్సెస్ అయ్యిందని యూనిట్ వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం ఆయన రికవరీ అవుతున్నారు. సర్జరీ తర్వాత మూడు నుంచి నాలుగు వారాల పాటు తప్పనిసరిగా విశ్రాంతి తీసుకోవాలని రాజశేఖర్‌కు వైద్యులు తెలిపారు. ముఖ్యంగా గాయమైన కాలిని ఎట్టిపరిస్థితుల్లోనూ కదపకూడదని చెప్పారు. అందువల్ల కొన్ని రోజుల పాటు ఆయన చిత్రీకరణలకు దూరంగా ఉంటారు. జనవరి 2026లో మళ్ళీ షూటింగ్ ప్రారంభించవచ్చు. రాజశేఖర్ కు ఈ విధంగా గాయాలు కావడం మొదటిసారి కాదు. నవంబర్ 15, 1989లో 'మగాడు' షూటింగ్ చేస్తున్న సమయంలోనూ ఆయనకు గాయమైంది. అప్పుడు ఎడమ కాలికి గాయమైతే, ఇప్పుడు కుడి కాలికి గాయమైంది. ఇప్పుడు 35 ఏళ్ళ తర్వాత నవంబర్ నెలలో మళ్ళీ ఆయనకు గాయమైంది.

'నారి నారి నడుమ మురారి'
సంక్రాంత్రికి ముహూర్తం ఖరారు

చార్మింగ్ స్టార్ శర్వా ఫీల్‌గుడ్ ఫ్యామిలీ ఎంటర్టైనర్ 'నారి నారి నడుమ మురారి' తో ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమవుతున్నారు. సామజవరగమనతో బ్లాక్ బస్టర్ డెబ్యూ చేసిన రామ్ అబ్బరాజు దర్శకత్వం వహించిన ఈ చిత్రం హోల్సమ్ ఫ్యామిలీ ఎంటర్టైనర్ గా ఉండబోతోంది. ఇది ఫెస్టివల్ కి పర్ఫెక్ట్ మూవీ. అడ్వెంచర్స్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్ సహకారంతో ఎకె ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్‌పై రామబ్రహ్మం సుంకర నిర్మించిన ఈ చిత్రంలో సంయుక్త, సాక్షి వైద్య కథానాయికలుగా నటించారు. ఇప్పటివరకు విడుదలైన ప్రతి ప్రమోషనల్ మెటీరియల్ ప్రేక్షకులలో బజ్ క్రియేట్ చేసింది. ఇప్పుడు రిలీజ్ గురించి మేకర్స్ ఎక్సయిటింగ్ అప్‌డేట్ ఇచ్చారు. నారి నారి నడుమ మురారి ఈ సంక్రాంతికి జనవరి 14న విడుదల కానుంది. ప్రీమియర్ షో సమయం సాయంత్రం 5:49 అని మేకర్స్ ఇప్పుడు ప్రకటించారు. సాధారణంగా సినిమాలు ఉదయం లేదా తెల్లవారుజామున షోలతో ప్రారంభమవుతాయి, కానీ మొదటిసారిగా, ఈ సినిమా సాయంత్రం రిలీజ్ ని ఎంచుకుంటోంది. ముహూర్తం ఇంత త్వరగా ఖరారు కావడం టీమ్ ఖచ్చితమైన ప్లానింగ్ ని తెలియజేస్తోంది. శర్వా గత సంక్రాంతి బ్లాక్‌బస్టర్‌లు శతమానం భవతి, ఎక్స్‌ప్రెస్ రాజా కూడా జనవరి 14న విడుదలయ్యాయి. సెలవుల సీజన్‌లో తీవ్రమైన పోటీ ఉన్నందున ఈ పండుగ సందర్భంగా రిలీజ్ కాస్త ఆలస్యంగా రావడం సినిమాకు బెనిఫిట్ కానుంది. అనౌన్స్‌మెంట్ పోస్టర్‌లో శర్వా స్టైలిష్‌గా కనిపిస్తూ, కన్ఫ్యూజ్‌డ్ ఎక్స్‌ప్రెషన్‌తో, మెడలో పూల హారంతో నిల్చున్నారు. సంయుక్త ఆవేదనతో నిండిన లుక్‌లో కనిపిస్తే, సాక్షి వైద్య స్వచ్ఛమైన చిరునవ్వుతో ఫ్రేమ్‌కి ఫ్రెష్‌నెస్ తీసుకొచ్చింది. బ్యాక్‌డ్రాప్‌లో పూలతో అలంకరించిన సంప్రదాయ సెటప్, పచ్చని చెట్ల ఆభరణం మొత్తం పోస్టర్‌కి పండుగ వాతావరణం, అదే సమయంలో ఒక హ్యూమరస్ టచ్ ఇచ్చాయి.

యష్ 'టాక్సిక్: ఎ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్ అప్స్'

- రిలీజ్‌కు 100 రోజులు మాత్రమే..

'టాక్సిక్: ఎ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్ అప్స్' రిలీజ్‌కు కౌంట్ డౌన్ మొదలైంది. మార్చి 19, 2026న సినిమా వరల్డ్ వైడ్ రిలీజ్ కానుంది. అంటే సినిమా రిలీజ్‌కు మరో వంద రోజుల సమయం మాత్రమే ఉంది. వచ్చే ఏడాది అందరూ ఎంతో ఆసక్తిగా వెయిట్ చేస్తోన్న సినిమాల్లో ఇదొకటి. ఇప్పటికే ఈ సినిమా నుంచి వచ్చిన అప్‌డేట్స్‌తో సినిమాపై అంచనాలు రోజు రోజుకీ పెరుగుతున్నాయి. సినిమాపై ఉన్న ఎక్స్‌పెక్టేషన్స్‌ను నెక్స్ట్ లెవల్‌కు తీసుకెళ్లేలా చిత్ర యూనిట్ 'టాక్సిక్: ఎ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్ అప్స్' నుంచి ఓ సరికొత్త, పవర్ఫుల్ పోస్టర్‌ను రిలీజ్ చేసింది. సెక్సీ, రగ్డ్ లుక్‌లో యష్ ఇందులో కనిపిస్తున్నాడు. మెలి తిరిగిన కండలతో తనొక రక్తంత నిండిన బాత్ టబ్‌లో కూర్చుని ఉన్నాడు. తన ముఖం పూర్తిగా కనిపించటం లేదు. తనపై వెలుగు పడుతుంది.. తను బయటకు దేన్నో తదేకంగా చూస్తున్నట్లున్నాడు. తన శరీరంపై ఉన్న టాటూస్ చూస్తుంటే తనలోని బ్యాడ్ యష్ వైబ్‌ను క్యారెక్టర్‌ను పోస్టర్‌తో ఆవిష్కరించే ప్రయత్నం చేస్తున్నట్లుంది. ఈ పోస్టర్‌పై అభిమానులు, ప్రేక్షకులు ప్రశంసలు కురిపిస్తున్నారు. 'టాక్సిక్: ఎ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్ అప్స్' సినిమాను మంచి పండుగ సీజన్‌లో రిలీజ్ చేస్తున్నారు. గుడి పడ్వ, ఉగాది, ఈద్ కలిసిన వారాంతం బాక్సాఫీస్ దగ్గర మంచి ఛాన్స్‌ను క్రియేట్ చేస్తోంది. టాక్సిక్ సినిమాకు సంబంధించిన సరికొత్త పోస్టర్‌తో పాటు సినిమా అద్భుతంగా రావటంలో తమదైన పాత్రను పోషిస్తోన్న టెక్నీషియన్స్ వివరాలను కూడా చిత్ర యూనిట్ ప్రకటించింది. జాతీయ అవార్డు గ్రహీత రాజీవ్ రవి సినిమాటోగ్రఫీని నిర్వహిస్తుండగా, సంగీతాన్ని యష్‌తో KGFలో కలిసి పనిచేసిన రవి బస్రూర్ అందిస్తున్నారు. ఎడిటింగ్ వర్క్‌ను ఉజ్వల్ కులకర్ణి ..ప్రొడక్షన్ డిజైన్ బాధ్యతలను టీపీ ఆబిద్ నిర్వహిస్తున్నారు. జాన్ విక్ వంటి చిత్రాలకు పని చేసిన హాలీవుడ్ యాక్షన్ డైరెక్టర్ జెజె పెర్రీ, జాతీయ అవార్డు గ్రహీత అన్బరివ్ కలిసి ఈ చిత్రంలోని కీలక యాక్షన్ సన్నివేశాలను రూపొందిస్తున్నారు. యష్, గీతూ మోహన్ దాస్ రాసిన ఈ కథను గీతూ మోహన్ దాస్ డైరెక్టర్ చేస్తున్నారు. ఇంగ్లీష్, కన్నడలో సినిమాను చిత్రీకరిస్తోన్న ఈ చిత్రాన్ని హిందీ, తెలుగు, మలయాళం సహా ఇతర భాషల్లో అనువాదం చేసి రిలీజ్ చేస్తున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థలు కెవిఎన్ ప్రొడక్షన్స్, మాన్‌స్టర్ క్రియేషన్స్ బ్యానర్స్‌పై వెంకట్ కె .నారాయణ, యష్ ఈ భారీ బడ్జెట్ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

'ఛాంపియన్' నుంచి
మనసుని హత్తుకునే పాట రిలీజ్



ఫ్రెష్, ఆకట్టుకునే కథలను అందించడంలో స్వప్న సినిమాస్ ఎల్లప్పుడూ ముందంజలో ఉంటుంది. వారి అప్ కమింగ్ వెంచర్ ఛాంపియన్ ఆసక్తికరమైన ప్రమోషనల్ కంటెంట్‌తో ఇప్పటికే బజ్ క్రియేట్ చేసింది. జీ స్టూడియోస్ సమర్పణలో ఆనంది ఆర్ట్ క్రియేషన్స్, కాన్సెప్ట్ ఫిల్మ్స్‌తో కలిసి నిర్మిస్తున్న ఈ చిత్రంలో ఈ చిత్రంలో రోషన్, అనస్వర రాజన్ లీడ్ రోల్స్ పోషిస్తున్నారు. నందమూరి కళ్యాణ్ చక్రవర్తి, అర్చన కీలక పాత్రల్లో నటించారు. ఇప్పుడు మేకర్స్ సెకండ్ సింగిల్ సల్లంగుండాలే రిలీజ్ చేశారు. వివాహానికి ముందు వధువు నిశ్శబ్దంగా కూర్చుని, తన ఇల్లు, గ్రామాన్ని విడిచిపెట్టాలనే ఆలోచనతో బాధపడుతోంది. తండ్రి ఆమెను ఓదార్చడానికి వస్తాడు. అక్కడే పాట ప్రారంభమవుతుంది. ఆమె సంతోషంగా, ప్రశాంతంగా ఉండాలని అతను ఆశీర్వదించినప్పుడు కుటుంబం మొత్తం గ్రామం వివాహ వేడుకల ప్రారంభాన్ని ఈ సాంగ్ అద్భుతంగా ప్రజెంట్ చేసింది. ప్రతి కుటుంబ సభ్యుడు వివాహానికి వారు అందిస్తున్న బహుమతుల గురించి మాట్లాడే విధానం సాంప్రదాయ వేడుక సారాంశాన్ని అందంగా చూపించింది. అప్పగింతలు సమయంలో భావోద్వేగాలు అందరికి కనెక్ట్ అయ్యాయి. మిక్కీ జె మేయర్ మ్యాజిక్ క్రియేట్ చేశారు. సల్లంగుండాలే భావోద్వేగం, వేడుక రెండింటినీ కలిగి ఉన్న మరొక అద్భుతమైన పాట. చంద్రబోస్ సాహిత్యం వివాహంలో జరిగే ప్రతి ఆచారం, భావోద్వేగాన్ని అందంగా ప్రజెంట్ చేసింది గాయకులు రితేష్ జి రావు, మనీషా ఈరబత్తిని తమ వోకల్స్ మరో మరింత అందాన్ని తీసుకొచ్చారు. బృందా గోపాల్ మాస్టర్ కొరియోగ్రఫీ పర్ఫెక్ట్ గా వుంది. నందమూరి కళ్యాణ్ చక్రవర్తి, అర్చన వధువు తల్లిదండ్రులుగా ఆకట్టుకోగా, రోషన్, అనస్వర రాజన్ జోడి డ్యాన్స్ తో పాటకు ఉత్సాహాన్ని తెస్తారు. సల్లంగుండాలే సాంగ్ ప్రతి వివాహ వేడుకలో మ్రోగబోతుంది.

Printed, Published and Owned by MOHAMMED AZIZ UR RAHAMAN, Printed at KRK PRINTERS, H.No. 2-3-703/7, Thirumalanagar Colony, Amberpet, Hyderabad, Telangana - 500013.
Published at h.no. 8-1-284/OU/521/7/9, OU Colony, Tolichowki, Golconda, Hyderabad, Telangana - 500008. Editor: FAZUL RAHAMAN MOHAMMED. 040-4390 2732, email: editor@prathipaksham.in, RNI No. APTEL/2007/19200